www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 23-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 115 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా2:29 తదుపరి అమావాస్య, నక్షత్రం: ఆర్ద్ర సా5:54 తదుపరి పునర్వసు, వర్జ్యం: తె5:19-6:50, దుర్ముహూర్తం: ఉ11:55-12:47, అమృతఘడియలు: ఉ8:31-10:01, రాహుకాలం: మ12:00-1:30, సూర్యోదయం: 5:55, సూర్యాస్తమయం: 6:47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వచ్చే 3 రోజులు అతి భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

తాండూరులో 11.18 సెం.మీ. వాన, దౌల్తాబాద్‌లో 10.68 సెం.మీ.

పలు కాలనీల్లో నీట మునిగిన ఇళ్లు

ముంపులో వందలాది ఎకరాల పంటలు

మళ్లీ తెరుచుకున్న శ్రీశైలం గేటు

14



తాండూరులోని ఆదర్శ్‌నగర్ కాలనీలో నీట మునిగిన ఇళ్లు

భారత్‌పై జల ఖడ్గం!

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్!

సరిహద్దు సమస్య కన్నా తీవ్రమైనది

డ్యామ్ నిర్మాణ ప్రాంతం.. భూకంప జోన్

భూకంపం వస్తే దిగువకు అతి భారీ వరదలు

చైనా కావాలని నీటిని వదిలినా ప్రమాదమే!

వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం

పర్యావరణంపైనా తీవ్ర ప్రభావం

2



చైనా డ్యాం నిర్మించనున్న ప్రాంతం

ఎయిరిండియా విమానంలో మంటలు

హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఫ్లైట్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

న్యూఢిల్లీ, జూలై 22: హాంకాంగ్ నుంచి ఢిల్లీకి మంగళవారం వచ్చిన ఎయిర్ ఇండియా విమానం(ఏ321)లో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం 12.12 గంటలకు ఢిల్లీ విమానాశ్రయంలో విమానం దిగిన కొద్దిసేపటికే ఆక్సిలరీ పవర్ యూనిట్ (ఏపీయూ)లో మంటలు చెలరేగాయి. అయితే విమానంలోని సాంకేతిక వ్యవస్థల కారణంగా ఏపీయూ ఆటోమేటిక్‌గా మూసుకుపోవడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులందరూ విమానంలోంచి సురక్షితంగా బయటకు వచ్చారు. ఈ ఘటనలో విమానం స్వల్పంగా దెబ్బ తిందని ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు.



రాజీనామాకు కారణాలేమిటి?

ధన్‌ఖడ్ ఆకస్మిక నిర్ణయంపై భిన్న విశ్లేషణలు



నితీశ్‌ను ఉపరాష్ట్రపతి చేయటం కోసం..

బీజేపీ అమలుపరిచిన వ్యూహంలో భాగం?

జస్టిస్ వర్మ అభిశంసనపై ప్రభుత్వంతో పెరిగిన అంతరం!

విపక్ష ఎంపీల నోటీసును స్వీకరించటంపై కేంద్రం గుస్సా!

న్యాయవ్యవస్థపై ధన్‌ఖడ్ వ్యాఖ్యలతో కేంద్రంలో అసహనం!

ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోంశాఖ

అనేక పదవుల ద్వారా ధన్‌ఖడ్ ప్రజాసేవ చేశారు: ప్రధాని

ధన్‌ఖడ్ రాజీనామా వెనుక లోతైన కారణాలున్నాయి

రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు: జైరాం

పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర సీఎం మమతతో చీటికి మాటికి సహాయనిరాకరణకు దిగిన వ్యక్తిగా, ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత ఏకంగా న్యాయవ్యవస్థపైనే తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తిగా దేశప్రజలకు చిరపరిచితమైన జగదీప్ ధన్‌ఖడ్ (74).. ఉన్నట్టుండి తన పదవికి రాజీనామా చేస్తారని ఎవరూ ఊహించలేదు. ఉపరాష్ట్రపతి వంటి అత్యున్నత పదవిలో మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే.. ఆయన ఎందుకు రాజీనామా చేశారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ధన్‌ఖడ్ రాజీనామాకు గల కారణాలపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి.. వాటిలో ఒకటి.. బిహార్ ఎన్నికలకు సంబంధించినది. త్వరలో ఎన్నికలు జరగనున్న ఆ రాష్ట్రంలో బీజేపీ ఇప్పటి వరకూ సొంతంగా అధికారంలోకి

మిగతా 2వ పేజీలో...

కొత్త ఉపరాష్ట్రపతి ఎవరు?

తెరపైకి నితీశ్, హరివంశ్, నడ్డా, థరూర్ పేర్లు!

ప్రతిపక్షాల నిరసనల హోరు

2

పార్లమెంటు ఉభయసభల్లో గందరగోళం

బిహార్ ఓటరు జాబితా సవరణపై చర్చకు పట్టు



కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం అందజేస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం

ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం

ఏర్పాటు కోసం కసరత్తు ప్రారంభం

మహాకవి పేరు శాశ్వతంగా నిలిచేలా మరిన్ని కార్యక్రమాలు

అన్ని పంచాయతీల్లో దాశరథి సాహిత్యం

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి వెల్లడి

రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి ఉత్సవాలు

అన్నవరం దేవేందర్‌కు పురస్కారం ప్రదానం

హైదరాబాద్ సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశత్వాన్ని ధిక్కరించిన యోధుడిగా, తెలుగు సాహిత్యంలో కలకాలం నిలిచే సాహిత్యాన్ని సృజించిన మహా కవిగా జననీరాజనాలు అందుకున్న దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పనున్నట్లు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ ఓ సభలో ఇదే హామీ ఇచ్చారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ట్యాంక్ బండ్ మీద లేదా నగరంలోని ఏదైనా ప్రధాన కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కుమార్తె

మిగతా 12వ పేజీలో...

రాష్ట్ర ప్రభుత్వానికి ఆ అధికారం ఉందా?

ఆర్డినెన్స్ న్యాయపరంగా నిలుస్తుందా?

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై గవర్నర్ ప్రశ్నలు

అడ్వకేట్ జనరల్‌తో జిష్ణుదేవ్ వర్మ సమావేశం

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని చట్టానికే సవరణ

ఇది చట్టపరంగా ఉన్న హక్కేనన్న ఏజీ

మరింత మంది నిపుణులతో ఆర్డినెన్స్‌పై చర్చిస్తున్న గవర్నర్.. త్వరలోనే నిర్ణయం!



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డితోపాటు మరికొందరితో మంగళవారం రాజ్‌భవన్‌లో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్డినెన్స్‌కు సంబంధించి కొన్ని కీలక ప్రశ్నలు, సందేహాలను గవర్నర్ లేవనెత్తినట్లు తెలిసింది. ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేసే అధికార పరిధి రాష్ట్ర స్థాయిలో ఉందా? న్యాయపరంగా ఇది నిలుస్తుందా? అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే.. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం ఆర్టికల్ 243 డి(6) ప్రకారం రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించింది. అదేవిధంగా ఆర్టికల్ 243 టి(6) ప్రకారం మునిసిపాలిటీల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ఇచ్చింది. రాజ్యాంగం కల్పించిన ఈ అధికారాల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఎంపిరికల్ డేటా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తుందని, రాజ్యాంగం ప్రకారమే ఈ ఆర్డినెన్స్ ఉందని అడ్వకేట్ జనరల్ ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది. అయితే.. సుప్రీంకోర్టు నిర్దేశించినట్లుగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు కదా! అని గవర్నర్ ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై ఏజీ స్పందిస్తూ.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 (ఎ)కు మాత్రమే సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తేవాలని ప్రభుత్వం భావించిందని, ఈ ఆర్డినెన్స్‌లో ఎవరెవరికి ఎంతెంత శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న ప్రస్తావన లేదని చెప్పినట్లు తెలిసింది. కానీ, సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను ఉటంకిస్తూనే ఆర్టికల్ 285(ఎ) సెక్షన్ ఉంది కదా! అని గవర్నర్ అన్నట్లు సమాచారం. అయితే.. ఆర్డినెన్స్ వచ్చాక మాత్రమే ఎంతశాతం రిజర్వేషన్లు అనేది జీవో ద్వారా ఇస్తారని, అంతవరకు సుప్రీంకోర్టు తీర్పును కూడా ఉల్లంఘించినట్లు కాబోదని ప్రభుత్వ న్యాయనిపుణులు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఆర్డినెన్స్ వ్యవహారంపై గవర్నర్ మరింత మంది న్యాయనిపుణులతోనూ మాట్లాడుతున్నారు. అన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాక దీనిపై ఆయన నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది. ఈ నిర్ణయం కూడా అతిత్వరలోనే ఉండవచ్చని తెలుస్తోంది.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

సాయంత్రం సోనియాగాంధీతో భేటీ

రేపు ఇండియా కూటమి ఎంపీలతో..

ఏఐసీసీ కార్యాలయంలో సమావేశం

బీసీల 42% రిజర్వేషన్లపై పీపీటీ

13

టెట్ ఫలితాలు విడుదల

90,205 మంది పరీక్షకు హాజరుకాగా 30,649 మంది పాస్

34 శాతం ఉత్తీర్ణత నమోదు

13

ఊబకాయాన్ని పసిగట్టే జన్యు పరీక్ష

పెద్దయ్యాక స్థూలకాయం బారిన పడే ప్రమాదంపై చిన్నప్పుడే చెప్పే పాలిజెనిక్ రిస్క్ స్కోర్

12

జీవనశైలి మార్పులతో ఆ ముప్పును తప్పించుకునే వీలు

అంతర్జాతీయ అధ్యయనంలో భాగంగా భారతీయుల జన్యువులపై సీసీఎంబీ పరిశోధన



హాస్టల్ గదిలో పుట్టిన స్టార్టప్

ఆర్మీకి డ్రోన్ల సరఫరా చేస్తోంది!

హైదరాబాద్ బిట్స్ పిలానీ విద్యార్థుల ఘనత

10

స్టార్టప్ రూపొందించిన 2 నెలలకే సైన్యానికి యూఏవీల సరఫరా

రాష్ట్ర సర్కారు వైఫల్యాలను ఎండగట్టండి

నాయకులందరినీ కలుపుకొని వెళ్లండి

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాంచందర్‌రావుకు జేపీ నడ్డా దిశానిర్దేశం

బీజేపీది బీసీ వ్యతిరేక నైజం

బీసీలకు రిజర్వేషన్ల పెంపు తమిళనాడులో సాధ్యమైనప్పుడు ఇక్కడెందుకు కాదు: పొన్నం

బీసీలపై బీజేపీ కుట్రలు: ఆది శ్రీనివాస్

బీజేపీ వైఖరేంటో 48 గంటల్లో తేల్చాలి: జాజుల



బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని, నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచందర్‌రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన వైఫల్యాలను ప్రజల్లో

మిగతా 12వ పేజీలో...

మహాలక్ష్మి.. మరో మైలురాయి



ఆర్టీసీలో 200 కోట్లు దాటిన ఉచిత ప్రయాణాలు

మహిళా ప్రయాణికులకు రూ. 6,700 కోట్ల ఆదా

సంస్థ అధికారులు, సిబ్బందికి మంత్రి పొన్నం ప్రశంస

నేడు డిపోలు, బస్ స్టేషన్లలో సంబురాలు

ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్ అభినందనలు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మరో మైలురాయిని అధిగమించిందని టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 2 రోజుల్లోనే కాంగ్రెస్ సర్కారు 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పేరిట మహిళల కోసం ప్రారంభించిన 'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం' కింద గత 18 నెలల్లో రికార్డు స్థాయిలో 200 కోట్ల మంది ప్రయాణించారని ఓ ప్రకటనలో పేర్కొంది. తొలినాళ్లలో రోజుకు సగటున 14 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తే.. ప్రస్తుతం రోజూ సుమారు 30 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. హైదరాబాద్‌లో విద్యార్థినులు, ఉద్యోగినులతోపాటు సాధారణ మహిళలు.. రోజూ సుమారు 8 లక్షల మంది సిటీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ పథకం కింద మహిళలు

మిగతా 10వ పేజీలో...



పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు!

13

తొలి దశలో జీహెచ్ఎంసీ పరిధిలో అమలు

పేదలు నివసిస్తున్న చోటే జీ+3 పద్ధతిలో నిర్మాణం

4 జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్ష

అవసరమైన స్థలాలను గుర్తించాలని ఆదేశం

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే పథకం తొలిదశ కొలిక్కి

ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాహారం తిని

ఆస్పత్రిపాలు!

ఒకే కుటుంబానికి చెందిన 9 మందికి తీవ్ర అస్వస్థత

ఒకరి మృతి.. మిగిలిన వారికి కొనసాగుతున్న చికిత్స

ముగ్గురి పరిస్థితి విషమం.. మృతుడు ఆర్టీసీ కండక్టర్

హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో విషాదం

వనస్థలిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాహారాన్ని వేడి చేసుకుని తిని ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఆస్పత్రి పాలయ్యారు. వారిలో ఒకరు మరణించగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ యాదవ్(46) తన భార్య రజిత(38), కుమార్తెలు

మిగతా 3వ పేజీలో...

ఆస్పత్రుల్లో కరెంట్ కష్టాలకు చెక్

107 ప్రభుత్వ ఆస్పత్రుల్లో డీజిల్ జనరేటర్లు.. 3 నెలల్లో ఏర్పాటు

రూ. 21.96 కోట్లు మంజూరు..

కొనుగోలుకు టెండర్లు

3

రాష్ట్రంలోని 215 ఆస్పత్రుల్లో 109 చోట్ల ఇప్పటికే జనరేటర్లు



నేడు విద్యాసంస్థల బంద్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

12

నిజామాబాద్‌లో పామాయిల్ పరిశ్రమ!

బోధన్ ప్రాంతంలో ఏర్పాటుకు సీఎం సుముఖం

ఈ నెలాఖరున జరిగే సభలో ప్రకటన!

13

ప్రతిపక్షాల నిరసనల హోరు..

» పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 22 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు, మంగళవారం కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో గందరగోళం కొనసాగింది. ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు చేసిన నిరసనలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. దీంతో పలు మార్లు వాయిదాలు పడిన ఉభయసభలు ఎలాంటి చర్చలు లేకుండానే బుధవారానికి వాయిదా పడ్డాయి. ఎస్ఐఆర్, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. కాగా, ప్రతిపక్ష సభ్యులు ద్వంద్వ వైఖరి అనుసరిస్తున్నారని, వారి డిమాండ్‌కు అనుగుణంగా చర్చ నిర్వహిస్తామని చెప్పినా సహకరించడం లేదని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు అసహనం వ్యక్తం చేశారు. అటు రాజ్యసభ కూడా ఎస్ఐఆర్ అంశంపై ప్రతిపక్షాల నిరసనలతో పలుమార్లు వాయిదా పడింది. కాగా, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ మకర్ ద్వారం వద్ద ఆందోళన చేశారు.

నేడు యూకే పర్యటనకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 22: ప్రధాని మోదీ బుధవారం యూకే పర్యటనకు వెళ్లనున్నారు. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకం చేయడం, రక్షణ, భద్రతా రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకునే చర్యల్లో భాగంగా ప్రధాని మోదీ యూకేలో పర్యటించనున్నారని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఈ పర్యటనలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ భేటీ కానున్నారని చెప్పారు. ఈ పర్యటనకు మోదీతో పాటు కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ కూడా వెళ్లనున్నారు. బ్రిటన్ పర్యటన ముగిసిన అనంతరం మోదీ అటు నుంచి నేరుగా మాల్దీవుల పర్యటనకు వెళ్లనున్నారు.

భారత్ అమ్ములపొదిలోకి 3 అపాచీ హెలికాప్టర్లు

న్యూఢిల్లీ, జూలై 22: అత్యంత శక్తివంతమైన అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు భారత అమ్ములపొదిలో చేరాయి. మూడు చాపర్లను అమెరికా ఏరోస్పేస్ దిగ్గజం బోయింగ్ మంగళవారం అందించిందని భారత ఆర్మీ అధికారులు తెలిపారు. ఒప్పందంలో భాగంగా మొత్తం 6 ఏహెచ్-64ఈ అపాచీ చాపర్లను ఆ కంపెనీ అందించాల్సి ఉండగా తొలిదశలో మూడు చాపర్లు ఇచ్చిందని వెల్లడించారు. బహుముఖంగా వినియోగించే అత్యాధునిక ఏహెచ్-64ఈ యుద్ధ హెలికాప్టర్లు అమెరికా ఆర్మీలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీటి రాకతో భారత ఆర్మీ సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని సోషల్ మీడియా పోస్టులో ఆర్మీ పేర్కొంది. మిగిలిన మూడు హెలికాప్టర్లు ఈ ఏడాది చివరకు వస్తాయని భావిస్తున్నారు. గతేడాది మార్చి 15న భారత ఆర్మీ తొలి అపాచీ యూనిట్ 451 ఆర్మీ ఏవియేషన్ స్క్వాడ్రన్‌ను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేసింది. ఇప్పుడు వచ్చిన మూడు హెలికాప్టర్లను జోధ్‌పూర్‌లోనే మోహరించనున్నారని ఏఎన్ఐ వార్తా సంస్థకు ఆర్మీ అధికారులు తెలిపారు.

రైళ్లలో బాంబు పేలుళ్ల కేసు తీర్పుపై సుప్రీంలో అప్పీలు

న్యూఢిల్లీ, జులై 22: బాంబు పేలుళ్ల కేసులో 12 మంది నిందితులను బాంబే హైకోర్టు నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. దీనిపై గురువారం సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారణ జరపనుంది. ఇది తీవ్రమైన విషయమని, అత్యవసర ప్రాతిదికన కేసును స్వీకరించాలని ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వినతిని ధర్మాసనం అంగీకరించింది. హైకోర్టు సోమవారం తీర్పు ఇవ్వగా ఇప్పటికే ఎనిమిది మంది జైలు నుంచి విడుదలయ్యారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 2006లో ముంబయి లోకల్ ట్రైన్‌లో జరిగిన బాంబు పేలుడులో 180మందికిపైగా మృతి చెందడం గమనార్హం.

'కావడి' మార్గంలోని హోటళ్లలో లైసెన్సులను ప్రదర్శించాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 22: కావడి యాత్ర సాగే మార్గంలో ఉన్న హోటళ్లు, ఫలహారశాలల్లో లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ప్రదర్శించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. హోటళ్ల వద్ద అన్ని వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను పెట్టాలంటూ యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కావడి యాత్రకు మంగళవారమే చివరి రోజు కావడంతో ఈ సమయంలో ఇంతకుమించి జోక్యం చేసుకోబోమని ధర్మాసనం తెలిపింది.

ఎట్టకేలకు నింగిలోకి బ్రిటన్ ఫైటర్ జెట్ 'ఎఫ్-35బీ'



తిరువనంతపురం, జూలై 22: సోషల్ మీడియాలో కడుపుబ్బనవ్వించే మీమ్స్‌కు, కామెంట్లకు దారితీసిన బ్రిటీష్ యుద్ధ విమానం ఎఫ్-35బీ దాదాపు 5 వారాల తర్వాత నింగిలోకి ఎగిరింది. గత నెలలో జరిగిన భారత్-బ్రిటన్ నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఎఫ్-35బీ విమానానికి అకస్మాత్తుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఈ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయంలో దింపేశారు. అప్పటి నుంచి ఆ విమానం అక్కడే ఉంది. దీనిలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని గుర్తించడంలోనే నిపుణులు ప్రయాసపడ్డారు. ఈ నెల 6న 14 మందితో కూడిన బ్రిటన్ ఇంజనీరింగ్ నిపుణుల బృందం.. రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో ఎఫ్-35బీని పరిశీలించి.. సాంకేతిక సమస్యలను గుర్తించింది. అనంతరం.. భారత వైమానిక నిపుణుల బృందంతో కలిసి.. ఇంజన్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించింది. కాగా, 5 వారాలకు పైగా తిరువనంతపురం విమానాశ్రయంలో ఉన్న ఎఫ్-35బీ యుద్ధ విమానానికి ల్యాండింగ్ చార్జీలు, రోజువారీ అద్దె, పార్కింగ్ ఫీజుల రూపంలో రూ.5-6 లక్షలు వసూలు చేసినట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

APPOINTMENTS

జాతీయ బుద్ధిమాంద్యుల (దివ్యాంగజన్) సాధికారత సంస్థ
(బుద్ధిమాంద్యుల (దివ్యాంగజన్) సాధికారత శాఖ)
సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
మనోవికాస్‌నగర్, సికింద్రాబాద్ - 500 009
ISO 9001:2015 సంస్థ
nqa. ISO 9001 Registered

టెలిఫోన్ నం,27751741-745, ఫ్యాక్స్ నం.040-27750198
వెబ్‌సైట్: www.niepid.nic.in

గెస్ట్ ఫ్యాకల్టీ/సిబ్బంది ఉద్యోగాలు - 2025
ఎంప్యానెల్‌మెంట్ కొరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

NIEPID సికింద్రాబాద్ కొరకు మరియు నోయిడా, నవీ ముంబై, కోల్‌కతా & MSEC, నోయిడా వద్దగల రీజినల్ సెంటర్ల కొరకు మరియు రాజ్‌నంద్‌గావ్, దేవనగెరె మరియు నెల్లూరు వద్దగల కాంపోజిట్ రీజినల్ సెంటర్ల కొరకు గెస్ట్ ఫ్యాకల్టీ/సిబ్బందిగా పని చేయడానికి ప్రొఫెషనల్స్/ పర్సనల్ ఎంప్యానెల్‌మెంట్ కొరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు/ స్క్రీనింగ్. ఉద్యోగ ఖాళీల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించడానికి సెంటర్ వారీగా షెడ్యూలు దిగువ వివరించబడిన విధంగా ఉంది.
వాక్-ఇన్ ఇంటర్వ్యూలు/ స్క్రీనింగ్ షెడ్యూలు:

క్రసం.	సెంటర్ పేరు	తేదీలు
1	NIEPID రీజినల్ సెంటర్, కోల్‌కతా	28 జూలై, 2025
2	NIEPID రీజినల్ సెంటర్, నవీ ముంబై	30 జూలై, 2025
3	NIEPID రీజినల్ సెంటర్, నోయిడా & MSEC	31 జూలై & 1 ఆగస్టు 2025
4	కాంపోజిట్ రీజినల్ సెంటర్, రాజ్‌నంద్‌గావ్	4 ఆగస్టు 2025
5	కాంపోజిట్ రీజినల్ సెంటర్, దేవనగెరె	6 ఆగస్టు 2025
6	కాంపోజిట్ రీజినల్ సెంటర్, నెల్లూరు	8 ఆగస్టు 2025
7	NIEPID హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్	11 & 12 ఆగస్టు 2025

విద్యార్హతలు, అనుభవం, ప్రతిఫలం, నియమ నిబంధనలకు సంబంధించి పూర్తి వివరాల కోసం మరియు దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేయడానికి ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్ www.niepid.nic.in దర్శించండి. ఏదేని ఇతర సమాచారం కొరకు సంప్రదించండి: ఫోన్ నం.040-27751741-45 ఎక్స్‌టెన్షన్ 209

సం/- డైరెక్టర్

ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం



రాష్ట్రపతి ముర్ముతో ధన్‌ఖడ్(ఫైల్)

గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోం శాఖ

» ప్రజా సేవ చేయడానికి ఆయనకు అనేక పదవులు దక్కాయి: మోదీ


» రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ, జూలై 22: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ధన్‌ఖడ్ రాజీనామా లేఖను పొందుపరచింది. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో.. సభాధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ ఘన్‌శ్యామ్ తివారీ.. ధన్‌ఖడ్ రాజీనామా రాష్ట్రపతి ఆమోదం పొందిన విషయాన్ని సభ్యులకు తెలిపారు. ఇక.. జగ్‌దీప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. ఉపరాష్ట్రపతి పదవి సహా వివిధ పదవులు, హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు జగదీప్ ధన్‌ఖడ్‌కు పలు అవకాశాలు దక్కాయని.. ఆయన ఆరోగ్యంగా ఉండాలని తాను కోరుకుంటున్నానని ఆయన ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు.. ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాకు కారణం ఆయన అనారోగ్యం అయి ఉండదని, మరింత లోతైన కారణాలేవో ఉండి ఉంటాయని విపక్షాలు అంటున్నాయి. ముఖ్యంగా.. పార్లమెంటు వర్షాకాల సమావేశాల మొదటిరోజైన సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.30 గంటల నడుమ జరిగిన తీవ్ర పరిణామాలే ఆయనను ఈ నిర్ణయానికి పురికొల్పి ఉంటాయని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ధన్‌ఖడ్ అధ్యక్షతన సభావ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం జరిగిందని.. దానికి రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కిరెన్ రిజిజు సహా పలువురు సభ్యులు హాజరయ్యారని.. సాయంత్రం 4.30 గంటలకు మరోసారి భేటీ కావాలని సమావేశం నిర్ణయించిందని.. జైరామ్ రమేశ్ తన పోస్టులో వివరించారు. "సాయంత్రం 4.30 గంటలకు మళ్లీ ధన్‌ఖడ్ నేతృత్వంలో బీఏసీ సమావేశం మొదలైంది. జేపీ నడ్డా, రిజిజు రాక కోసం ఆ భేటీకి హాజరైన సభ్యులంతా ఎదురుచూశారు. కానీ.. వారిద్దరూ రాలేదు. వారి గైర్హాజరు గురించి ధన్‌ఖడ్‌కు వ్యక్తిగతంగా సమాచారమేదీ లేదు. దీంతో సహజంగానే ఆయన అసంతృప్తి చెందారు. బీఏసీ భేటీని మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు వాయిదా వేశారు. అంటే.. నడ్డా, రిజిజు ఉద్దేశపూర్వక గైర్హాజరుకు.. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.30 గంటల నడుమ ఏదో తీవ్ర పరిణామమే జరిగింది" అని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాదు.. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా గురించి మోదీ మాటమాత్రమైన ప్రస్తావించకపోవడం.. మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. ధన్‌ఖడ్ రైతుల సంక్షేమం కోసం ధైర్యంగా మాట్లాడేవారని, న్యాయవ్యవస్థ జవాబుదారీతనంపైనా బలంగా మాట్లాడారని పేర్కొన్నారు. ప్రస్తుత జీ2 (మోదీ, అమిత్‌షాలను ఉద్దేశించి) పాలనలో సైతం.. ధన్‌ఖడ్ విపక్షాలకు ఎంతో కొంత అవకాశం ఇవ్వడానికి ప్రయత్నించారని కొనియాడారు. ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపినప్పుడు బీజేపీ ఆయన్ను 'రైతు బిడ్డ'గా పదేపదే పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ.. 'రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు' అని ధ్వజమెత్తారు. ఈ విషయంలో ప్రధాని మరింత కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించి ఉండాల్సిందన్న జైరామ్ రమేశ్.. "అంతేలే! ఆయన అసలే కాపట్యానికి, వంచనకు సుప్రీం మాస్టర్ కదా" అని వ్యంగ్యంగా అన్నారు. అయితే.. జైరామ్ అనుమానాలను జేపీ నడ్డా కొట్టిపారేశారు. ఆ భేటీకి తాము రావట్లేదన్న విషయాన్ని ఉపరాష్ట్రపతి కార్యాలయానికి తాము ముందే తెలియజేశామన్నారు.

ఎన్డీయే కూటమికే సంఖ్యా బలం..

ధన్‌ఖడ్ రాజీనామా నేపథ్యంలో.. ఉపరాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో గెలవడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీయే కూటమికి ఉంది. లోక్‌సభ, రాజ్యసభల్లో ఖాళీగా ఉన్న స్థానాలను మినహాయిస్తే.. ప్రస్తుతానికి ఉభయసభల్లో సభ్యుల సంఖ్య (రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులతో కూడా కలిపి) 786. ఉపరాష్ట్రపతిగా గెలవాలంటే 394 ఓట్లు రావాలి. లోక్‌సభలో ఎన్డీయేకి 293 మంది సభ్యుల బలం ఉంది. రాజ్యసభలో 129 మంది (నామినేటెడ్ సభ్యులను కూడా కలుపుకొంటే) సభ్యుల మద్దతు ఉంది. అంటే.. ఉభయసభల్లో కలిపి 422 మంది సభ్యుల మద్దతు. కాబట్టి ధన్‌ఖడ్ స్థానంలో మళ్లీ ఎన్డీయే అభ్యర్థి ఉపరాష్ట్రపతి కావడం ఖాయం.

లోకం తీరు



కొత్త ఉపరాష్ట్రపతి ఎవరు?

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాల సమావేశాల్లోనే కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహించాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. తదుపరి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలా అనే అంశంపై అటు మోదీ ప్రభుత్వం, ఇటు విపక్షాలు మంతనాలు మొదలుపెట్టాయి. బిహార్ ఎన్నికల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సీఎం నీతీశ్ కుమార్ లేదా ప్రస్తుతం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్‌లో ఎవరో ఒకరిని ఎన్డీయే కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా జగత్ ప్రకాశ్ నడ్డా స్థానంలో మరొకర్ని నియమించనున్నందువల్ల.. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నడ్డాకే అవకాశం ఇవ్వొచ్చనే వాదన కూడా బీజేపీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు.. కాంగ్రెస్ అసమ్మతి నేత శశిథరూర్‌ను నిలబెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

రాజీనామాకు కారణాలేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

రాలేదు. ప్రస్తుతం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూతో కలిసి కమలం పార్టీ కూటమి ప్రభుత్వం కొలువై ఉన్న విషయం తెలిసిందే. నితీశ్‌ను రాష్ట్ర రాజకీయాల్నుంచి తప్పించి, ఉపరాష్ట్రపతిని చేస్తే బిహార్‌లో బీజేపీ అవకాశాలు మరింత పెరుగుతాయని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తోందని, దాంట్లో భాగంగానే ధన్‌ఖడ్ రాజీనామా అని ఓ వాదన వినిపిస్తోంది. బిహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ దీనిపై స్పందిస్తూ.. నితీశ్ ఉపరాష్ట్రపతి అయితే రాష్ట్రానికి ఎంతో మంచిదని పేర్కొనటం విశేషం.

ప్రభుత్వంతో పెరిగిన అంతరం

కేంద్రప్రభుత్వానికి, ధన్‌ఖడ్‌కు మధ్య అంతరం పెరిగిందని, ఈ నేపథ్యంలోనే ఆయన రాజీనామా చేశారన్నది మరో వాదన. దీని ప్రకారం.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అభిశంసనపై ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసును ధన్‌ఖడ్ స్వీకరించటం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. ఓవైపు ఇదే అంశంపై లోక్‌సభలో ప్రభుత్వం నోటీసు ఇచ్చే ప్రక్రియలో ఉంది. ఇంతలోనే రాజ్యసభలో ప్రతిపక్షాల నోటీసును ధన్‌ఖడ్ స్వీకరించటంతో.. జస్టిస్ వర్మ అభిశంసన అంశం తాలూకు క్రెడిట్ తమకు దక్కకుండా పోయిందని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే, పార్లమెంటు సమావేశాల తొలిరోజైన సోమవారం జరిగిన రాజ్యసభ 'సభా వ్యవహారాల సంఘం' భేటీకి ప్రభుత్వం తరఫున సభ నాయకుడు జేపీ నడ్డా, పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ హాజరు కాలేదని తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత సభలో కార్యకలాపాలు మొదలయ్యాయి. ఆపరేషన్ సిందూర్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతుండటంతో.. నడ్డా వారిని హెచ్చరిస్తూ మాట్లాడారు. 'ఏదీ రికార్డుల్లోకి వెళ్లదు. నేను చెప్పినవి మాత్రమే రికార్డవుతాయి' అన్నారు. సభలో పూర్తి అధికారం సభాపతి అయిన చైర్మన్‌దే అయినప్పటికీ, నడ్డా ఈ విధంగా మాట్లాడటం సభాపతిని అవమానించటమేనంటూ కాంగ్రెస్ విమర్శించింది. ఈ విధంగా ప్రభుత్వంతో పెరిగిన అంతరం నేపథ్యంలోనే ధన్‌ఖడ్ రాజీనామా చేశారన్నది ఒక వాదన.

న్యాయవ్యవస్థపై తీవ్రవ్యాఖ్యలు

2022లో ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత న్యాయవ్యవస్థపై తరచూ విమర్శలు చేయటం ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటుదే అత్యున్నత పాత్ర అని, న్యాయవ్యవస్థ అప్పుడప్పుడూ పరిధి దాటి ప్రవర్తిస్తోందంటూ వ్యాఖ్యలు చేశారు. 'జాతీయ న్యాయ నియామకాల కమిషన్' చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మరీ శృతిమించటం ప్రభుత్వ పెద్దలకు చికాకు కలిగించిందని, దీనివల్లే ఆయనను పక్కన పెట్టారని మరో వాదన. ఏదేమైనా, తాను తన పదవీ కాలం పూర్తి చేసుకొని 2027 ఆగస్టులో రిటైర్ అవుతానని ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఇటీవలే ప్రకటించిన ధన్‌ఖడ్..ఇంతలోనే మనసు మార్చుకోవటం విశేషం. - సెంట్రల్ డెస్క్

తమిళనాడు, కేరళకు కేంద్రం గుండు సున్నా

» 2024-25లో విద్యా నిధుల కింద ఒక్క రూపాయి ఇవ్వని కేంద్రం.. ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 22: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), పీఎం-శ్రీ పథకాల కింద 2024-25లో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కేంద్ర విద్యా శాఖ పేర్కొంది. 2023-24లో ఎస్ఎస్ఏ కింద తమిళనాడుకు రూ.1876.16 కోట్లు, కేరళకు రూ.141.66 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానం-2020 అమలు కోసం రూపొందించిన పీఎం-శ్రీ పథకంలో భాగస్వామ్యం అయ్యేందుకు నిరాకరించడంతో ఆ రాష్ట్రాలకు నిధులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జూలై 21న పార్లమెంటుకు లిఖిత పూర్వక వివరణ ఇచ్చింది. మరోవక్క, 2024-25లో ఎస్ఎస్ఏ కింద ఉత్తరప్రదేశ్‌కు రూ.6,264.79 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.246.86 కోట్లు అందాయి. అలాగే, మధ్యప్రదేశ్‌కు ఎస్ఎస్ఏ కింద రూ.3,434.71 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.145.32 కోట్లు అందాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతోందన్న విమర్శలు అధికమయ్యాయి. అయితే, పీఎం- శ్రీ పాఠశాలల్లో జాతీయ విద్యా విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం చెబుతోంది. కానీ, జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు, కేరళలు ఎప్పట్నించో వ్యతిరేకిస్తున్నాయి.

రాష్ట్రపతి సందేహాలపై మీ స్పందన తెలపండి

» కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 22: 'బిల్లుల ఆమోదానికి నిర్దిష్ట గడువు' అంశంలో రాష్ట్రపతి ప్రస్తావించిన 14 కీలక ప్రశ్నలపై అభిప్రాయాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుధవారం నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై వచ్చే నెల నుంచి విచారణను కొనసాగిస్తామని, ఈ నెల 29న షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది. ఇది ఒక రాష్ట్రానికి మాత్రమే సంబంధించిన అంశం కాదని, యావత్ దేశానికి వర్తించేదని పేర్కొంది. వచ్చే మంగళవారానికల్లా కేంద్రం, రాష్ట్రాలు స్పందన తెలియజేయాలని సూచించింది. శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాలని ఏప్రిల్ 8 సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు గుర్తింపు కోసమే..

» ఆధార్ పౌరసత్వానికి ఆధారం కాదు

» బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఈసీ వివరణ

» సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు

న్యూఢిల్లీ, జూలై 22: ఆధార్, ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డు కేవలం గుర్తింపు కోసమేనని ఎన్నికల కమిషన్(ఈసీఐ) స్పష్టం చేసింది. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ-స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యానికి సమాధానంగా ఈసీఐ మంగళవారం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితా శుద్ధీకరణ జరుగుతోందని.. దీనివల్ల అర్హత లేని వ్యక్తులను జాబితా నుంచి తొలగించడం సాధ్యమవుతుందని ఆ అఫిడవిట్‌లో వివరించింది. ఈ చర్యతో భారత రాజ్యాంగంలోని 19వ అధికరణకు భంగం కలుగుతుందనే పిటిషనర్ల వాదనలను ఖండిస్తూ.. ఎన్నికల ప్రక్రియను నిర్దేశించే ప్రకరణలు, చట్టాలను గురించి వివరించింది. ఈ క్రమంలోనే ఆధార్, ఓటర్‌ఐడీ, రేషన్ కార్డులను కేవలం గుర్తింపు ప్రయోజనాలకే పరిమితంగా వాడుతున్నట్లు తెలిపింది. "ఆధార్ అనేది పౌరసత్వానికి లేదా నివాస ధ్రువీకరణకు ఆధారం కాదు. ఈ విషయాన్ని ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 స్పష్టం చేస్తోంది" అని ఈసీ తన అఫిడవిట్‌లో గుర్తుచేసింది. కాగా.. బిహార్‌లోని మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లలో జూలై 18 నాటికి 7.11 కోట్ల మంది(90.12%) తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఈసీకి సమర్పించారు. మరణించిన వారు, శాశ్వతంగా నివాసాన్ని మార్చుకుని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని కలుపుకొంటే.. ఫారాలను సమర్పించిన ఓటర్లు 94.68శాతంగా ఉన్నారు. కాగా, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉంటారని ఈసీ భరోసానిచ్చింది.



52 లక్షల మంది పేర్ల తొలగింపు

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా 52 లక్షల మంది పేర్లను తొలగించినట్లు ఈసీ ప్రకటించింది. ఇందులో 18 లక్షల మంది మరణించినట్లు గుర్తించామని, మరో 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారారని వివరించింది. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్న 7 లక్షల మందిని తొలగించి, ఒకేచోట అవకాశం కల్పించినట్లు తెలిపింది. మరో 21.36 లక్షల మంది ఆచూకీ తెలియరావడం లేదని, వారిని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపులపై వచ్చే నెల 1 ముసాయిదా జాబితాను విడుదల చేసి.. సెప్టెంబరు 30న తుది జాబితాను విడుదల చేస్తామంది.

భరణం కింద బీఎండబ్ల్యూ కారు, ముంబైలో ఇల్లు, 12 కోట్లు

» భర్త నుంచి కోరుతూ సుప్రీంకోర్టులో యువతి పిటిషన్

» ఉద్యోగం చేయడంపైన దృష్టి పెట్టాలని సీజేఐ హితవు

న్యూఢిల్లీ, జూలై 22: మనోవర్తి కింద భర్త నుంచి మీరు ఏం కోరుకుంటున్నారు? అని ఆమెను సీజేఐ జస్టిస్ గవాయ్ అడగ్గా "నాకు బీఎండబ్ల్యూ హైఎండ్ మోడల్ కారు కావాలి. ముంబైలోని ఖరీదైన ఇల్లు, పోషణ కింద రూ.12 కోట్ల నగదును ఇప్పించండి" అని ఆ భార్య సమాధానమిచ్చింది. పెళ్లయిన రెండేళ్లలోపే ఓ జంట విడాకులకు సిద్ధమైతే.. పెద్ద మొత్తంలో భరణం కోరుతూ భార్య సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీన్ని విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, భారీ మొత్తంలో ఆ యువతి మనోవర్తి కోరడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "పెళ్లయిన 18 నెలలకే మీరు విడాకులు తీసుకుంటున్నారు. 18నెలల వైవాహిక జీవితానికి ప్రతిగా నెలకు రూ.కోటి చొప్పున భరణం కింద భర్తను కోరుతున్నారా" అని వ్యాఖ్యానించారు. "మీరు ఎంబీఏ చదివారు. ఐటీ ప్రొఫెషనల్ కూడా. మీకు సంపాదించుకునే సామర్థ్యం ఉంది. చక్కని ఉద్యోగం చేసుకోండి" అని పిటిషనర్‌కు సూచించారు. దీనికి ఆమె బదులిస్తూ.. తన భర్త పెద్ద ధనవంతుడని వివరించారు. తాను మానసిక సమస్యలతో బాధపడుతున్నానని ఆరోపిస్తూ ఆయనే తనకు విడాకులివ్వడానికి నిర్ణయించుకున్నారని చెప్పారు. "నేనేమైనా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లుగా అనిపిస్తోందా మై లార్డ్" అని జస్టిస్ గవాయ్‌ని ఆమె ప్రశ్నించారు. అయితే.. ముంబైలోని కాల్‌పతరులోని ఇల్లు.. అక్కడున్న మంచి భవనాల్లో ఒకటని.. ఆ ఇల్లు... లేదంటే రూ.4 కోట్ల భరణం తీసుకోవాలని జస్టిస్ గవాయ్ ఆమెకు సూచించారు.

భారత్‌పై జల ఖడ్గం!

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్.. సరిహద్దు సమస్య కన్నా తీవ్రమైనదే

న్యూఢిల్లీ, జూలై 22: బ్రహ్మపుత్ర నదిపై చైనా చేపట్టిన భారీ డ్యామ్.. భారత్‌కు ఎన్నో విధాలుగా నష్టానికి దారితీస్తుందనే చర్చ జరుగుతోంది. చైనాతో ఉన్న సరిహద్దుల వివాదం కంటే కూడా ఈ డ్యామ్ తీవ్ర సమస్యగా మారుతుందనేటటట అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మపుత్ర నదిపై అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలోని న్యింగ్చి ప్రాంతంలో ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణ పనులను చైనా ప్రధాన మంత్రి లీ కియాంగ్ ఈ నెల 19న ప్రారంభించారు. సుమారు రూ.14.5 లక్షల కోట్లు (167.8 బిలియన్ డాలర్లు) వ్యయంతో చేపట్టిన ఈ డ్యామ్.. ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా. ఈ క్రమంలో నీటి నిల్వ అత్యంత భారీ స్థాయిలో ఉంటుంది. అయితే ఈ డ్యామ్‌తో నదిలో నీటి ప్రవాహం తగ్గే అవకాశం తక్కువేనని, కానీ చైనా ఎప్పుడైనా కావాలని ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే.. దిగువన పరీవాహక ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చి నీట మునుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అరుణాచల్ సీఎం పెమా ఖండూ ఇటీవల ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ... చైనాతో మిలటరీ సమస్య కంటే డ్యామ్ అంశం పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. చైనా దీనిని ఒక 'నీటి బాంబు'లా ప్రయోగించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

డ్యామ్ నిర్మాణ ప్రాంతం.. భూకంప జోన్..

టిబెట్‌లో హిమాలయాల్లో జన్మించే బ్రహ్మపుత్ర నది (చైనాలో యార్లుంగ్ త్సాంగ్‌పోగా పిలుస్తారు) తూర్పు దిశగా ప్రవహించి... నమ్చా బర్వా పర్వత ప్రాంతంలో వెనక్కి తిరిగి (యూటర్న్) పడమర దిశగా ప్రవహిస్తుంది. ఈ మలుపు దగ్గరే భారత్‌లోకి ప్రవేశించి.. అరుణాచల్, అస్సాం మీదుగా ప్రవహించి, బంగ్లాదేశ్‌కి వెళుతుంది. ఇందులో నది మలుపు తిరిగే ప్రాంతంలోనే చైనా భారీ డ్యామ్‌ను నిర్మిస్తోంది. ఇది భారత ఉపఖండ భూఫలకం (టెక్టానిక్ ప్లేట్), యురేషియా భూఫలకం కలిసే ప్రాంతమని.. భూకంపాలకు ఆస్కారం ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. చైనా డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతానికి సమీపంలో 1950లో రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రతతో భారీ భూకంపం వచ్చింది. అస్సాం నుంచి టిబెట్ వరకు ప్రకంపనలతో అదిరాయి. హిమాలయాల ప్రాంతమంతా భూకంప జోన్-4లో ఉంది. అలాంటి ప్రాంతంలో అతి భారీ డ్యామ్ అంటే.. నీటి బాంబును పక్కన పెట్టుకున్నట్టేనని నిపుణులు చెబుతున్నారు.

- టిబెట్‌లోని బ్రహ్మపుత్ర ఉపనదులపై చైనా మొత్తంగా 130 డ్యామ్‌ల నిర్మాణం తలపెట్టింది. అందులో కొన్ని ఇప్పటికే పూర్తయ్యాయి కూడా. ఇవన్నీ కలసి ఆ ప్రాంతంలో భూకంపాల సమస్యను పెంచుతాయని కెనడాకు చెందిన 'ప్రోబ్ ఇంటర్నేషనల్' సంస్థ 2012లోనే హెచ్చరించడం గమనార్హం.
- చైనా ఇలా పెద్ద సంఖ్యలో నిర్మిస్తున్న డ్యామ్‌లన్నీ నీటిని నిల్వ చేసుకునేందుకు వీలున్నవేనని.. దానివల్ల ఎండాకాలంలో బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గి నీటి కరువు ఏర్పడే ప్రమాదం ఉంది.
- చైనా కడుతున్న డ్యామ్ నుంచి విద్యుత్ కేంద్రాలకు నీటిని తరలించేందుకు పర్వతాన్ని తొలిచి, ఒక్కోటి 20 కిలోమీటర్ల పొడవైన ఆరు భారీ టన్నెళ్లను నిర్మించనుంది. ఇది ఆ ప్రాంతంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ముందు జాగ్రత్తగా భారత్ భారీ ప్రాజెక్టు చేపట్టినా..

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్, దానితో వచ్చే నష్టాలను ఎదుర్కొనగలిగేలా భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు భారత్ సిద్ధమైంది. చైనా నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించే సియాంగ్ జిల్లాలో భారీ డ్యామ్‌తోపాటు 11 వేల మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాలనూ నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టింది. చైనా ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే.. దిగువన భారీ వరదలు రాకుండా ఈ ప్రాజెక్టు వీలు కల్పిస్తుంది. అయితే అక్కడి గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది.

వాట్సాప్ గ్రూప్‌లో ఎమోజీ పెట్టాడని.. ఓ వ్యాపారిని కొట్టిచంపిన వ్యక్తులు

» సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘోరం


కృపాకర్(ఫైల్)

సూర్యాపేట క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓ కుల సంఘానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఉప్పు-నిప్పుగా ఉన్న ఇద్దరిలో ఒకరు పెట్టిన పోస్టుకు మద్దతుగా చప్పట్లతో కూడిన ఎమోజీ పెట్టడమే అతడు చేసిన తప్పయింది! ఎమోజీ ఎందుకు పెట్టావంటూ గ్రూపులోని వ్యక్తి కన్నెర్ర చేయడంతో మొదలైన గొడవ.. చివరికి అతడి హత్యకు దారితీసింది. సూర్యాపేటలో ఈ ఘటన జరిగింది. సూర్యాపేట పద్మశాలి సంఘం ఎన్నికలను ఆగస్టు 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 20న నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. పద్మశాలి సంఘ పట్టణ అధ్యక్ష పదవికి శ్రీరాముల రాములు నామినేషన్ వేశారు. ప్రస్తుతం ఆ సంఘానికి పట్టణ అధ్యక్షుడిగా అప్పం శ్రీనివాస్ కొనసాగుతున్నారు. 'సూర్యాపేట పట్టణ పద్మశాలి కుల బాంధవులు' పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో రాములు, శ్రీనివాసులు ఏడాదిగా వివిధ పోస్టులు పెట్టుకుంటున్నారు. రాములు తనపై వాట్సాప్ గ్రూప్‌లో చేస్తున్న ఆరోపణలకు శ్రీనివాస్ ఈ నెల 21న పూర్తిస్థాయిలో బదులిచ్చారు. శ్రీనివాస్ పెట్టిన పోస్టులకు మద్దతుగా పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన హోల్‌సేల్ చెప్పుల వ్యాపారి మానుపురి కృపాకర్ (54) చప్పట్లతో కూడిన ఎమోజీని పోస్టు చేశారు. దీనిని చూసి రాములు ఆగ్రహంతో కృపాకర్‌కు ఫోన్ చేసి దూషించారు. ఈ విషయాన్ని కృపాకర్, శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం ఎన్నికల ప్రతినిధులకు తెలపాలని ఆయన సూచించటంతో, కృపాకర్ మంగళవారం ఉదయం పద్మశాలి సంఘం భవనానికి వెళ్లారు. జరిగిన విషయం చెబుతుండగానే రాములు, ఆయన కుమారుడు ధనుంజయ్, మరికొందరు కృపాకర్‌ను దూషిస్తూ దాడి చేశారు. ఈ దాడిలో కృపాకర్‌కు అంతర్గత అవయవాలు తీవ్రంగా దెబ్బతినడంతో స్పృహకోల్పోయారు. ఆయన్ను అక్కడున్నవారు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృపాకర్ భార్య ఫిర్యాదు మేరకు రాములు, ఆయన కుమారుడు ధనుంజయ్‌తో పాటు రాములు అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గోరుచిక్కుడు కూర విషమై... ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

» మరో ముగ్గురి పరిస్థితి విషమం

» కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో ఘటన


రమేశ్ నాయక్


దీప, నాగమ్మ(ఫైల్)

రాయచూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆహారం విషతుల్యమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సిరవార తాలూకా కడోణి తిమ్మాపురలో మంగళవారం ఈ విషాద ఘటన జరిగిం ది. గ్రామానికి చెందిన రమేశ్ నాయక్ తన రెండెకరాల పొలంలో సీడ్ పత్తిని సాగు చేశారు. కుటుంబ అవసరాల కోసం కొంత భాగంలో కూరగాయలను సాగు చేశారు. అందులో కాసిన గోరు చిక్కుడు కాయలను ఆదివారం ఇంటికి కోసుకురాగా, సోమవారం రాత్రి వండుకుని ఆరుగురు కుటుంబ సభ్యులు తిన్నారు. వారికి మంగళవారం తెల్లవారు జామున వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో గ్రామస్థులు లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. చికిత్స జరుగుతుండగానే రమేశ్ నాయక్ (38), కూతుళ్లు దీప(6), నాగమ్మ(8) మృతిచెందారు. భార్య పద్మ, కుమారుడు కృష్ణ, మరో కూతురు చైత్ర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెరుగైన చికిత్స కోసం రాయచూరులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కవితాళ పీఎస్ఐ వెంకటేశ్ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, పొలంలో కొన్నాళ్ల క్రితం పంటకు పురుగుల మందు పిచికారీ చేశారని, ఈ కారణంగానే గోరుచిక్కుడు విషతుల్యమై ప్రాణాలు తీసి ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజా ఆరోగ్యం మరియు పురపాలక ఇంజినీరింగ్ శాఖ
NITs: 2792/DB/D3/Nizamabad/TUFIDC/60 Cr/2025-26 తేది: 22.07.2025
పని పేరు: నిజామాబాద్ నగర పాలక సంస్థ–TUFIDC క్రింద మౌలికసదుపాయాల అభివృద్ధి పనులు– TUFIDC రుణ సహాయం క్రింద నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ టౌన్‌లో అంతర్గత రోడ్లు/CC డ్రైయిన్లు/కల్వర్టుల నిర్మాణం (డివిజన్ నం.1 నుండి 60). అంచనావ్యయం: రూ.60.00 కోట్లు. బిడ్ దాఖలు ముగింపు తేది:08.08.2025న సా.04.30 గం.లకు. వివరాల కొరకు దర్శించగలరు https://tender.telangana.gov.in సంప్రదించాల్సిన నం:040-23325849, 9154299724 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) వెస్ట్ సర్కిల్, హైదరాబాద్
DIPR RO No.5364-PP/CL/ADVT/1/2025-26,Dt.22.07.2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
NIT. No. 03/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 15.07.2025
పని పేరు: చెన్నూరు, ప్రస్తుతం ఉన్న డిగ్రీ కళాశాల నిర్మాణం పని విస్తరణ. మొత్తం: రూ.145.00 లక్షలు. పై పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 19.07.2025న సా.4.00 గం.నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 25.07.2025న మ.3.00 గం.వరకు. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో చూడవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఆర్&బి) సర్కిల్, మంచిర్యాల.
DIPR RC No.5386-PP/CL/ADVT/1/2025-26,Dt.22.07.2025

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, జోగులాంబ గద్వాల జిల్లా
Rc.No.A3/54/2025. ఇ-టెండరు ప్రకటన Dt.22.07.2025
జోగులాంబ గద్వాల జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల అధ్వర్యంలో నడపబడుచున్న వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కోడిగుడ్లు (అగ్మార్క్ నియమాల ప్రకారం) సరఫరా చేయుటకు ఆసక్తి గల పౌల్ట్రీఫాం యజమానుల నుండి టెండర్లు కోరడమైనది.
మిగతా వివరాలకు http://tender.telangana.gov.in నందు పొందగలరు. టెండరు ప్రాసెసింగ్ ఫీజు (రూ.10,000/-) మరియు ఇ.యం.డి. (1% టెండరు వాల్యూపైన) వివరాలను టెండర్ షెడ్యూల్ నందు చూడగలరు. జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, జోగులాంబ గద్వాల వారి పేరు మీద డి డి చెల్లించవలెను. టెండర్‌ను అంతర్జాలములో http://tender.telangana.gov.in నందు మాత్రమే దాఖలు చేయవలెను. సంబంధిత పత్రాలు మరియు ఇ.యం.డి.లను నిర్ణీత గడువు లోపు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, జోగులాంబ గద్వాల వారి కార్యాలయములో సమర్పించవలెను. (ఇ.యం.డి. మరియు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని టెండర్‌లు నిర్ణీత సమయములో పత్రాలను సమర్పించని దరఖాస్తులను తిరస్కరించబడును.) ఇతర వివరములకు, ఫోన్.నెం. 9441030602 నం.నకు సంప్రదించగలరు.
1.ఇ.యం.డి.: టెండర్ వాల్యూపైన (1%) రూ.6,85,600/-, (Approx Eggs Requirement for Year), 1,34,16,862x5.11 (One Egg Rate as per NECC Rate) – 6,85,60,164 (Total Cost). 2.ప్రాసెసింగ్ ఫీజు: రూ.10.000/- (Non Refundable), 3. అంతర్జాలంలో బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మొదలు: 22.07.2025. 4. ప్రీ బిడ్ మీటింగ్: 24.07.2025, ఉ.11.00 గం.లకు కలెక్టర్ సమావేశం మందిరం జోగులాంబ గద్వాల. 5. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చివరి తేది: 30.07.2025, 6. అంతర్జాలంలో బిడ్ సమర్పించుటకు చివరి తేది: 30.07.2025, 05.00 PM., 7. హార్డ్ కాపీలు సమర్పించుటకు చివరి తేది మరియు స్థలం: 30.07.2025 (జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయము, జోగులాంబ గద్వాల సా.05.00 గం. లోపు), 8. టెక్నికల్ బిడ్ తెరుచుట తేది: 31.07.2025, మ.03.00 గం.లకు కలెక్టర్ సమావేశం మందిరం, జోగులాంబ గద్వాల. 9. బిడ్ తెరుచు తేది మరియు స్థలం: 01.08.2025, ఉ.11.00 గం.లకు కలెక్టర్ సమావేశం మందిరం, జోగులాంబ గద్వాల. సం/ జిల్లా కలెక్టర్ / చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, జోగులాంబ గద్వాల తరఫున
DIPR R.C.No.5303-PP/CL/ADVT/1/2025-26, Dt.22.07.2025

ANDHRA PRADESH TOURISM AUTHORITY
GOVERNMENT OF ANDHRA PRADESH
5th Floor Stalin Corporate Building, Auto Nagar, Vijayawada
Tender No: APTA-14021/57/2025 & APTA-14021/46/2025 & APTA-14021/50/2025, Dt.22-07-2025
Andhra Pradesh Tourism is participating in the following prestigious events to showcase the State's tourism potential. In view of the same, APTA intends to engage a professional agency with relevant experience in conceptualization, design, construcion, branding and maintenance of tourism pavilions/stalls at national or internatiional events. The selected agency will be responsible for executing the Andhra Pradesh Pavilion and providing all associated services during the events.
1. FAITH Conclave 2025 - Conceptualization, Design, Branding & Management of AP Tourism Pavilion at Taj Palace, New Delhi (12-13 August 2025) Last date for bid submission: 11:00 AM, 06-08-2025.
2. 40th IATO Annual Convention - Design, Fabrication, Branding & Management of AP Tourism Stall and Collaterals at Swosti Premium Beach Resorts, Puri, Odisha (22-24 August 2025). Last date for bid submission: 11:00 AM, 11-08-2025.
3. PATA Travel Mart 2025 - Conceptualizaion, Design, Construction & Management of AP Pavilion at QSNCC, Bangkok, Thailand (26-28 August 2025). Last date for bid submission: 11:00 AM, 11-08-2025.
Detailed tender documents can be downloaded from https://aptourism.gov.in/tenders/
DIPR RO.No: 4280PP/CL/ADVT/1/1/2021-22, Dt: 22.07.2025 CEO, APTA

31లోపు కాళేశ్వరం కమిషన్ నివేదిక

» 27న రాష్ట్రానికి రానున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్

» నివేదిక సమర్పించి.. విచారణ ముగిసినట్లుగా ప్రభుత్వానికి లేఖ రాయనున్న చైర్మన్

» మంత్రివర్గంలో చర్చించి, శాసనసభలో ప్రవేశపెట్టాక సర్కారు చర్యలు



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాలు, ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలుస్తోంది. కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ ఈ నెల 27న హైదరాబాద్‌కు రానున్నారు. వచ్చీరాగానే నివేదికకు తుదిరూపు ఇచ్చి.. రెండు, మూడు రోజుల్లోపు ప్రభుత్వానికి అందించ నున్నారు. ఈ నెల 29 నుంచి 31లోపు ఏ రోజైనా నివేదికను సమర్పించి, విచారణ ముగిసినట్లుగా పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసి వెళ్లనున్నారు. దీంతో ఈ దఫా ఆయన పర్యటనపై ఉత్కంఠ నెలకొంది. కాళేశ్వరం బ్యారేజీలపై గతేడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ వేయగా.. అదే ఏడాది ఏప్రిల్ నుంచి విచారణ ప్రారంభమైన విషయం తెలిసిందే. విచారణ ప్రక్రియలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మొత్తం 115 మంది కోర్టు విట్‌నెస్‌లను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ మూడు నెలల కిందటే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీఅండ్ఈ) కూడా విచారణ జరిపి.. పలువురు అధికారులపై క్రిమినల్ కేసులు, మరికొందరిపై శాఖాపరమైన చర్యలు, ఇంకొందరిపై సవరణ పెన్షన్ నిబంధనలు అనుసరించి, పెన్షన్‌లలో కోత విధించాలని సిఫారసు చేసింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా 38 మంది అధికారులకు షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో ముగ్గురు కీలక అధికారులపై ఆదాయానికి మించి ఆస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. మాజీ ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్, గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) నూనె శ్రీధర్‌ల నివాసాల్లో సోదా లు నిర్వహించి, రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఇక జస్టిస్ ఘోష్ నివేదికను సమర్పిస్తే.. మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. అనంతరం శాసనసభలో కూడా ప్రభు త్వం ప్రవేశపెట్టనుంది. ఆ తర్వాత దీనిపై చర్చించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

భూముల మార్కెట్ విలువ పెంపు?!

ఆ దిశగా సర్కార్ సన్నద్ధం.. వివరాల సేకరణ.. కొత్త ప్రాంతాలపై దృష్టి

» 2013లో సమగ్ర అధ్యయనం.. పెంపు

» ఆ తర్వాత విలువల సవరణలకు మాత్రమే పరిమితం

» ఈ సారి అధ్యయనానికి రాష్ట్ర సర్కారు నిర్ణయం

» కొత్తగా అభివృద్ధి చెందిన ప్రాంతాలపై నివేదిక కోరిన మంత్రి

» నేడు నిర్ణయం తీసుకునే చాన్స్



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువలు పెంచేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇందుకోసం అనేక కోణాల్లో వివరాలను సేకరిస్తోంది. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. రహదారులు, ప్రాంతాల ప్రాతిపదికన సమగ్ర అధ్యయనం జరిపిన తర్వాత భూముల ధరలను పెంచారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. 2021 వరకు భూముల విలువలను పెంచలేదు. 2021లో ప్రభుత్వం అప్పటి విలువలను 20% పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2022లో మరోసారి 33% మేర పెంచారు. విలువల పెంపు తప్పితే.. ఈ రెండు సందర్భాల్లో సమగ్ర అధ్యయనం జరగలేదు. దీంతో.. ఇప్పుడు సమగ్ర అధ్యయనం జరిపి, భూముల విలువ పెంపునకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్టాంపులు-రిజిస్ట్రేషన్ల అధికారులను ఆదేశించారు. అధికారులు ఆ మేరకు నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం. బుధవారం సచివాలయంలో మంత్రి నేతృత్వంలో జరగనున్న సమావేశంలో దీనిపై సమీక్షించి, భూముల మార్కెట్ విలువల పెంపుపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యత్యాసాల్లేకుండా..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. రహదారుల విస్తరణ, పట్టణీకరణ శరవేగంగా జరిగింది. 2014లో 69గా ఉన్న మునిసిపాలిటీలు ఇప్పుడు 158కి చేరాయి. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో పారిశ్రామిక ప్రగతి, ఐటీపార్కుల ఏర్పాటు జరిగింది. అయితే.. దీనికి సంబంధించి సమగ్ర అధ్యయనం జరగలేదని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రం విస్తీర్ణంలో సుమారు 49% పట్టణాలు ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. దీంతో.. జరిగిన అభివృద్ధి ప్రాతిపదికన అధ్యయనం జరిపి, మార్కెట్ విలువలను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ తర్వాత ఏటా కనీసం 2% పెంపుతో ముందుకు సాగాలని యోచిస్తోంది. మహారాష్ట్ర కూడా ఇదే విధంగా ఏటా 2% పెంపు నిబంధనను అమలు చేస్తోందని మార్కెట్ విలువలపై గతంలో అధ్యయనం చేసిన ఓ ఏజెన్సీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. రిజిస్ట్రేషన్లు బాగా పెరిగే ప్రాంతాల్లో ఏటా భూముల విలువలను పెంచడం వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతందని ఆ నివేదికలో సూచించింది. ఏటా కాకుండా.. మూడు-నాలుగేళ్లకు ఓసారి విలువలను పెంచితే.. రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోయి, ఉపయోగం ఉండకపోవచ్చని అభిప్రాయపడింది. ఈ క్రమంలో అన్ని కోణాల్లో సమగ్ర అధ్యయనం జరిపింది. ఈ నివేదికపై బుధవారం జరిగే సమీక్షలో చర్చించి, ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

ఆదాయం పెంపుపై దృష్టి

ఆదాయ వనరుల సమీకరణలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతి సమావేశంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఏడాది లక్ష్యాలను చేరుకునేందుకు వీలైన ప్రణాళికలతో రావాలని పదే పదే చెబుతున్నారు. ఆదాయం పెంపునకు భూముల విలువలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో.. ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో రిజిస్ట్రేషన్ల శాఖ ముందుకు సాగుతోంది. 2014నుంచి గత ఏడాది వరకు వచ్చిన ఆదాయ వివరాలను పరిశీలిస్తే.. కొవిడ్ కల్లోల సమయంలో వృద్ధి -25.5% మేర పడిపోయింది. 2021-22లో ఒక్కసారిగా పుంజుకొని 135.17% వృద్ధిని సాధించినా.. 2023-24 నుంచి మూడు శాతం లోపే ఉంటోంది. 2024-25లో 3% అదనపు ఆదాయం వస్తుందని భావించినా.. ప్రతికూల ఫలితాలే కనిపించాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.19 వేల కోట్లను లక్ష్యంగా పెట్టింది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే.. భూముల విలువల పెంపు తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాహారం తిని ఆస్పత్రిపాలు!

(మొదటి పేజీ తరువాయి)


శ్రీనివాస్ యాదవ్(ఫైల్)

జస్మిత(15), లహరి(17)తో కలిసి వనస్థలిపురం చింతలకుంట లోని ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్నారు. రజిత సోదరుడు సంతోష్ కుమార్(39), భార్య రాధిక(34), కుమార్తెలు పూర్విక (12), క్రితజ్ఞ(7), శ్రీనివాస్‌యాదవ్ తల్లి గౌరమ్మ(65) బోనాల సందర్భంగా జూన్ 20, ఆదివారం శ్రీనివాస్ యాదవ్ ఇంటికి వచ్చారు. పండగ నేపథ్యంలో శ్రీనివాస్ యాదవ్ తెచ్చిన చికెన్, మటన్, బోటీని కుటుంబసభ్యులు తొమ్మిది మంది తిన్నారు. మిగిలిన మాంసాహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టారు. సోమవారం ఉదయం అదే మాంసాహారాన్ని వేడి చేసుకుని మళ్లీ తిన్నారు. అనంతరం అందరూ వాంతులు, విరేచనాలతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం సాయంత్రానికి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. బాధితులందరి బీపీ(రక్తపోటు) పడిపోవడంతో అందరినీ ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స అందించారు. కానీ, శ్రీనివాస్ యాదవ్ చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. మిగిలిన వారికి చికిత్స కొనసాగుతుండగా.. శ్రీనివాస్ తల్లి గౌరమ్మ, భార్య రజిత, కుమార్తె జస్మిత పరిస్థితి విషమంగా ఉంది. మరో 24 గంటలు గడిస్తేనే బాధితుల పరిస్థితిపై స్పష్టత వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దిలావర్‌పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాయాపూర్‌కు చెందిన కామిండ్ల భీమన్న(40)తనకున్న ఎకరంతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని అప్పులు తెచ్చి సాగు చేస్తున్నాడు. ఇటీవల దిగుబడులు రాక నష్టపోయాడు. రెండు నెలల క్రితం మరింత అప్పు చేసి తన పెద్ద కూతురు వివాహం చేశాడు. వానాకాలం సాగుకు అప్పుపుట్టక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక సోమవారం రాత్రి పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆస్పత్రుల్లో కరెంట్ కష్టాలకు చెక్

107 ఆస్పత్రుల్లో డీజిల్ జనరేటర్లు.. 3 నెలల్లో ఏర్పాటు

» రూ.21.96 కోట్లు మంజూరు.. కొనుగోలుకు టెండర్లు

» రాష్ట్రంలోని 215 ఆస్పత్రుల్లో 109 చోట్ల ఇప్పటికే జనరేటర్లు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది. జనరేటర్ లేకపోవడంతో అక్కడున్న నవజాత శిశువులు అల్లాడిపోయారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఓ సర్కారు దవాఖానాలో కరెంటు పోవడంతో అక్కడి డ్యూటీ డాక్టర్ సెల్‌ఫోన్ లైట్ వేసుకుని రోగులకు వైద్యం చేశారు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చాలాచోట్ల నెలకొంటున్నాయి. ఈదురుగాలులు, వర్షాల కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం.. అప్రకటిత కోతల కారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరెంట్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డెలివరీలు, ఆపరేషన్ల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ఈ సమస్య పరిష్కారంపై సర్కారు దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పవర్ బ్యాకప్‌పై సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), వైద్య విధాన పరిషత్తు (వీవీపీ) పరిధిలో మొత్తంగా 215 ఆస్పత్రులున్నాయి. డీఎంఈ పరిధిలోని 47 ఆస్పత్రులకుగాను 38 చోట్ల, వీవీపీలో 168కి గాను 71 చోట్ల మాత్రమే డీజిల్ జనరేటర్లు ఉన్నట్లు వెల్లడైంది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 107 ఆస్పత్రుల్లో (49శాతం) కరెంట్ కష్టాలున్నట్లుగా గుర్తించారు. ఈ ఆస్పత్రుల కోసం డీజిల్ జనరేటర్లను వెంటనే కొనుగోలు చేయాలని ఈ సర్వే సిఫారసు చేసింది. సర్వే నివేదిక ఆధారంగా 107 ఆస్పత్రుల్లో డీజిల్ జనరేటర్లు కొనుగోలు చేయాలని సర్కారు ఆదేశించింది. జూలై 3న జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. మొత్తం 107 ఆస్పత్రుల్లో పవర్ బ్యాకప్ ఏర్పాట్లు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) డీజిల్ జనరేటర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. ఈ నెలాఖరు వరకు టెండర్లకు గడువు విధించింది. టెండరు దక్కించుకున్న సంస్థ 3 నెలల్లో జనరేటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అక్టోబరు చివరి నాటికి జనరేటర్ల ఏర్పాటు పూర్తవుతుందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతను సంబంధిత ఆస్పత్రుల సూపరింటెండెంట్లకే అప్పగించారు. జనరేటర్లకు మరమ్మతులు చేయిచాల్సి వస్తే ఆస్పత్రి అభివృద్ధి నిధుల (హెచ్‌డీఎస్) నుంచి వెచ్చించాలని సర్కారు సూచించింది.

నిలోఫర్‌లో తీరనున్న కష్టాలు

హైదరాబాద్‌లో పిల్లల పెద్దాస్పత్రిగా పేరుగాంచిన నిలోఫర్‌లో పవర్ బ్యాకప్ సరిగా లేదని సర్వేలో వెల్లడైంది. ఆ ఆస్పత్రి కోసం రెండు డీజిల్ జనరేటర్లు కొనుగోలు చేయనున్నారు. 320 కేవీఏ, 500 కేవీఏ సామర్థ్యంగల డీజిల్ జనరేటర్లను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గోల్కొండ డెంటల్ కాలేజీ ఆస్పత్రి, ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రితో పాటు ఆదిలాబాద్ రిమ్స్, కొత్తగూడెం, సిరిసిల్ల, నారాయణపేట, గద్వాల బోధనాస్పత్రులు, మేడ్చల్‌లోని ఏరియా ఆస్పత్రికి జనరేటర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇక వీవీపీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లోనూ జనరేటర్లు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ జిల్లాలో 10, ఆదిలాబాద్‌లో 2, కొత్తగూడెంలో 3, జగిత్యాలలో 3, జనగాంలో 2, కామారెడ్డిలో 7, కరీంనగర్‌లో 2, ఖమ్మంలో 3, ఆసిఫాబాద్‌లో 5, మహబూబాబాద్‌లో 4, మెదక్‌లో 2, మేడ్చల్‌లో 3, నాగర్ కర్నూల్‌లో 3, నల్లగొండలో 4, నారాయణపేట్‌లో 2, నిర్మల్‌లో 2, నిజామాబాద్‌లో 5, పెద్దపల్లిలో 2, సిరిసిల్లలో 4, రంగారెడ్డి జిల్లాలో 9, సంగారెడ్డిలో 6, సిద్దిపేటలో 2, సూర్యాపేటలో 4, వికారాబాద్‌లో 2, వనపర్తిలో 4, యాదాద్రి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒక్కో ఆస్పత్రి కోసం జనరేటర్లను కొనుగోలు చేస్తున్నారు.

బలవంతపు చాకిరీ నుంచి 36 మందికి విముక్తి

» 8 మంది నిందితుల అరెస్టు

» పరారీలో నలుగురు మధ్యవర్తులు

నల్లగొండ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నెలకు రూ.15 వేల జీతం.. రోజూ 2 గంటలే పని.. ఉచితంగా ఆహారంతోపాటు మద్యం సరఫరా చేస్తామని ఆశ చూపి సుదూర ప్రాంతాల నుంచి మానవుల అక్రమ రవాణాకు పాల్పడ్డ ముఠా గుట్టు రట్టయింది. ఈ ముఠా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి నలుగురు బాల కార్మికులతోపాటు 36 మంది వలస కార్మికులను ఒక్కొక్కరికి రూ.1500 కమీషన్ ఇచ్చి హైదరాబాద్, విజయవాడ నుంచి నల్లగొండ జిల్లా దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లికి తీసుకొచ్చింది ముఠా. అక్కడికి చేరుకున్నాక ఈ ముఠా సభ్యులు వారి వద్ద సెల్‌ఫోన్లు తీసేసుకుని.. రాత్రి వేళ మోటారు సైకిళ్లపై నేరేడుగొమ్ము మండలం బాణాలకుంట, వైజాగ్ కాలనీలకు.. అక్కడ కృష్ణా నదిలోకి తీసుకెళ్లి.. చేపల వలలు లాగిస్తారు. కానీ, రోజుకు 2 పూటలే భోజనం పెట్టడంతో పాటు తమపై పనిభారం పెరుగుతోందని, చేసిన పనికి డబ్బు ఇవ్వమన్న వారిని చిత్రహింసల పాల్జేశారు. తమతో బలవంతపు చాకిరీ చేయించుకుంటున్నారని స్థానికులకు వలస కూలీలు వెల్లబోసుకున్న గోడు.. పోలీసులతోపాటు రెవెన్యూ, బాలల సంక్షేమశాఖల అధికారులకు చేరింది. ఆ శాఖల అధికారులు బృందాలుగా కూలీలున్న ప్రాంతాలకెళ్లి 8 మంది నిందితులను అరెస్టు చేసి, 36 మంది వలస కార్మికులకు విముక్తి కలిగించారు. పరారీలో ఉన్న నలుగురు మధ్యవర్తుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం మీడియాకు చెప్పారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక పర్యవేక్షణలో నిందితులను అరెస్టు చేసిన డిండి, కొండ మల్లేపల్లి సీఐలతోపాటు గుడిపల్లి, నేరేడుగొమ్ము, గుర్రంపోడ్ ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

బాలికలపై వార్డెన్ కుమారుడు లైంగిక వేధింపులు

» నారాయణఖేడ్ బీసీ హాస్టల్‌లో ఘటన

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు కలకలం రేపాయి. హాస్టల్ వార్డెన్ శారద కుమారుడు, మాజీ కౌన్సిలర్ రాజేష్ చౌహాన్ తరచూ హాస్టల్‌కు వస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ.. వేధింపులకు గురిచేస్తున్నాడని, సిబ్బంది కూడా దూషిస్తున్నారంటూ బాలికలు సోమవారం రాత్రి నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం వసతి గృహం ఎదుట ఆందోళన చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి జగదీశ్వర్ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాలికలను వేధింపులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వార్డెన్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లక్ష్మి, శాంతాబాయిలను విధుల నుంచి తప్పించామని తెలిపారు. వార్డెన్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సహా రాజేష్ చౌహాన్‌పై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పోక్సో కేసును కూడా నమోదు చేసినట్లు వివరించారు. కాగా, సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండల పరిధి మోర్గి మోడల్ బాలికల హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనలో.. హాస్టల్ కేర్ టేకర్ భూదేవితో పాటు ఇద్దరు వంట సిబ్బందిని తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆకస్మిక నిష్క్రమణ

దైవానుగ్రహం తోడైతే, పదవీకాలం పూర్తయ్యేవరకూ ఉంటానని సరిగ్గా పన్నెండురోజుల క్రితం ఘంటాపథంగా చెప్పిన ఉపరాష్ట్రపతి, ఇంతలోనే, ఈమాదిరిగా నిష్క్రమిస్తారని ఊహించలేదు. గిట్టనివాళ్ళు కూడా ఇంకా రెండేళ్ళు ఆయన రాజ్యసభాధ్యక్షస్థానంలో ఉంటారనీ, వేగక తప్పదనే అనుకున్నారు. తప్పుబట్టినవారు, పక్షపాతివంటూ నిందించిన వారూ, నడకనీ మాటనీ నమస్కారం చేసే తీరునీ అవహేళన చేసినవారు సైతం ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ నాలుగుమంచి మాటలతో, సగౌరవంగా సాగనంపితే బాగుంటుంది కదా అని జాలిపడుతున్నారు. నిర్ణయాన్ని పునరాలోచించుకోమని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

భారత ఉపరాష్ట్రపతి ఇలా అర్థంతరంగా నిష్క్రమించిన చరిత్ర ఇటీవలి కాలంలో లేదు. రాష్ట్రపతి కావడానికో, మరో బాధ్యత చేపట్టడానికో రాజీనామా చేయడం చూశాం తప్ప, ఇలా రాత్రివేళ ఆ అత్యున్నత పదవిని వదిలేసిపోవడం లేదు. ధన్‌ఖడ్ అసాధారణ పోరాటశక్తి తెలిసిందే కనుక, ఆరోగ్యసమస్యలున్నప్పటికీ, ఈ నిష్క్రమణకు అవే అసలుకారణాలని ఎవరూ నమ్మడం లేదు. ఒకవేళ ఆయన చెప్పిందే నిజమనుకున్నప్పటికీ, నిండుసభలో కరతాళధ్వనులతోనూ జరగాల్సిన ఈ అధికారిక ప్రక్రియ ఇలా ఒక రాత్రివేళ ట్వీటుతో ముగిసిపోవడం అమితాశ్చర్యం కలిగిస్తుంది. సోమవారం ఆయన రాజ్యసభ వర్షాకాల సమావేశాలను ఆరంభించారు, సభ్యులతో వాదించారు, ఆగ్రహించారు, అనునయించారు, సాయంత్రం వరకూ అంతే ఉత్సాహంతో ఉన్నారు. ఆయన మర్నాటి 1షెడ్యూల్‌ను కూడా రాజ్యసభ కార్యాలయం విడుదల చేసింది. కానీ, రాత్రి తొమ్మిదన్నర ప్రాంతంలో ఉపరాష్ట్రపతి అధికారిక ఎక్స్‌ఖాతాలో ఆయన రాజీనామాలేఖ ప్రత్యక్షమైంది, మర్నాడు మధ్యాహ్నం ప్రధానమంత్రి ఇకపై ఆరోగ్యం జాగ్రత్తంటూ సందేశాన్ని అందించారు, రాష్ట్రపతి ఈ రాజీనామాను ఆమోదించారు. అప్పటివరకూ అధికారపక్ష ప్రముఖులెవ్వరూ ఈ పరిణామం మీద నోరువిప్పలేదు. మోదీ ట్వీటు ఒక్కటి చాలు, తెర వెనుక ఆగ్రహాలు తెలియచెప్పడానికి.

ఎందుకు, ఏమిటి అన్న చర్చ సాగుతోంది. ఆయన ఒకటీ రెండు కాదు, చాలా లక్ష్మణరేఖలు దాటాడని, ఆదిలో అడపాదడపా అలిగిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు అమితాగ్రహంతో స్పష్టమైన సందేశాన్ని అందించడంతోనే ఈయన వెళ్ళిపోవాల్సి వచ్చిందని అంటారు. ఉపరాష్ట్రపతి అయినా కూడా పార్టీ విధేయతనూ, రాజకీయ వాసనలను వదులుకోలేదన్నది ధన్‌ఖడ్ మీద ఉన్న విమర్శ. పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా మమతాబెనర్జీని మూడు చెరువుల నీళ్ళు తాగించి ఈ ఉన్నత పదవికి చేరిన ఈయన ప్రస్తుత విపక్షపాలిత గవర్నర్లకు ఆదర్శమని గిట్టనివారంటారు. ఆయన గొంతు గట్టిది. ఘాటుగా, రెచ్చగొట్టేట్టుగా, హద్దులు దాటి మరీ మాట్లాడగలరు. సభలో ఆయన ఆదేశాలు తీవ్ర ప్రతిష్టంభనకు, నిరసనలకు దారితీసిన సందర్భాలనేకం. ఇప్పుడు అనుకూలంగా మాట్లాడుతున్న ప్రతిపక్షమే అభిశంసనను ప్రతిపాదించిన తొలి ఉపరాష్ట్రపతి ఆయన. కొలీజియం వ్యవస్థమీద న్యాయమంత్రుల ఆరోపణలను ఏకంగా పోరాటస్థాయికి తీసుకుపోయి, ఆ వ్యవస్థను అనుమతించినందుకు ఎంపీలను తీవ్రంగా నిందించిన వ్యక్తి ధన్‌ఖడ్. రాజ్యాంగాన్ని ప్రభుత్వ పెద్దలు చిత్తం వచ్చినట్టుగా మార్చడానికి రాజ్యాంగ మౌలిక నిర్మాణ సిద్ధాంతం అడ్డుపడుతున్నందుకు కేశవానందభారతి తీర్పునుంచి ఇటీవలి తీర్పులవరకూ అనేకం తప్పుబట్టి, న్యాయవ్యవస్థను సూపర్ పార్లమెంట్‌గా అభివర్ణించి, దాని చొరవను చొరబాటుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దల మనసు గెలుచుకున్నానని అనుకున్నారాయన. ఇప్పుడు, జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రయత్నాల్లో తమదే పైచేయి కావాలన్న అధికారపక్షం కలలను వమ్ముచేసి, విపక్షానిది పైచేయి కానిచ్చినందుకే ఇలా నిష్క్రమించాల్సివచ్చిందని విశ్లేషకుల వాదన. ఇది ఒక్కటే కారణం కాకపోవచ్చు, తెరవెనుక వ్యూహాలూ కుట్రలూ అనేకం ఉండవచ్చు. జగదీప్ ధన్‌ఖడ్ తనకుతానుగా చెప్పేవరకూ ఈ అర్థంతర నిష్క్రమణ గుట్టు ఎవరికీ తెలియదు. జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మాదిరిగా దానిని ఎప్పటికైనా విప్పుతారేమో చూడాలి. ఉపరాష్ట్రపతి పదవి అత్యున్నతమైనది. దీని విషయంలో ఊహాగానాలు, పుకార్లు, కొనసాగడం దేశానికి అవమానం. నిజం తెలుసుకొనే హక్కు ప్రజలకు ఉంది, దానిని వెనువెంటనే తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

హతుడి కుటుంబంతో సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని ఉరిశిక్ష నుంచి బయటపడే అవకాశం యమన్‌లో మరణ శిక్షను ఎదుర్కొంటున్న కేరళ యువతి నిమిష ప్రియకు ఉన్నది. భారతీయ మీడియా అవగాహన రాహిత్యంతో, ఉభయ పక్షాల వాదనలను నిష్పాక్షికంగా నివేదించకుండా కేవలం ఒక పక్షం వారి వాదనకే ప్రాధాన్యమిచ్చింది. ఈ కారణంగానే నిమిషకు క్షమాభిక్ష లభించకపోయే పరిస్థితి ఏర్పడింది.

నిమిషకు కీడుచేసిన భారతీయ మీడియా!

జీవనోపాధి, విద్యాభ్యాసం నిమిత్తం దేశ సరిహద్దులు దాటుతున్న భారతీయుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. విదేశాలలో ఉంటున్న భారతీయుల స్థితిగతులపై సరైన సమాచారం తెలుసుకొనేందుకు తమకంటూ ఒక స్వంత వ్యవస్థ భారతీయ మీడియాకు ఇప్పటికీ లేదు. దేశ ప్రయోజనాలతో ముడివడి ఉన్న దౌత్య నియమాలకు తోడుగా మానవీయకోణంలో స్పందించవల్సిన అనేక సందర్భాలలో భారతీయ మీడియా తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో విఫలమవుతోందని చెప్పక తప్పదు. సామాజిక మాధ్యమాలు లేదా ఒక పక్షం వాదన ఆధారంగానే భారతీయ మీడియా వార్తా కథనాలు ప్రచురిస్తోంది. ఈ కథనాలు వాస్తవాలను కప్పిపుచ్చుతూ ప్రజలలో అయోమయం సృష్టిస్తున్నాయి. యమన్‌లో మరణ శిక్షను ఎదుర్కొంటున్న కేరళ యువతి నిమిష ప్రియ ఉదంతమే భారతీయ మీడియా ధోరణులకు ఒక తాజా ఉదాహరణ.

గల్ఫ్ లేఖ

సున్నితమైన ఒక అంశాన్ని భారతీయ మీడియా అవధులు మీరి జటిలం చేసిందని నిమిష ఉదంతం స్పష్టం చేసింది. హతుడి కుటుంబంతో సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని ఉరిశిక్ష నుంచి బయటపడే అవకాశం నిమిషకు ఉన్నది. అయితే భారతీయ మీడియా అవగాహన రాహిత్యంతో, ఉభయ పక్షాల వాదనలను నిష్పాక్షికంగా నివేదించకుండా కేవలం ఒక పక్షం వారి వాదనకే ప్రాధాన్యమిచ్చింది. ఈ కారణంగానే నిమిషకు క్షమాభిక్ష లభించకపోయే పరిస్థితి ఏర్పడింది. యమనీ హతుడి కుటుంబం నిమిషను క్షమించవచ్చనే అభిప్రాయం ఒక దశలో గట్టిగా ఏర్పడింది. అయితే భారతీయ మీడియా పుణ్యమా అని నిమిషకు మరణ శిక్ష అమలు చేయవల్సిందేనని హతుడి కుటుంబం ఇప్పుడు పట్టుబడుతోంది. వాస్తవాలు తెలుసుకోకుండా భారతీయ మీడియా చేసిన దుష్ప్రచారం తమకు బాధ కలిగించిందని హతుడి కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కేరళకు చెందిన ఇస్లాం పండితుడి జోక్యం, కుటుంబంతో సంబంధం లేని సంఘాల నాయకులు సుప్రీంకోర్టుకు వెళ్ళిన అంశాలపై మీడియా హంగామా నిమిషకు మేలు కంటే కీడు ఎక్కువ చేసిందని చెప్పవచ్చు.



యమన్ జాతీయుడు తలాల్ మహెదీను నిమిష పెళ్ళి చేసుకున్న విషయాన్ని భారతీయ మీడియా వ్యూహాత్మకంగా వెల్లడించలేదు. మోతాదుకు మించి మత్తు మందు ఇంజక్షన్ ఇవ్వడంతో మహెదీ మరణించినట్లుగా భారతీయ మీడియా చెబుతోంది. అయితే ఆమె అతడి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోసి సంచిలో వేసి నీళ్ళ ట్యాంకులో పారేసి 600 కిలోమీటర్ల దూరానికి పారిపోయినట్లుగా యమనీ మీడియా ప్రచురించిన కథనాలను ఉపేక్షిస్తోంది. ఆ కథనాలను ఎందుకు ప్రస్తావించడం లేదు? భాష రాక పరాయి దేశంలో ఉన్న బాధితురాలిగా నిమిషను చిత్రీకరిస్తున్న భారతీయ మీడియా.. ఈ హత్యలో ఆమెకు సహకరించిన యమనీ పౌరురాలు హానన్‌కు పదేళ్ళ శిక్ష విధించారని, నిమిషను కారులో తీసుకెళ్ళిన యమనీ డ్రైవర్‌కు కూడా జైలు శిక్ష విధించారనే విషయాన్ని చెప్పనే లేదు. స్థానిక భాషా పరిజ్ఞానం లేకుండానే నిమిష అక్కడ ఆసుపత్రిని ఎలా ప్రారంభించిందనే విషయాన్ని భారతీయ మీడియా ప్రశ్నించలేదు.

మహెదీ హత్య అనంతరం నిమిష, తిరుగుబాటుదారులైన హూతీల పాలనలో ఉన్న సనా నుండి పారిపోయి చట్టబద్ధ ప్రభుత్వం ఉన్న హద్రమౌత్ ప్రాంతానికి చేరుకుని అక్కడ ఒక ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం చేస్తుండగా ఆమెను అరెస్టు చేసినట్లుగా యమనీ మీడియా వార్తలు వెల్లడించాయి. యమన్‌కు పొరుగున ఉన్న ఒక గల్ఫ్ దేశానికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా నిమిష పట్టుబడినట్లుగా తెలుస్తోంది.

అసలు పదవ తరగతి కూడా ఉత్తీర్ణురాలు కాకుండా నర్సింగ్ డిప్లొమో చేసిన నిమిష తన స్వంత రాష్ట్రం కేరళలో సైతం నర్సింగ్ వృత్తి చేయడానికి అనర్హురాలు. అయినా నర్సింగ్ ఉద్యోగం చేయడానికి ఆమె యమన్‌కు వెళ్ళింది. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కొంతకాలం పని చేసిన అనంతరం ఆమె ఏకంగా స్వంత ఆసుపత్రిని నెలకొల్పుకునేందుకు నిర్ణయించుకుని హతుడు తలాల్ సహాయ సహకారాలను తీసుకోవడం ఆసక్తికరమైన విషయం. తలాల్ స్వయంగా కేరళకు వచ్చి ఆమె ఇంట్లో ఆతిథ్యం స్వీకరించి వెళ్లడం అంతకన్నా ఆసక్తికరం. హూతీ దళాల తిరుగుబాటు తదనంతరం యమన్‌లోని భారతీయులు స్వదేశానికి తిరిగి రావాలని భారత ప్రభుత్వం చేసిన సూచనను మన్నించి అక్కడి ప్రవాసులు అందరూ మాతృభూమికి చేరుకున్నారు. చివరకు సనాలో భారతీయ ఎంబసీని కూడా మూసివేసారు. అయినా నిమిష స్వదేశానికి వెళ్ళకుండా తలాల్ కుటుంబంతో కలిసి అతని ఇంట్లో నివసించిందనేది గమనార్హం. యమనీ మీడియా కథనాల ప్రకారం, ఆమె తలాల్‌ను స్థానిక చట్టాల ప్రకారం వివాహం చేసుకున్నది. ఆ తర్వాతే ఆమె ఆసుపత్రిని ప్రారంభించింది. హతుడి సోదరుడు బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సోదరుడితో నిమిషకు వివాహం జరిగిందని ధ్రువీకరించారు.

హత్య జరిగిన పరాయి దేశంలోని అన్ని స్థాయిల్లోని న్యాయస్థానాలలో అప్పీళ్ల దశ కూడా పూర్తయిన కేసుకు సంబంధించి మన దేశంలోని సుప్రీంకోర్టుకు వెళ్లడం ప్రచార ఆర్భాటం మినహా మరేమీ కాదు. ఒక్క నిమిష ఉదంతంలోనే కాకుండా, అరబ్బు దేశాలలో పనిచేస్తున్న భారతీయులకు సంబంధించిన అనేక ఉదంతాలపై భారతీయ మీడియా ప్రచురించే అర్ధసత్య కథనాల సంచలనాలతో మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుందని చెప్పవచ్చు.

▪ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ధన్‌ఖడ్ రాజీనామా మిగిల్చిన ప్రశ్నలు



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఆయనకు రాజ్యాంగం గురించి అద్భుతమైన పరిజ్ఞానం ఉన్నది. చట్టసభల వ్యవహారాలు ఆయనకు కొట్టిన పిండి..' ఇవి, ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎంపిక చేసుకున్నప్పుడు ఆయనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కురిపించిన ప్రశంసలు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు వారిలో అత్యధికంగా ఉన్న జాట్ రైతులను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నంలో భాగంగా ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతిగా బీజేపీ ఎంపిక చేసింది. ఆయనను కిసాన్ పుత్రుడని, పరిపాలనా వ్యవహారాల్లో సమర్థుడని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా నాడు కొనియాడారు. అలాంటి ధన్‌ఖడ్ తాను ఆరోగ్యకారణాల రీత్యా రాజీనామా చేస్తున్నానంటే బీజేపీ ఎందుకు వదులుకున్నది? అసలు నిజంగా ఆరోగ్య కారణాల వల్లే ఆయన తప్పుకున్నారా?

సోమవారం ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాలకు ఎన్నో అస్త్రాలను అందించాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశం అయిదు యుద్ధ విమానాలను కోల్పోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారం రోజుల క్రితం ప్రకటనలు చేయడం, రక్షణదళాల ప్రధానాధిపతి ఈ ప్రకటనను ఖండించకపోవడం ప్రతిపక్షాలకు ఉత్సాహాన్నందించింది. ఆపరేషన్ సిందూర్‌తో పాటు బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఆత్మరక్షణలో పడేయాలని ప్రతిపక్షాలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా పరిస్థితిని మరింత అయోమయంగా మార్చిందనడంలో సందేహం లేదు. దేశంలో రెండవ అత్యంత ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేయడం సహజంగానే సంచలనం సృష్టించింది.

2019లో ధన్‌ఖడ్‌ను పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమించినప్పుడు ఆయన గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. 1987లో రైతు నేత దేవీలాల్ ఢిల్లీలో రైతుల ధర్నా నిర్వహించినప్పుడు ధన్‌ఖడ్ తన ఝున్‌ఝున్ ప్రాంతం నుంచి దాదాపు 500 వాహనాల్లో రైతులను సమీకరించి తీసుకువచ్చి ఆయనకు సన్నిహితుడయ్యాడు. దీనితో 1989లో ఝున్‌ఝున్ నియోజకవర్గం నుంచి ధన్‌ఖడ్‌కు జనతాదళ్ తరఫున ఎంపీ సీటు ఇచ్చి స్వయంగా ప్రచారం చేసి గెలిపించడమే కాక విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రభుత్వంలో సహాయమంత్రి పదవి కూడా ఇప్పించారు. దేవీలాల్‌ను వీపీ సింగ్ ఉపప్రధాని పదవి నుంచి తొలగించినప్పుడు ధన్‌ఖడ్ కూడా రాజీనామా చేసి ఆయనకు అండగా నిలిచారు. వీపీ సింగ్ తర్వాత ప్రధాని అయిన చంద్రశేఖర్ మంత్రివర్గంలో కూడా ధన్‌ఖడ్ కొనసాగారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయినప్పుడు జనతాదళ్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతల్లో లాల్‌బహదూర్ శాస్త్రి కుమారుడు అనిల్ శాస్త్రి, ధన్‌ఖడ్ కూడా ఉన్నారు. ఎంపీగా ఓడిపోవడంతో కాంగ్రెస్ ఆయనకు 1993లో రాజస్థాన్‌లో కిషన్‌ఘర్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. బాబ్రీ మసీదు కూల్చి వేత తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌ను ధన్‌ఖడ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్‌ఎస్‌ఎస్ లాంటి తీవ్రవాద సంస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్థానం లేదని ఆయన శాసన సభలో తీవ్రంగా విమర్శించారు.

ఇదంతా గతం. 1998లో మళ్లీ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఆయన రాజకీయాలను వదిలి న్యాయవాద వృత్తిలో నిమగ్నమయ్యారు. దాదాపు అయిదేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉండి ఏ బీజేపీనైతే తాను తీవ్రంగా విమర్శించారో అదే పార్టీలో ఆయన చేరారు. దరిమిలా చాలా కాలం బీజేపీ లీగల్ సెల్‌లో పనిచేసిన తర్వాత ఆయనకు 2016లో ఆ సెల్ సారథ్యం లభించింది. రామజన్మభూమి కేసుల్లోనూ, ఉగ్రవాద కేసుల్లోను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు న్యాయ సహాయం అందించేవారు. ధన్‌ఖడ్‌పై మోదీ దృష్టి ఎలా పడిందో కాని 2019లో ఆయనను ఏకంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. మూడు సంవత్సరాల పాటు అనేక బిల్లులను తొక్కిపెట్టడం, తీవ్ర విమర్శలు చేయడం వంటి పనులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ముప్పుతిప్పలు పెట్టిన తర్వాత జగదీప్ ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి వంటి కీలక పదవిలో నియమించారు.

రెండు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కనుమరుగై ఉన్న జగదీప్ ధన్‌ఖడ్‌ను నరేంద్రమోదీ ఏ కారణాలరీత్యా చేరదీశారో తెలియదు. అయితే అదే వ్యక్తిని అనూహ్యంగా పదవి నుంచి తప్పించడం లేదా తప్పుకుంటే చూస్తూ ఉండడం మాత్రం ఆశ్చర్యకరం. న్యాయవ్యవహారాల్లో ధన్‌ఖడ్ పెద్దగా నిపుణుడు కాదని, ఒకటి రెండు ముఖ్యమైన కేసులు తప్ప గొప్ప కేసులు ఏవీ వాదించిన దాఖలాలు లేవని అనేకమంది న్యాయ నిపుణుల అభిప్రాయం. అలాంటి వ్యక్తిని రాజ్యాంగ వ్యవహారాల్లో గొప్ప పరిజ్ఞానం ఉన్న వ్యక్తిగా ప్రశంసిస్తూ అనుభవజ్ఞుడైన వెంకయ్యనాయుడు స్థానంలో మోదీ నియమించినప్పుడు ఆశ్చర్యపోని ఎంపీలు లేరు. ఇప్పుడు ఆయనను తొలగించడం కూడా అంతే ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజకీయాల్లో ఒక వ్యక్తి ఉత్థాన పతనాలు ఎలా జరుగుతాయన్నదానికి జగదీప్ ధన్‌ఖడ్ జీవితమే నిదర్శనం.

గవర్నర్ పదవిలో ఉండగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ బలోపేతం కావడానికి కారకుడై, బీజేపీ ఏజెంట్‌గా ముద్ర పడిన ధన్‌ఖడ్ రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా దాదాపు బీజేపీ నాయకుడుగానే వ్యవహరించారు! ప్రతిపక్ష సభ్యులను ఎంతగా కట్టడి చేయాలో అంతగా కట్టడి చేశారు. విపక్ష సభ్యులు మాట్లాడుతుంటే మాటిమాటికీ అడ్డుతగిలేవారు. పార్లమెంట్‌లో గత ఏడాది భద్రతా వైఫల్యం జరిగినప్పుడు నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఒక దశలో ఆయనను తొలగించేందుకు ప్రతిపక్షాలు నోటీసు కూడా ఇచ్చాయి. పూర్వ ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్య ఒకసారి విందు ఇచ్చినప్పుడు 'మీ హయంలోనే పరిస్థితులు బాగుండేవి' అని పలువురు ప్రతిపక్షసభ్యులు ఆయన వద్ద వాపోయారు. న్యాయవ్యవస్థతో కూడా జగదీప్ ధన్‌ఖడ్ బలంగా ఢీకొన్నారు. న్యాయమూర్తుల నియామకంపై రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా తీవ్రంగా తప్పుపట్టారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో డబ్బు దొరికినప్పుడు అదే అదనుగా ఆయన న్యాయవ్యవస్థపై విరుచుకుపడ్డారు. బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతికి గడువు విధించే హక్కు న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలో ఉన్న సోషలిజం, సెక్యులరిజం పదాలకు వ్యతిరేకంగా కూడా వ్యాఖ్యలు చేశారు.



జస్టిస్ వర్మను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ చైర్మన్‌గా ధన్‌ఖడ్ ఎందుకు ఆమోదించారు? లోక్‌సభలో అధికార ఎంపీలు ఇచ్చిన నోటీసును ఆమోదించి తామే చర్చను ప్రారంభించి న్యాయవ్యవస్థపై పట్టుబిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న విషయం ఆయనకు తెలియదా? పహల్గామ్ ఘటనపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ మల్లిఖార్జున ఖర్గే మాట్లాడేందుకు ధన్‌ఖడ్ ఎందుకు అనుమతించారు?

ప్రభుత్వానికి పరమ విధేయుడులా వ్యవహరించిన ధన్‌ఖడ్ తన పదవీకాలం ఇంకా రెండేళ్లుండగా రాజీనామా చేశారు. ఆ ఉన్నత పదవి నుంచి ఇలా నిష్క్రమించవలసి వస్తుందని ఆయన కూడా అనుకుని ఉండరు. ఉపరాష్ట్రపతి పదవిలో ఆయన అనేక సౌకర్యాలు డిమాండ్ చేసి మరీ కల్పించుకున్నారు. తన వ్యక్తిగత సిబ్బందిలో పలువురిని పార్లమెంటరీ కమిటీల్లో నియమించుకుని ప్రతిపక్షాల విమర్శలకు గురయ్యారు. 2027 ఆగస్టు వరకూ తాను ఉపరాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని 11 రోజుల క్రితమే ఆయన ప్రకటించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను మచ్చలేని సంస్థగా రాజ్యసభలో ప్రశంసించారు. ఇటీవలే ఆర్‌ఎస్‌ఎస్ నేత రాంమాధవ్ పుస్తకావిష్కరణలో సావర్కార్‌ను ప్రశంసించిన ధన్‌ఖడ్ తనపై బీజేపీ అగ్రనేతలు కినుక వహిస్తారని ఊహించి ఉండరు.

ఆరోగ్య కారణాల రీత్యే అయితే ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్నవారు రాజీనామా చేయనవసరం లేదు. రాజ్యాంగ పదవులలో ఉన్నవారికి ప్రభుత్వపరంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఎలాగూ లభిస్తాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నంతకాలం రాజ్యసభను నిర్వహించేందుకు వైస్ ఛైర్మన్, ఇతర ప్యానెల్ ఛైర్మన్లు ఉండనే ఉన్నారు. అందువల్ల ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేశానని ధన్‌ఖడ్ చెబితే నమ్మేవారుండరు. కాని ఆయన నిష్క్రమణ పర్వానికి సంకేతాలు కొద్ది రోజులనుంచే లభిస్తున్నాయని పార్లమెంట్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. అంతర్గత సమాచారం ప్రకారం కొద్ది రోజులనుంచి విదేశాలనుంచి వచ్చే నేతలు, ప్రతినిధులు ఉపరాష్ట్రపతిని కలుసుకోవడం లేదు. ప్రభుత్వాధినేతలు కొన్ని విషయాల్లో తనను విశ్వాసంలోకి తీసుకోవడం లేదని ధన్‌ఖడ్ తన సన్నిహితులతో వాపోయినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ఆదివారం ఆయన తన సిబ్బంది అందరికీ విందు ఇవ్వడం కూడా ఒక సంకేతం.

అసలు జస్టిస్ వర్మను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయన ఎందుకు ఆమోదించారు? లోక్‌సభలో అధికార ఎంపీలు ఇచ్చిన నోటీసును ఆమోదించి తామే చర్చను ప్రారంభించి న్యాయవ్యవస్థపై పట్టుబిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న విషయం ఆయనకు తెలియదా? పహల్గామ్ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రభుత్వంపై అనేక ప్రశ్నలు సంధిస్తూ మాట్లాడేందుకు ఆయన ఎందుకు అనుమతించారు? ప్రభుత్వం నుంచి వస్తున్న వ్యతిరేక సంకేతాల మూలంగా వెళ్లిపోయే ముందు స్వతంత్రంగా వ్యవహరించాలని ఆయన అనుకున్నారా? ధన్‌ఖడ్ ఏర్పాటు చేసిన సభా వ్యవహారాల కమిటీ సమావేశానికి ప్రభుత్వం తరఫున మంత్రులు రాకపోవడం కూడా ప్రతిపక్షాల దృష్టికి వచ్చింది. ధన్‌ఖడ్‌ను తప్పించడం తప్ప మరో మార్గం లేదని, లేకపోతే సభలో మరిన్ని సమస్యలు తలెత్తుతాయని సోమవారం సాయంత్రం మోదీ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్న తర్వాతే ఆయనతో రాజీనామా చేయించారని అధికారిక వర్గాల కథనం.

దేశ అధికార వ్యవస్థలో అత్యంత శక్తిమంతులైన నరేంద్ర మోదీ, అమిత్ షాల ఆలోచనకు భిన్నంగా వ్యవహరిస్తే ఎంతవారైనా, ఎంత ఉన్నత పదవిలో ఉన్నా కొనసాగడం అంత సులభం కాదని జగదీప్ ధన్‌ఖడ్ నిష్క్రమణతో విశదమయింది. అయితే ఒక రాజ్యాంగ పదవిలో ఉన్నవారు సాధారణ ఉద్యోగిలా రాజీనామా చేసి వెళ్లడం, నమ్మదగిన కారణాలు చెప్పకపోవడంతో ఈ దేశంలో ఏది జరిగినా హతాశులు కానక్కర్లేదన్న విషయమూ స్పష్టమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

దశాబ్దాల నిరంతర శబ్ద కాంతులు!

ప్రతి ఒక్కరి సంక్షేమం, ప్రతి ఒక్కరి జీవన సౌఖ్యం కోసం నిరంతరం కృషి చేస్తూ, సూర్యచంద్రులతో పోటీ పడుతూ జ్ఞాన, వినోద, సమాచారాల త్రివేణిగా వెలుగొందుతోంది ఆకాశవాణి. మాట లేనిది మనిషి లేడు. భావ వ్యక్తీకరణకు, సమాచార పంపిణీకి, మానసికోల్లాసానికి మాటే వాహిక. మాటే మనిషికీ మనిషికీ మధ్య వారధి. తొంభై ఏళ్ళ పాటు అలాంటి వారధిగా, విశ్వసనీయతకు మారుపేరుగా పనిచేసింది ప్రసార భారతి. ప్రసారం తనకు తానుగా సులభంగా, సరళంగా, వైవిధ్యంగా, విస్తృతంగా ఆకాశవాణి ద్వారా అందుబాటులో ఉంది.

తొంభై ఏళ్ల క్రితం ఆరంభమైన ఆకాశవాణి ప్రపంచ ప్రసార మాధ్యమాల్లో తనదైన ప్రత్యేకతను చాటుకుంది. ఒక తరాన్ని తట్టిలేపిన రేడియో సిగ్నేచర్ ట్యూన్ వారి హృదయాలపై చేసిన సంతకం ఎంత గాఢమైందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వందేమాతరమంటూ పొద్దున్నే నిద్ర లేపి, భక్తిరంజనితో ప్రశాంత ఆధ్యాత్మిక శబ్దాలయపు ద్వారాలు తెరుస్తుంది. హలం పట్టుకుని పొలానికి బయలుదేరే రైతు మెడలో శబ్ద పుష్పాల మాలగా అలంకృతమవుతుంది. మన వాడ నుంచి విశ్వమంతా తిప్పుకు వచ్చేవి ఆకాశవాణి వార్తావాహికలు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ వార్తలు ఒకవైపు, కరెంట్ అఫైర్స్, స్పాట్‌లైట్ వంటి ఆంగ్ల కార్యక్రమాలు, వార్తా వ్యాఖ్యలు, జిల్లా సమాచార లేఖలు, ఎఫ్.ఎమ్. రెయిన్‌బో న్యూస్ బులెటిన్‌లు, ప్రత్యేక వార్తా కథనాలు... ప్రతి రోజూ నిత్య సత్యాలుగా, శబ్ద సాక్ష్యాలుగా అందిస్తూ వస్తున్న వార్తా విభాగం ఇప్పుడు 'న్యూస్ డివిజన్'గా సేవలు అందిస్తోంది.



నాటకాలు, నాటికలు, రూపకాలు, ప్రత్యక్ష వ్యాఖ్యానాలు, ప్రత్యక్ష ప్రసారాలతో... బాలబాలికలు, యువత, మహిళలు, కర్షకులు, కార్మికులు, వయోధికులు... ఇలా అన్ని వయోవర్గాలకు రేడియో ఒక కుటుంబ నేస్తంగా నిలిచింది. లలిత, జానపద, శాస్త్రీయ సంగీత ప్రక్రియలను ప్రేమగా తన గాలి భుజాలపై మోస్తున్న పాటల పల్లకి రేడియో. తెలుగుతో పాటు అనేక ఇతర భాషల ప్రసారాలతో తెలుగు శ్రోతలను అలరిస్తున్న ఆకాశవాణి కేంద్రాలు ఒకదానిని మించి మరొకటి అద్భుతమైన కార్యక్రమాలను అందిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వందలాది ఆకాశవాణి కేంద్రాలు వివిధ భాషల్లో వైవిధ్యభరితమైన కార్యక్రమాలతో శబ్ద కాంతులు పంచుతున్నాయి.

వివిధ ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల జోరులో సైతం తనదైన శైలిలో తొమ్మిది దశాబ్దాలుగా సాగుతున్న రేడియో, నేటికీ 'మొబైల్ యాప్ న్యూస్ ఆన్ ఎయిర్'గా విశ్వాస వాహినై శ్రోతలను చేరుకుంటూనే ఉంది. 1927లో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ పేరిట బొంబాయిలో మొదలైన ఒక ప్రైవేటు కంపెనీ, ఆల్ ఇండియా రేడియోగా ప్రభుత్వాధీన సంస్థగా స్వర ప్రస్థానం ప్రారంభించింది. 1957 నుంచి వివిధ భారతిగా కూడా విలసిల్లుతోంది.

ప్రతి నెలా చివరి ఆదివారం దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' వినని వారుండరు. భారత ప్రధానమంత్రి మోదీ యావత్ దేశంలో మూలమూలలో జరుగుతున్న నిర్మాణాత్మక కార్యక్రమాలను ఉటంకిస్తూ, యువతను, మహిళలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, దేశ సమగ్రతను బలోపేతం చేయడానికి, మన దేశాన్ని ప్రపంచ వేదికలపై నిలపడానికి వారి 'మన్ కీ బాత్' ప్రసంగమాలికల ద్వారా నూతన స్ఫూర్తిని అందిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు అందరికీ సులభంగా అందుబాటులో ఉండే ప్రసార సాధనాలలో రేడియో ముందుంటుంది అన్నది అందరికీ తెలిసిన విషయమే. భాషను, యాసను కాపాడుతూ, సాహితీ పిపాసను పెంపొందించడంలో నాటి నుంచి నేటి వరకు రేడియో ప్రభావవంతమైన సాధనం. ప్రసారభారతి ఆర్కైవ్స్ విభాగం మహనీయుల రికార్డింగులను భద్రపరిచి మనకు అందిస్తున్నది. శాస్త్రీయ, జానపద, లలిత సంగీత, నాటక కళాకారులు ఆకాశవాణి గ్రేడింగ్‌నే ప్రామాణికంగా తీసుకుని రేడియో ద్వారా ఇతర ప్రసార మాధ్యమాలకు అనుసంధానంగా మారుతున్నారు.

ఆకాశవాణి హైదరాబాద్, కడప, విజయవాడ, విశాఖ కేంద్రాలకు తోడుగా, తెలుగు గాలిని శబ్ద పరిమళాలతో నింపుతున్న స్థానిక తెలుగు రేడియో కేంద్రాలు ఆయా మట్టి పరిమళాలను వెదజల్లుతున్నాయి. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కొత్తగూడెం, అనంతపురం, తిరుపతి, కర్నూల్, మార్కాపురం... వంటి లోకల్ రేడియో స్టేషన్లు మొబైల్ యాప్ మాధ్యమం వలన 'లోకల్ టు గ్లోబల్ వోకల్'గా వినిపిస్తున్నాయి. ప్రసారమే ప్రాణం అన్న నానుడిని సార్థకం చేస్తూ, ఆకాశవాణి ప్రస్థానం నిత్య నూతనంగా కొనసాగాలని ఆశిద్దాం!

◆ **మడిపల్లి దక్షిణామూర్తి**
(నేడు జాతీయ ప్రసార దినోత్సవం)

పరాకాష్ఠకు కమ్యూనిస్టుల పిడివాదం!

రష్యా, చైనాలను సోషలిస్ట్ సామ్రాజ్యవాద దేశాలని పేర్కొనడం తప్పే. ఎందుకంటే అవి పెట్టుబడిదారీ నియంతృత్వ సామ్రాజ్యవాద దేశాలు. అక్కడ ఉన్నది వ్యక్తి లేదా పార్టీ నియంతృత్వం. అక్కడ పీడిత ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చడం లేదు. అక్కడ సంపద సమాజపరమూ కాలేదు. సోషలిజం వదిలి అవి ఏనాడో పెట్టుబడిదారీ దేశాలైనాయి. అయినా భారతీయ కమ్యూనిస్టులకు రష్యా, చైనాల పట్ల మక్కువ పోవడం లేదు. పెట్టుబడిదారీ ప్రజాస్వామిక సామ్రాజ్యవాద దేశాలకు రష్యా, చైనాలు ఎందులోనూ తీసిపోవు.

"ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా పరిగణించకూడదు కానీ, పాలస్తీనా–ఇరాన్‌లపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను మాత్రం సామ్రాజ్యవాద యుద్ధంగా పరిగణించాలి" అని పేర్కొనడం కమ్యూనిస్టుల హ్రస్వదృష్టికి నిదర్శనం. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ విప్లవం విజయవంతమైంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత చైనా, తూర్పు యూరోపుల్లో విప్లవాలు చెలరేగి సోషలిస్ట్ శిబిరాలు ఏర్పడ్డాయి. కాబట్టి ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం జరిగితే మూడవ వరస విప్లవాలు జయప్రదం అవుతాయి అనుకోవడం (జూలై 8న డా. శ్రీనివాస్ రచన 'సామ్రాజ్యవాద అంతిమ బుసలు') చారిత్రక అవగాహనారాహిత్యమైనా, పిడివాదం పరాకాష్ఠకు చేరడమైనా లేదా సైద్ధాంతిక హింసోన్మాదమైనా కావాలి. అనేక దేశాలు అత్యాధునిక అణ్వాయుధాలు సమకూర్చుకున్న ఈ కాలంలో ప్రపంచ యుద్ధమంటూ జరిగితే మానవజాతి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అపుడు చావగా మిగిలిన మనుషులతో ఆదిమ కమ్యూనిజం స్థాపించడం కమ్యూనిస్టుల ఉద్దేశమా?

"ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. నర జాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అన్న శ్రీశ్రీ పలుకులు కమ్యూనిస్టు దేశాలకూ వర్తిస్తాయి.

1932, 1933లో ఉక్రెయిన్‌లో తలెత్తిన కరువు స్టాలిన్ నిర్ణయ వల్లేనన్నది మానవ చరిత్రలోని చీకటి అధ్యాయాలు చెబుతున్నాయి. లెనిన్ హయాంలో రూపొంది, 1921–1928 మధ్య అమలైన కొత్త ఆర్థిక విధానం వల్ల ఉక్రెయిన్ ఆర్థికంగా పురోగమించింది. కానీ లెనిన్ తదనంతరం ఉక్రెయిన్ వాసుల స్వతంత్ర కాంక్షను తొక్కివేయడానికి, రష్యా పారిశ్రామికీకరణ కోసం స్టాలిన్ అవలంబించిన విధానాల వల్ల ఆకలితో అలమటిస్తూ సుమారు ఐదు మిలియన్ల ఉక్రెయిన్ ప్రజలు నాశనమయ్యారు. ఆ కిరాతక కాలంలో కరువుతో అలమటిస్తూ అక్కడి మనుషులు నరమాంస భక్షణకు పూనుకున్నారనే విషయం మానవజాతి చరిత్రలో అత్యంత విషాదకరం. కమ్యూనిస్టులు పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా మానవజాతికి చూపుతున్న ఉన్నతమైన సమాజం ఇటువంటిదేనా?

చైనాలో సుమారు ఒక మిలియన్ టిబెటన్ పిల్లలను కుటుంబాలను నుంచి వేరు పరచి, ప్రభుత్వం నడిపే బోర్డింగ్ స్కూళ్లలో బలవంతంగా చేర్చి, వారిని టిబెటన్ సంస్కృతి వదలి హాన్ సంస్కృతిలో భాగమయ్యేలా చేయడానికి అక్కడి కమ్యూనిస్ట్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఐక్యరాజ్యసమితి మానవహక్కుల పరిశీలకులు ఆందోళన వెలిబుచ్చారు. జాతీయవాద అస్తిత్వంతో కూడిన బలమైన సోషలిస్ట్ వ్యవస్థను రూపొందించడానికి చైనా చేస్తున్న అమానవీయ ప్రయత్నాలు ఫాసిజం పరిధిలోకి రావా? దీని గురించి మాట్లాడకుండా భారతదేశంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఫాసిస్టు ప్రభుత్వమంటూ రోజూ గగ్గోలు పెట్టే భారతీయ కమ్యూనిస్టుల విశ్వసనీయత సందేహాస్పదంగా ఉంది.

సామ్రాజ్యవాదులకు సింహస్వప్నమైన ఉత్తర కొరియా కమ్యూనిస్ట్ నాయకుడు కిమ్ ఇల్ సంగ్ నెలకొల్పింది స్వేచ్ఛాయుత సమసమాజమా లేక నిత్యం భయం గుప్పిట్లో ఉండే వంశ పారంపర్య నియంతృత్వ రాజ్యమా? కిమ్ ఇల్ సంగ్ మనవడు కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలో ఉత్తర కొరియాలో విస్తృతంగా మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని 2014 యుఎన్ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ (సీఓఐ) రిపోర్ట్ ప్రపంచానికి చాటిచెప్పింది. నియంత పట్ల విధేయంగా ఉండేందుకు ప్రజలను అన్యాయంగా కారాగారాలలో వేయడం, చంపడం, వారితో వెట్టి చాకిరీ చేయించడం వంటి విధానాలను ఉత్తర కొరియాలో అమలు చేస్తున్నారని, స్త్రీల పట్ల లైంగిక వేధింపులు సాధారణమైపోయాయని, కనీస మానవహక్కులను కూడా ప్రజలకు లేకుండా చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలియజేసింది.

రష్యా, చైనా, ఉత్తర కొరియా కథలు వింటేనే అర్థమవుతుంది... కమ్యూనిజం మానవజాతికి ఇచ్చేది అభయం కాదు, భయమేనని. విమర్శలను కాపిటలిస్ట్ ప్రోపగాండా అంటూ కొట్టిపారేస్తూ సైద్ధాంతిక పరిభాషతో తాము చేసిన, చేస్తున్న, చేయబోయే హింసను సమర్థించుకునే కమ్యూనిస్టులతో ఉన్నతమైన సమాజం సాధ్యమవుతుందనుకోవడం అవివేకమే అవుతుంది. ఇది చరిత్ర చాటుతున్న సత్యం.

○ **గౌరాబత్తిన కుమార్‌బాబు**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 23 జూలై 2025



నేడు విద్యాసంస్థల బంద్

జయప్రదం చేయాలన్న విద్యార్థి సంఘాలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో సమస్యలను పరిష్కరించాలని, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాఠశాలలు, కాలేజీలు బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని సంఘాల నాయకులు సంతోష్, శ్రీకాంత్, రంజిత్, సావిత్రి ఒక ప్రకటనలో కోరారు.



మాట్లాడుతున్న వరంగల్ సీపీ

డ్యూటీ మీట్‌ను విజయవంతం చేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- మామునూరు పీటీసీలో సమీక్షా సమావేశం

మామునూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన అధికారులతో కలిసి మామునూరు పీటీసీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మామునూరులో రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తున్నందున పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్దసంఖ్యలో వస్తున్నందున వారికి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్‌కుమార్, షేక్ సలిమా, రాజమహేంద్రనాయక్, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, సీఐడి రాంరెడ్డి, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ ఐసీసీసీ కేంద్రాన్ని సందర్శించిన మేయర్, కమిషనర్

ఐసీసీసీ నుంచి వాహనాలు నియంత్రించేలా చర్యలు

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

6

నాలాలపై నిర్లక్ష్యమేల?!

- రూ.1.20కోట్లతో డిసిల్టేషన్ పనులకు శ్రీకారం
- ఇప్పటికీ 50 శాతం పనులు మాత్రమే పూర్తి
- వర్షాకాలం ముంచుకొస్తున్నా ముందుకు సాగని పనులు
- నిర్లక్ష్యం వహిస్తున్న సిండికేట్ కాంట్రాక్టర్లు
- పట్టింపులేని బల్దియా అధికారులు, పాలకులు

నామమాత్రంగా పూడికతీత పనులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కాగితాల్లో కనిపిస్తున్నా ఆచరణలో అగమ్యగోచరంగా మారింది. వరంగల్ నగరంతో పాటు విలీన, లోతట్టు ప్రాంతాల ప్రజలను వరద ముంపు నుంచి తప్పించేందుకు ఇటీవల డిసిల్టేషన్ (నాలాల పూడికతీత) పనులకు ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం కొందరు కాంట్రాక్టర్ల అసమర్థత, అధికారుల అలసత్వం వల్ల నగరంలోని ప్రధాన నాలాలతో పాటు కచ్చ, బాక్స్ డ్రెయినేజీల్లో జరిగే పనులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నాసిరకం పనుల కారణంగా కొద్ది రోజుల్లో వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు నీట మునగక తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరంగల్ నగర ప్రజలు నీట మునిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రధానంగా పెద్ద నాలాల్లో పూడికతీత పనులు అడుగు వరకు తీయాల్సి ఉంది. కానీ కొందరు బడా కాంట్రాక్టర్లు ఏఈ, డీఈ స్థాయి అధికారులను మచ్చిక చేసుకుని నయానో.. బయానో ఇస్తామని బిల్లులు పొందే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలో చాలా చోట్ల సమగ్రంగా పూడికతీత పనులు చేపట్టనప్పటికీ కొందరు కాంట్రాక్టర్లు ఇప్పటికే పనులు పూర్తి చేశామని చెప్పుకుంటున్నారు. కానీ నాలాల పూడికతీత పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు కనిపిస్తోంది. దీంతో పెద్ద ఎత్తున పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం, జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా కాలువల నుంచి తీసిన మట్టిని పక్కనే పోసి చేతులు దులుపుకున్నారు. ఒక్క వర్షం కురిస్తే పోసిన మట్టి తిరిగి నాలాల్లో చేరే అవకాశం ఉంది. ఇలాంటి వారిని ఇంజనీరింగ్, బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది.





వరంగల్‌లోని బొందివాగులో పేరుకుపోయిన మట్టి

రూ.1.20 కోట్ల నిధులు దుర్వినియోగం

వేసవి కాలంలోనే డిసిల్టేషన్ పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసినా నత్తను తలపిస్తున్నాయి. బల్దియా పాలకవర్గం అధినాయకత్వంతో పాటు కమిషనర్ సమన్వయంతో నగరంలో 36 ప్రధాన నాలాలు, 350 అంతర్గత నాలాల్లో పూడికతీత పనులకు ప్రతిపాదనలు చేశారు. ముందుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపడితే వరద ముంపు నుంచి లోతట్టు ప్రాంతాల ప్రజలను తప్పించవచ్చని అధికారులు భావించారు. ఈ పనులకు జనరల్ ఫండ్ నుంచి రూ.1.20 కోట్లు కేటాయించారు. పూడికతీత పనులు చేపట్టేందుకు టెండర్లు పిలువగా కొందరు కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి పనులు దక్కించుకున్నారు. మరి కొందరు అధికారులను కాకాపట్టి వచ్చే బిల్లులో 10 శాతం పర్సంటేజీ ఇస్తామని అడ్డదారిలో పనులు దక్కించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈక్రమంలో చాలామంది పూడికతీత పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటికే పనులను ముగించామని చెప్పుకొస్తున్నా 50 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని ప్రజలు మండిపడుతున్నారు. దర్జాగా బిల్లులు నొక్కేందుకు కొందరు కాంట్రాక్టర్లు స్కెచ్ వేసి కూర్చున్నారు. అయితే బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో కొందరు గుత్తేదారులు చేతులు కలిపినట్లు తెలుస్తోంది. వారి సూచనల మేరకు వర్షాకాలం ముంచుకు వచ్చే వరకు వేచి చూస్తే పనులు చేసినట్లు ఎంబీలు సృష్టించి దొడ్డిదారిన బిల్లులు నొక్కవచ్చనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఎక్కడి నుంచి ఎక్కడికంటే..

వర్షాకాలం నేపథ్యంలో కాలనీలు ముంపునకు గురి కాకుండా ఉండేందుకు వరంగల్ ట్రైసిటీస్‌లో అక్కడక్కడ నామమాత్రంగా పూడికతీత పనులు జరుగుతున్నాయి. అధికారులు సూచించిన

(మిగతా 8వ పేజీలో...)



హనుమాన్‌నగర్ మంగళివాగు నాలాలో కనిపిస్తున్న వ్యర్థాలు



ఈదులవాగు వద్ద నాలా నుంచి తీసిన మట్టిని ఒడ్డున పోసిన దృశ్యం



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి చర్యలు

- కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి జితిన్ ప్రసాద్
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు వివరణ ఇచ్చిన మంత్రి

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభలో వెల్లడించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన వివరణ ఇచ్చారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా కారిడార్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయడం ద్వారా పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుల స్థితిగతులు, అమలులో ఉన్న కార్యాచరణ ప్రణాళికల పురోగతిపై త్వరలో మరింత సమాచారం వెల్లడిస్తామన్నారు. కారిడార్ల అభివృద్ధి పారిశ్రామిక కనెక్టివిటీని మెరుగుపరచడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమగ్ర ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా సాగుతోందన్నారు. పారిశ్రామిక కారిడార్ల పురోగతిపై కేంద్రం నిరంతరం రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పందిస్తూ.. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక కారిడార్ల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలతో పాటు ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- ఆగస్టు 15నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, జూలై22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించాలని, రైతులు ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూముల సమస్యలు పరిష్కరించడంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని చీఫ్ సెక్రెటరీ కార్యాలయం నుంచి మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్‌లదేనన్నారు. భూభారతిలో రైతుల దరఖాస్తుల తిరస్కరణకు అధికారులు సరైన కారణాలు చూపాలన్నారు. ఆగస్టు 15నాటికి వీలైనన్ని రైతుల భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్య రాకూడదని, లబ్ధిదారులకు ఉచిత ఇసుక ఇవ్వాలన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో శానిటేషన్‌ను చేపట్టాలన్నారు. హాస్టళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ వారంలో ఒక్కరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

వరంగల్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో

(మిగతా 8వ పేజీలో...)

PUBLIC NOTICE

This is to inform to the public at large that our Corporation is Proposing to sanction a Medium Term Loan of **Rs.169.00 lakhs (Rupees One Hundred and Sixty Nine Lakhs Only)** to **Sri Murarkar Naveen Kumar** Prop. of M/s. Sri Sri Rudrakshini Restaurant & Bar and M/s. Rudrakshini Restaurant & Bar and also Proposing to Sanction a Medium Term Loan of **Rs. 150.00 Lakhs (Rupees One Hundred and Fifty Lakhs Only) to Smt. Murarkar Shailaja** Prop. of M/s. Sri Indrakhila Restaurant & Barand M/s. MNK Restaurant & Bar, both are Resident of H.No.16-4-1182, Shiva Nagar, Warangal, Telangana- 506002. The Medium Term Loan is secured by following Collateral Security properties:

COLLATERAL SECURITY: - Item No.1: Smt. Murarkar Shailaja W/o. Naveen Kumar is offering freehold interest in all the Godown, R.C.C. room and open place bearing **GWMC H. No. 36-9-171** (Old G.P. House No.9-76) admeasuring to an extent of 10,043-00 Sq.Yds or 8,396-00 Sq.Mts. with a Plinth area of 10,043 Sq.Fts. of Godown A.C.Sheet area is in delapidated condition and 2996-00 Sq.Fts RCC area in Survey Numbers 396/3/1 and 396/C of **Dharmaram Revenue Village, Geesugonda Mandal, Warangal District with in Greater Warangal Municipal Corporation Limits** as Collateral Security. The Surety is claiming title to the above property by virtue of Registered Sale Deed No.5469/2024, Dated:16.11.2024 and its Regd. Rectification Deed Doc. No.4324/2025, Dated: 27.06.2025 at SRO-Warangal (Rural). The property is bounded by **East:** Land of A.Kedari; **West:** 50 Feet Wide Road; **North:** Road; **South:** Land of Bagwandas Soni.

Item No.2: Sri Murarkar Naveen Kumar S/o. Late M.Narsinglal and Smt. Murarkar Shailaja W/o. Naveen Kumar were offering freehold interest in all the Residential House bearing **H.No.16-4-1141,** along with Open Land admeasuring an extent of 324.44 Sq.Yards or 271.23Sq.Mts, in Plot No. 2 with RCC Plinth area of 1025.00 Sq.Fts (Ground Floor) and 1025.00 Sq.Fts.(First Floor) situated at **Shivanagar, Urus Village, Khilawarangal Mandal, Warangal District with in Greater Warangal Municipal Corporation Limits** as Collateral Security. The Surety is claiming title to the above property by virtue of Regd. Sale Deed No.570/2025, Dated: 24.01.2025 and its Regd. Rectification Deed Doc. No.4815/2025, Dated: 28.06.2025 at SRO Warangal (Fort). The property is bounded by **East:** 30 Feet Wide Road; **West:** House No. 16-4-1182 of Murarkar Naveen Kumar; **North:** House No. 16-4-1140 of Kasi Vishwanath; **South:** 20 Feet Wide Road. Hence, any person/institution, banks having any claim/right/interest or any objections for mortgage of the above property in favour of our corporation shall inform to the undersigned in writing with the documentary proof/evidence within 7 days of this notice, otherwise it shall be deemed that the above properties are free from encumbrance, charges, adverse claims and the Corporation will proceed further with the equitable mortgage transaction. Please note that objections received after the said notice period are not at all binding on the Corporation.

Date : 22-07-2025

Sd/- ASST. GENERAL MANAGER
A.P. STATE FINANCIAL CORPORATION
Beside Dist. Central Library, Balasamudram, Hanamkonda, Warangal-506001. (Mobile No.8897255433, 9949358503)

'ఉల్లాస్'ంగా.. ఉద్యోగం..

- అతివల అక్షరాస్యతకు సదవకాశం
- మహిళా సంఘాల్లోని సభ్యులపై ప్రత్యేక దృష్టి
- చదువుకున్న వారిని టీచర్లుగా ఎంపిక
- ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు

7

క్రేజీ.. జియాలజీ

- పీజీ కోర్సు పూర్తి చేసినవారికి ఉజ్వల భవిష్యత్
- కేయూలో అడ్మిషన్లకు పెరుగుతున్న డిమాండ్

7

బ్లాక్ మెయిలర్ చేతిలో రాష్ట్రం

- నీళ్ల కోసం పాదయాత్ర చేస్తే చిల్లరమాటలు మాట్లాడుతున్నారు..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓ బ్లాక్ మెయిలర్ చేతిలో తెలంగాణ రాష్ట్రం నడవడం చాలా బాధాకరమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలో నీళ్ల కోసం పాదయాత్ర చేస్తే కొందరు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, వారిని పట్టించుకునే అవసరం లేదని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. గతంలో ఈ నీళ్ల కోసమే మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు విషయంలో లాఠీ దెబ్బలు తిన్నానని గుర్తుచేశారు. వర్ధన్నపేటకు నీళ్ల కోసం కష్టపడ్డది తానేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420బోగస్ హామీల వల్ల మోసపోయామని ప్రజల్లో ఇప్పుడు మార్పు వచ్చిందని తెలిపారు. వారం రోజుల్లో రైతులకు నీరందించకపోతే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడి చేస్తానని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ రైతు భరోసా నిధులు విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందన్నారు. కేసీఆర్ దూరదృష్టితో రైతులు సుభిక్షంగా ఉండాలని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఎర్రబెల్లి గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. పార్టీ కేడర్, యూత్, సోషల్ మీడియా నాయకులు ఈ ఎన్నికల్లో కష్టపడాలని కోరారు. ప్రజలు, నిరుద్యోగ యువత, ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని, 80శాతం స్థానాలు బీఆర్ఎస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బానోతు శ్వేత సుభాష్, మాజీ వార్డు సభ్యుడు బానోతు కీమా, మాలోతు రవి, బోజ్యా, లక్ష్మణ్‌లు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపెల్లి కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి, పున్నమయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఐసీసీసీ నుంచి వాహనాల

నియంత్రణకు చర్యలు

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) నుంచి వాహనాలను నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన జేసీబీలు, డోజర్లు, చెత్త తరలింపు ట్రాక్టర్ల కదలికలను ఐసీసీసీ కేంద్రం నుంచి మానిటరింగ్ చేసేలా ఉండాలన్నారు. పనిచేయని వాహనాల పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. ఇండోర్ తరహాలో మానిటరింగ్ వ్యవస్థ కొనసాగాలన్నారు. చెత్త తరలింపు వాహనాల సమాచారం ఎప్పటికప్పుడు జవాన్‌లు పరిశీలించాలన్నారు. స్వచ్ఛఆటోలకు బయోఫెన్సింగ్ లాగింగ్ ఉండాలన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు ఐసీసీసీకి చేరేలా అనుసంధానం చేయాలన్నారు. ఫిల్టర్‌బెడ్‌లలో ఉన్న 125 సీసీ కెమెరాలను అనుసంధానం చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీసీ ప్రసన్నరాణి, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఐటీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

కేఎంసీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

వరంగల్ మెడికల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 28లోపు కేఎంసీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఎంఏ తెలుగు ప్రవేశాలకు ఇంటర్వ్యూ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 30, 31 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9989139136, 9989417299 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎర్త్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రామచంద్రం



కేయూ వీసీ నుంచి ఉత్తర్వులు తీసుకుంటున్న రామచంద్రం

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ వర్సిటీ మొట్టమొదటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మంగళవారం కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో నియామక ఉత్తర్వులను అందచేసి అభినందించారు. 1991లో కేయూలో చేరిన రామచంద్రం.. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి, డెవలప్‌మెంట్ ఆఫీసర్, రాజనీతిశాస్త్ర అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా పనిచేశారు. అలాగే దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా, కేయూ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం సైకాలజీ విభాగాధిపతిగా, కేయూ రిజిస్ట్రార్‌గా గత జనవరి 31 నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 33 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం కల్గిన రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో 8 మంది డాక్టరేట్‌లు, మరో 4 గురు ఎంఫిల్ సాధించారు. 47 సదస్సులు, 34 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ప్రొఫెసర్ రామచంద్రం రాజనీతిశాస్త్రం, సైకాలజీ, ఎడ్యుకేషన్ మూడు విభాగాల్లో డాక్టరేట్ పట్టా సాధించి ఘనత వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.



WANTED

★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు టెలికాలర్స్ కావలెను. అర్హత : Any Degree సం॥ప్ర॥ 9052833550, 9504506666

AJW-540

WANTED

★ ప్రముఖ జిమ్ సెంటర్ (సుబేదారి) లో పని చేయుటకు Receptionist & Trainer (Male) కావలెను. Near by వారికి మొదటి ప్రాధాన్యత Salary 10k. సెల్ :9052175676, 7396125034.

AJM-13760

CHANGE OF NAME

★ I, MAHAMMAD FAHEMIDA BEGAM, W/o. MOHAMMED NASEERUDDIN (Old Name), H.No:1-98, Konkapaka(V), Parvathagiri (M), Warangal(Dist), PinCode :506365, T.G., I Have Changed my Name as FAHEMIDA BEGAM MOHAMMED, W/o. MOHAMMED NASEENRUDDIN (New Name) for all future Purpose.

AJW-237092

HOUSE FOR SALE

★ కేవలం రూ॥ 38 లక్షలకే డబుల్ బెడ్‌రూం హౌస్ EMI పద్ధతిలో అమ్మబడను. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి. సెల్ : 7995514411

AJW-243350

HOUSE FOR SALE

★ 32 లక్షలకే East Facing పక్కా రిజిస్ట్రేషన్ గల 113 Sq.Yds పాత గూన ఇల్లు-వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో 10ft. ప్లూవర్‌లో కట్టుకోవడానికి G+1 Municipal Construciton Permission కూడా ఉన్నది. బ్యాంకు లోన్‌కూడా వస్తుంది. సం॥ప్ర॥ 8331888842

AJW-243347

WATER PROOFING

★ బిల్డింగ్ లీకేజీస్, రూఫ్/స్లాబ్ లీకేజీస్, సైడ్ వాల్స్ (నిమ్ము), వాటర్ ట్యాంక్స్ మొదలగునవి వాటర్ ప్రూఫింగ్ రసాయనాల ద్వారా నివారించబడును. 10 సం॥ గ్యారెంటీ SBI & ఇతర బ్యాంక్ ఉద్యోగులకు స్పెషల్ డిస్కౌంట్ ఇవ్వబడును. సం॥ప్ర॥ 7386961381.

AJW-243346

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు **రూ. 250/-** మాత్రమే. అదనపు లైనుకు **రూ. 45/-**

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9985406150
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9985418040

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

హత్య కేసు ఛేదించిన పోలీసులు

- పునుగుల బండి వద్ద ఇబ్బంది పెడుతున్నాడని ఘాతుకం
- నలుగురు నిందితుల అరెస్ట్



హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బచ్చన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న అర్ధరాత్రి జనగామ జిల్లా బచ్చన్నపేటలో హత్యకు గురైన బత్తుల రాజిరెడ్డి కేసును పోలీసులు ఛేదించారు. హత్యలో పాల్గొన్న ఇద్దరితో పాటు, సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని మంగళవారం ఏసీపీ నితిన్ చేతన్ పండరి సమక్షంలో అరెస్ట్ చూపారు. ఏసీపీ మాట్లాడుతూ మతిస్థిమితం లేని రాజిరెడ్డి, పునుగుల బండి నడుపుతున్న ఉమాసాగర్ అలియాస్ సన్నీ వద్దకు వచ్చి నిత్యం బూతులు తిడుతుండేవాడని, బండి వద్ద ఉన్న కుటుంబ సభ్యురాలిని చూస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుండేవాడన్నారు. దీంతో గిరాకీకి దెబ్బ తింటుందని భావించి రాజిరెడ్డి పీడ వదిలించుకోవాలనే ఉద్దేశంతో కోరుబోతుల అరుణ్‌తో కలిసి సిమెంట్ ఇటుకలతో కొట్టి చంపారని వెల్లడించారు. వారికి కోరుబోతుల రాజు, తంగళ్లపల్లి విజయ్‌లు సహకరించారన్నారు. హత్యకు ఉపయోగించిన ఇటుకలను, రక్తం అంటిన దుస్తులను కాల్చివేయగా, వాటికి సంబంధించిన దుస్తుల ముక్కలను, దాచి ఉంచిన ప్యాంట్లు, స్కూటీ, బైక్‌ను స్వాధీనపర్చుకున్నట్లు ఏసీపీ వివరించారు. కేసును ఛేదించిన సీఐ అబ్బయ్య, ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ హమీద్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పెన్షన్ పెంచకుంటే సీఎం పదవి నుంచి తప్పుకోవాలి

ఎంఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

న్యూశాయంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో వికలాంగులకు, ఇతర పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే పెన్షన్ పెంచాలని, లేదంటే సీఎం పదవికి రాజీనామా చేయాలని ఎంఎస్‌పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ డిమాండ్ చేశారు. న్యూశాయంపేటలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన మంగళవారం హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వైకే విశ్వనాథ్ హాజరై మాట్లాడుతూ.. వికలాంగులు, వితంతువులు, ఇతర పెన్షన్‌దారులకు ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి సీఎం అయ్యారని, ఇప్పటికైనా వెంటనే పెన్షన్ పెంచాలని, లేదంటే పెన్షన్‌దారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఈ నెల 29న వరంగల్ లేబర్‌కాలనీ 100ఫీట్ల రోడ్‌లో ఉన్న శుభం గార్డెన్‌లో వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల సభకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ వస్తున్నారని, ఈ సభకు పెద్ద సంఖ్యలో పెన్షన్‌దారులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్, ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు సందె కార్తీక్, వంగూరి ఆనందరావు, కందుకూరి సోమన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు రండి

- మంత్రి సురేఖకు గంగు ఉపేంద్రశర్మ ఆహ్వానం



మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఉపేంద్రశర్మ తదితరులు

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని సుప్రసిద్ధ వేయిస్తంభాల గుడిలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు జరిగే శ్రావణమాసోత్సవ పూజాకార్యక్రమాలకు రావాల్సిందిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆహ్వానించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని నివాసంలో మంత్రిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 28వ తేదీన శ్రావణ మాస తొలి సోమవారం ఆలయానికి విచ్చేసి ఆరోజు జరిగే రుద్రహోమం, మహాన్నపూజ, మహాన్నదానం కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా వస్తానని చెప్పారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా విష్ణు, శివ, అమ్మవారి ఆలయాలు, గ్రామ దేవతల గుళ్లలో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి సురేఖను కలిసినవారిలో ఉపేంద్రశర్మతో పాటు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.అనిల్‌కుమార్, సిబ్బంది మధుకర్ ఉన్నారు.



కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో నిర్వాహకులు

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌లో పతకాలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బల్బీర్‌సింగ్ జునేజా స్టేడియంలో ఈ నెల 16నుంచి 20వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు పతకాలను కొల్లగొట్టారు. పత్తి వెంకటసాయి 70కిలోల లోకిక్ విభాగంలో ప్రతిభ కనబర్చి కాంస్యం, 45కిలోల కిక్‌లైట్, కిక్ కాంటాక్ట్ విభాగాల్లో జాడి మాధవి, కొమ్ము భవ్యశ్రీలు ప్రత్యర్థులపై విజయ దుందుభి మోగించి కాంస్య పతకాలను సాధించారని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగిరి తిరుపతి తెలిపారు. విశ్వ విద్యాలయం నుంచి నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా, ఇందులో ముగ్గురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చారన్నారు. ఈ మేరకు పలు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులను మంగళవారం తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, కోశాధికారి పి.శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

‘దేవాదుల’ సెంట్రల్ నోడల్ అధికారిగా ఆశిష్‌సక్సేనా

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం సెంట్రల్ నోడల్ అధికారిగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఎస్‌హెచ్ ఆశిష్ సక్సేనా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పదంలాల్ నేగి స్థానంలో ఆయన నియమితులయ్యారు. సక్సేనా హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని ఈ ప్రాజెక్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై), జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పరిధిలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సాగునీటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించేందుకు తీసుకోవలసిన చర్యలను సెంట్రల్ నోడల్ అధికారిగా సక్సెనా కేంద్రానికి సూచిస్తారు. ప్రతీ నీటిబొట్టుతో ఎక్కువ పంటను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. అలాగే జల్ జీవన్ మిషన్ కిందకు కూడా తీసుకువచ్చిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, ప్రాజెక్టు రైతులకు మరింత ఎక్కువ ప్రయోజనం కలిగించేట్టు చూడడం వంటి మౌలిక విధులను నిర్వర్తిస్తారు.

దేవాదుల ప్రాజెక్టు హనుమకొండ, వరంగల్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 2.48 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడానికి ఉద్దేశించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.13580.63కోట్లు. ఈ ప్రాజెక్టు వాస్తవానికి 2025 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా 2027 మార్చి నాటికి పూర్తవుతుందని అంచనా. ప్రాజెక్టు మిగిలిపోయిన పనుల సత్వర పూర్తికి సెంట్రల్ నోడల్ ఆఫీసర్ మార్గదర్శనం చేస్తారు.



గూడూరులో అరకపట్టి దున్నుతున్న ఎస్సై లింగారెడ్డి

అరక పట్టి.. చెలక దున్ని..

సాగు పనుల్లో ఎస్సై మమేకం

పాలకుర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో తలమునకలయ్యే ఆ ఎస్సై అరక పట్టి పత్తి చేనులో దున్నడం ఆసక్తిగా మారింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మేకల లింగారెడ్డి రోజువారి విధుల్లో భాగంగా గూడూరు గ్రామానికి వెళ్లాడు. తిరిగి పాలకుర్తికి వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో పత్తి చేనులో రైతు అరక దున్నడం చూసి తాను దున్నుతానని రైతుకు చెప్పి అరక అందుకున్నాడు. కాడెద్దులను కదిలిస్తూ వడివడిగా దున్నాడు. అలిసి పోయేదాక హలం పట్టి సాగుపై తన కున్న మమకారాన్ని చాటుకున్నాడు. అనంతరం పత్తి సాగుపై రైతుతో కాసేపు ముచ్చటించాడు. రైతుకు నమస్కరించి అక్కడి నుంచి పెట్రోలింగ్ వాహనంలో వెళ్లిపోయాడు.



ఢిల్లీలోని నోయిడాలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రామస్వామి

కుకై సమావేశానికి హాజరైన రామస్వామి

నర్సంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని నోయిడాలో ఈ నెల 19న జరిగిన 'కుకై' అసోసియేషన్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నర్సంపేటకు చెందిన పర్యావరణవేత్త, కళాకారుడు గోకా రామస్వామి పాల్గొన్నారు. ఆ సమావేశంలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైఎస్ ప్రెసిడెంట్ గోకా రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కుకై (సీయూసీఏఐ) అసోసియేషన్ పేరును యునెస్కో అసోసియేషన్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారని రామస్వామి తెలిపారు. అసోసియేషన్ ద్వారా భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో నేషనల్ జనరల్‌సెక్రటరీ యోగేష్ కులశ్రేష్ఠ, ఆగ్రాకు చెందిన అసోసియేషన్ కోశాధికారి రాజేశ్ కులశ్రేష్ఠ, రాజస్థాన్‌కు చెందిన గోపాల్‌లాల్, పంజాబ్‌కు చెందిన సుమన్‌శర్మ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మమీబా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఫిరోజ్‌ఖాన్, తెలంగాణకు చెందిన రాజగోవింద్ పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను బెదిరించిన నకిలీ విలేకరుల అరెస్టు

ఇద్దరు అన్నదమ్ముల రిమాండ్



నకిలీ విలేకరుల అరెస్టు చూపిస్తున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు తహసీల్దార్‌ను డబ్బుల కోసం బెదిరించిన ఇద్దరు నకిలీ విలేకరులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన అన్నదమ్ములు దామెర రాజేందర్, దామెర రవీందర్‌లు జన నిర్ణయం అనే (పీడీఎఫ్) పేపర్ పెట్టారు. ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌పై మల్లన్న మండపంలో వి(అ)క్రమార్కుడు పేరిట నిబంధనలకు విరుద్ధంగా నాలా కన్వర్షన్ చేస్తున్నాడంటూ కథనం రాశారు. ఆ క్లిపింగ్‌ను తహసీల్దార్‌కు వాట్సాప్ చేసి ఫలానా సర్వే నంబర్లలో అంటూ మెసేజ్ పెట్టి రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రోజుకు ఒకటి చొప్పున రాస్తామంటూ బెదిరించారు. అయితే మీరు పంపించిన సర్వే నంబర్లలో నాలా కన్వర్షన్ నిబంధనల మేరకే చేశానంటూ తహసీల్దార్ చెప్పినా వినలేదు. పైపెచ్చు మరికొందరితో తహసీల్దార్‌కు ఫోన్లు చేయించారు. అవినీతిలో ఘనుడు అని వార్తలు వస్తాయని చెప్పడంతో ఆందోళనకు గురైన తహసీల్దార్.. డబ్బులు ఇస్తానంటూ సోమవారం రూ.20 వేలు ఇచ్చాడు. అవి తీసుకుని ఇవి సరిపోవు.. రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని బ్లాక్ మెయిల్ చేశారు. మంగళవారం డబ్బులు ఇస్తాను.. కార్యాలయానికి రమ్మని చెప్పగా రవీందర్ ఐనవోలు కార్యాలయానికి వచ్చాడు. మరో రూ.30వేలు నగదు ఇవ్వగా తీసుకున్నాడు. కాపుకాసిన పోలీసులు డబ్బులు తీసుకున్న ఆయనను పట్టుకొని నగదును సీజ్ చేశారు. ఇద్దరు అన్నదమ్ములపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మానసిక ఆందోళనకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించేవిధంగా వ్యవహరించారని తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు నకిలీ విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోల్డ్‌గోల్డ్ నగలు, నకిలీ పత్రాలపై రుణాలు

- ఆ తర్వాత తప్పించుకుంటున్న బ్యాంకు అధికారులు
- ఆర్‌బీఐకి వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో రోల్డ్‌గోల్డ్ నగల తాకట్టు, నకిలీ పాసు పుస్తకాల వ్యవహారాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరించడంపై వినియోగదారుల మండలి చెన్నైలోని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)కు ఫిర్యాదు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో రోల్డ్‌గోల్డ్ నగలు, నకిలీ ఆస్తిపత్రాలు, నకిలీ పాస్ బుక్కుల తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్న సంఘటనలు అనేకం జరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్‌లు ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. బ్యాంకులో తాకట్టుకు వచ్చిన బంగారం, ఆస్తి పత్రాలు ఒరిజినలేనని ధ్రువీకరించుకొని రుణాలు మంజూరు చేస్తున్న అధికారులు.. ఆ తర్వాత కొంతకాలానికి బంగారం రోల్డ్ గోల్డ్ అని, పాస్ పుస్తకాలు నకిలీ అని ప్రకటిస్తున్నారని తమ ఫిర్యాదులో ఆర్‌బీఐ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ నేపథ్యంలో తాకట్టు సమయంలో పాల్గొన్న బ్యాంకు సిబ్బంది, తాకట్టు అగ్రిమెంట్‌లపై సంతకాలు, మొండి బకాయిల వివరాల సమాచారం ఆర్‌టీఐ కింద అడిగితే ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. బ్యాంకులు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం బ్యాంకుల్లో తాకట్టు వ్యవహారాల సమాచారం ఇవ్వకూడనిది కాదని, అలాగే బ్యాంకుల్లో జరుగుతున్న వ్యవహారాలు ఎప్పటికప్పుడు అధికారులు స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలని చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ తన ఫిర్యాదులో కోరారు. బ్యాంకుల్లో డబ్బు ప్రజలదని, నకిలీ బంగారం, పత్రాల పేరుతో కోల్పోతే నష్టపోయేది ప్రజలే (వినియోగదారులు)నని పేర్కొన్నారు. కనుక బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఇచ్చేలా బ్యాంకులకు ఆర్‌బీఐ తగిన ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7820	5300
మక్కలు	2355	1521
కందులు	5966	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4800	1575
పసుపు (కాడి)	10299	9534
పసుపు (గోల)	10000	9700
తేజ మిర్చి	8000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341 ఏసీ	13000	7000
దీపిక	9000	8000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

వెల్ది మాజీ సర్పంచ్‌కు 'ముచ్చర్ల సత్తన్న' పురస్కారం

రఘునాథపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కల చేతుల మీదుగా మంగళవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్‌కు 'ముచ్చర్ల సత్తన్న' పురస్కారాన్ని అందుకున్నారు. ముచ్చర్ల సత్తన్న పంచాయతీ పాటను ఆవిష్కరించడంతో పాటు రాష్ట్రంలోని ఆరుగురు మాజీ సర్పంచ్‌లకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోకుండా.. విజయం సాధించి నిస్వార్థంగా ప్రజా సేవ చేయాలని అన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సేవనే లక్ష్యంగా తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలతో గ్రామ పేరును రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన కొయ్యడ మల్లేష్‌కు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి సీతక్క నుంచి పురస్కారం అందుకుంటున్న మల్లేష్

నేడు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

రఘునాథపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి ప్రధాన కాల్వ నుంచి సాగునీటిని చీటకోడూరు రిజర్వాయర్‌కు వెళ్లే కాల్వకు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి విడుదల చేయనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ మంగళవారం తెలిపారు. రవి మాట్లాడుతూ కాల్వ ద్వారా వచ్చే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

క్రేజీ.. జియాలజీ


పీజీ కోర్సు పూర్తి చేసినవారికి ఉజ్వల భవిష్యత్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విస్తృత ఉద్యోగావకాశాలు
- కేయూలో అడ్మిషన్లకు పెరుగుతున్న డిమాండ్
- ఈ యేడాది నుంచి ప్రవేశాలకు అర్హతల సడలింపు

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైన్స్ విభాగంలో విభిన్నమైన కోర్సు భూగర్భ (జియాలజీ)శాస్త్రం. దీనికి ఏటా డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటంతో యువత ఎంఎస్సీ జియాలజీ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు. కేయూలో 1989లో 12 సీట్లతో ఈ కోర్సును ప్రారంభించారు. విద్యార్థుల డిమాండ్ దృష్ట్యా ప్రస్తుతం 40 సీట్లకు పెంచారు. యేటా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు కేయూ జియాలజీ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయి. విదేశీ సంస్థలు సంస్థలు సైతం జియాలజీ విద్యార్థులను భారీ ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి.

జియాలజీ విభిన్నం..

సైన్స్ కోర్సులన్నింటిలో జియాలజీ కోర్సు విభిన్నం. భూమి పుట్టుక నుంచి ఉపరితలంపై నిత్యం చోటు చేసుకునే అంశాలను ఈ కోర్సు అధ్యయనం చేస్తుంది. భూమార్పులకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది. భూమిలో ఉండే పెట్రోల్, గ్యాస్‌తో పాటు బంగారం, రత్నాలు, వజ్రాలు, బొగ్గు ఖనిజాలను పసిగడుతుంది. అంతేగాకుండా సునామీ, భూకంపాలు, అగ్ని పర్వతాల పేలుడు లాంటి ప్రకృతి వైపరీత్యాలను అధ్యయనం చేస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ జియాలజీ విభాగాలు తోడ్పడుతున్నాయి.



కేయూలో ఎంఎస్సీ జియాలజీ విభాగం

జియాలజీ చదివితే ఉద్యోగం గ్యారంటీ..



రోజురోజుకూ జియాలజీ కోర్సుకు విస్తృతి పెరుగుతోంది. జియాలజీ కోర్సులు చదివితే ఉద్యోగం గ్యారంటీ అని చెప్పవచ్చు. సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కల్గిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ దఫా నుంచి ఏదైనా సైన్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చు. కేయూ క్యాంపస్‌లో 40 సీట్లున్నాయి. క్యాంపస్‌లో హాస్టల్ వసతి ఉంది. అడ్మిషన్లపై విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే నేరుగా కేయూ జియాలజీ విభాగాన్ని సంప్రదించవచ్చు.

- ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి
విభాగాధిపతి, జియాలజీ

కేయూ జియాలజీ విభాగం ప్రత్యేకతలు

కేయూ క్యాంపస్‌లో జియాలజీ విభాగం ఉంది. వివిధ ఖనిజాలు, శిలల సముదాయాలతో కూడిన మ్యూజియం నెలకొల్పారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్, భూగర్భ జలాన్వేషణకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది. జియాలజికల్ సర్వే ఎక్విప్‌మెంట్, అత్యాధునిక రీసెర్చ్ మైక్రోస్కోప్ ల్యాబ్, పెట్రాజికల్, జియో కెమికల్ మోడలింగ్, సాఫ్ట్‌వేర్, భూగర్భ జల నాణ్యత పరీక్షల ల్యాబ్, ఈ-క్లాస్‌రూమ్ బోధన, లైబ్రరీని ఏర్పాటు చేశారు. యేటా జియాలజీ విభాగం విద్యార్థులకు ఫీల్డ్ వర్క్స్, గనుల చమురు క్షేత్రాల సందర్శన, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు అత్యుత్తమ అర్హతలు కల్గిన ప్రొఫెసర్లతో బోధన అందిస్తున్నారు.

కోర్సు ప్రవేశానికి అర్హతలివే..

ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే సీపీజీఈటీ-2025 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. సీపీజీఈటీ-2025కి రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://cpget.tgche.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఉద్యోగ అవకాశాలు

జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్సిస్టిట్యూట్, ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్, అయిల్ ఇండియా లిమిటెడ్, అటామిక్ మినరల్ డివిజన్, మినరల్ ఎక్స్‌రేషన్ కార్పొరేషన్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్‌లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.


రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, రాష్ట్ర భూగర్భ జల శాఖ, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లోనూ ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటితో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో జీఐఎస్ అనలిస్ట్, మల్టీ నేషనల్ మైనింగ్ కంపెనీలు, పర్యావరణ వేత్తలు, భూగర్భజల అన్వేషణ కంపెనీలు, సిమెంట్ పరిశ్రమలు, జాతీయ ఖనిజ అన్వేషణ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

తుమ్మచెట్టుపై మర్రి మొక్క!

తుమ్మ చెట్టు కొమ్మపై మర్రి మొక్క పెరగడం ఆసక్తికరంగా మారింది. కేసముద్రం మండలం ఉప్పరపల్లి చెరువు కట్టపైనున్న ఓ తుమ్మ చెట్టుపై మర్రి మొక్క పెరుగుతోంది. పక్షులు మర్రిపండ్లను తీసుకువచ్చి తుమ్మచెట్టుపై తినడంవల్ల గింజలు పడి మర్రిమొక్క ఉద్భవించిందని పలువురు చెబుతున్నారు. అయితే పూర్తిగా చెట్టుపైనే ఆధారపడుతూ మర్రిచెట్టు పెరగడమే ఇక్కడ వింతగా కనిపిస్తోంది. మర్రిచెట్టు పెరిగేందుకు అవసరమైన పోషకాలన్నీ తుమ్మచెట్టు నుంచే అందుతుండడం గమనార్హం. స్వయం పోషకాలుగా పిలవబడే మొక్క భిన్నంగా తన ఎదుగుదలకు మరో చెట్టుపై ఆధారపడి పరాన్నజీవిగా వ్యవహరించడం గమనార్హం.

- కేసముద్రం (ఆంధ్రజ్యోతి)



తల్లడిల్లిన తల్లి కోడి



ఏ జీవి అయినా తన బిడ్డకు ఏమైనా జరిగితే తట్టుకోలేదు. ఆ బిడ్డ చనిపోయిందని తెలియక పిల్లను లేపడానికి తల్లి ప్రయత్నం చేస్తుంటుంది. ఇదే తరహాలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని బోయినివాడ వీధిలో మంగళవారం ఉదయం ఓ వీధిలో కోడిపిల్ల చనిపోగా దాన్ని లేపేందుకు తల్లికోడి ప్రయత్నించి, దాదాపు మూడు గంటలపాటు అక్కడే తిరుగుతుండడం పలువురిని చలింపజేసింది. ఏ జాతి అయినా పిల్లల విషయంలో తల్లి ప్రేమ ఒకటేనని ఈ దృశ్యం నిరూపిస్తోంది.

- ఇనుగుర్తి (ఆంధ్రజ్యోతి)

మహిళలకు చదువుచెపుతున్న వాలంటరీ టీచర(పాతచిత్రం)



'ఉల్లాస్'ంగా.. ఉద్యోగావకాశం

- అతివల అక్షరాస్యతకు సదావకాశం
- మహిళా సంఘాల్లోని సభ్యులపై ప్రత్యేక దృష్టి
- చదువుకున్న వారిని టీచర్లుగా ఎంపిక
- ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే నవభారత్ సాక్షరత కార్యక్రమం ఈ యేడు నుంచి రాష్ట్రంలో అమలు చేసి మహిళా అక్షరాస్యతపై దృష్టి సారించనున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో చదువుకోని మహిళలను గుర్తించి వారు చదువుకునే విధంగా ప్రోత్సహించేందుకు ఈ ఉల్లాస్ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నాయి. వీరు చదువుకునేందుకు వలంటీర్లనువినియోగిస్తారు. గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సహకారంతో వీవోఏలు, స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ బృందాల్లో చదువుకున్న మహిళలను గుర్తించి వలంటీరు టీచర్లుగా ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరు 10మంది అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు వలంటీర్లుగా చేయవచ్చు. అనంతరం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్)నుంచి 10వ తరగతి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. గతంలో సాక్షరభారత్ కార్యక్రమం 2017తో ముగిసింది. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలు చేయలేదు.

నిర్వహణ కమిటీ

గ్రామస్థాయిలో పథకం వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ 16ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందులో డీఆర్‌డీఓతోపాటు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. మండలస్థాయిలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ఉపాధ్యాయుడు, పీఓ ఏఆధ్యక్షురాలు, కార్యదర్శి బాధ్యతలు చూసుకుంటారు.

ఊతం ఇవ్వనున్న ఈ-డిజిటల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్ ఎట్టకేలకు ప్రజల ముందుకు వచ్చింది. అక్షరాస్యత కార్యక్రమాలకు ఈ-డిజిటల్ ఊతం ఇవ్వనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పెనుమార్పులకు నాంది పలకనుంది. 2027 వరకు ఈ ఉల్లాస్ కార్యక్రమం కొనసాగనుంది.

16 అధ్యాయాల పుస్తకాలు ఉంటాయి

- తెలుగులో చదవడం, రాయడం.
- అంకెలు గుర్తించడం, కూడికలు, తీసివేతలు.
- ఆదాయం పెంచుకునేలా సూచనలు.
- పోషకాహార లోపం, అనారోగ్యాలు.
- అమ్మకు బ్యాంకు ఖాతా.
- ఇరుగు పొరుగుతో మాటామంతీ
- నైపుణ్యాల అభివృద్ధి అంశాలు.
- నిత్యజీవితంలో అవసరమయ్యే ఇతరాలు ఉంటాయి.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం..




జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం చేరేలా కార్యాచరణ రూపొందిస్తాం. దానికి అనుగుణంగా నిరక్షరాస్యులకు చదువు చెప్పేలా ప్రణాళిక చేస్తాం. విద్యాశాఖ డీఆర్‌డీఓ సంయుక్తంగా పనిచేసి లక్ష్యాన్ని చేరుకుని జిల్లాలో మహిళల అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తాం.

- మేన శ్రీను, హనుమకొండ జిల్లా డీఆర్‌డీఓ

సీఎం ఇన్‌స్టాలో 'కాటారం వరినాట్లు'

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీలో కాటారం మండలంలో చేపడుతున్న వానాకాలం వరినాట్లు వార్త పెట్టు కోవడం విశేషం. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వానాకాలం వరి నాట్లు షురూ' శీర్షికన ప్రచురితమైన కథనం ఇన్‌స్టాగ్రామ్‌లో 'రేవంత్ అఫీషియల్' పేరిట ఉన్న గ్రూపులో చోటు చేసుకుంది. రేవంత్ అఫీషియల్ గ్రూపును ఫాలో అవుతున్న పలువురు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాట్లు వేస్తున్న పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం చేయడంతో ఇలా సీఎం ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పెట్టుకున్నట్లు అభిప్రాయపడుతున్నారు.


- కాటారం (ఆంధ్రజ్యోతి)


వానాకాలం వరి నాట్లు షురూ

'శ్రీరామా.. నీ దయ చూపు'

- 77 రామదాసు సంకీర్తనలు ఆంగ్లానువాదం
- పుస్తకంగా ప్రచురించిన ఆథర్స్ ప్రెస్
- ప్రొఫెసర్ రాజగోపాలాచారి రచనాశైలి

హనుమకొండ, జులై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ భక్తుడు రామదాసు (కంచెర్ల గోపన్న) రచించిన 77 సంకీర్తనలను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ విశ్రాంతాచార్యుడు మాడభూషణం రాజగోపాలాచారి ఇటీవల ఆంగ్లంలోకి అనువదించారు. షవర్ యువర్ మెర్సీ ఓ శ్రీ రామా! అనే శీర్షికతో ఈ పుస్తకాన్ని న్యూఢిల్లీలోని ఆథర్స్ ప్రెస్ పుస్తకంగా ప్రచురించింది. రాజగోపాలాచారి 208 అన్నమయ్య కీర్తనల ఆంగ్లానువాదాన్ని కూడా ఈ ప్రెస్ గతంలో ముద్రించింది. పురాతన సాహిత్యానువాదంలో భాషాపరంగా ఉన్న ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కొంటూ, మూలరచన దెబ్బతినకుండా రామదాసు కీర్తనలను అందంగా అనువదించారు. భక్తిసాహిత్యం పట్ల ఆచార్య రాజగోపాచారి మొక్కవోని నిబద్ధతను ఈ గ్రంథం తెలుపుతుంది. ఆచార్య ఈ పుస్తకంలో శ్రీ రామదాసు 77సంకీర్తనలను ఆంగ్ల అనువాదంతో పాటు తెలుగు మూలాన్ని కూడా సమకూర్చారు. వీటితో పాటు ప్రతీ సంకీర్తనకు కఠిన పదాల అర్థాలు, సుబోధకమైన ఆంగ్ల వ్యాఖ్యానం ఇవ్వడం ఇందులో విశేషం. ఆంగ్లం రాని తెలుగు పాఠకులకు కూడా ఇదొక రామదాసు సంకీర్తనల సంకలనంగా చదువుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గ్లోసరిలో కఠిన పదాలకు ఆంగ్లంతో పాటు తెలుగులో కూడా అర్థాలు ఇవ్వడం వల్ల సంకీర్తనలను అర్థం చేసుకోవడం సులభమైంది. రచయిత ఈ సంకీర్తనలను నాలుగు విభాగాలుగా విభజించడం ఇందులో ప్రత్యేకత. గ్లోరీ ఆఫ్ లార్డ్ శ్రీ రామా అనే మొదటి విభాగంలో మొత్తం 23 సంకీర్తనలు చేర్చారు. ఈ విభాగంలోనే 11 సంకీర్తనలను నామ సంకీర్తన అన్న ఉపవిభాగంలో చేర్చారు. మూడో విభాగపు 18 కీర్తనలలో శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఎన్‌కౌంటర్ విత్ తానీషా' అన్న చివరి విభాగంలో 'వినరయ్య తానీషాగారు మా మనవి..' అంటూ తన మనవిని రామదాసు విన్నవించిన తీరును ఆంగ్లంలో ఆకట్టుకునే రీతిలో అనువదించారు.



ఆచార్య రాజగోపాలాచారి రామదాసు సంకీర్తనల అంగ్లానువాదం షొయర్ యువర్ మెర్సీ, ఓ శ్రీరామా! పుస్తకం

పలు ఆంగ్లానువాదాలు

ఆచార్య రాజగోపాలాచార్య ఇంతకు ముందు పలు ఆంగ్లానువాదాలు చేశారు. అన్నమయ్య కీర్తనలను 'హై ఇన్‌ది స్కై అట్ విష్ణుపాద! అన్నమాచార్య సంకీర్తనాస్' పేరుతో చేసిన ఆంగ్లానువాదం ఇందులో ఒకటి. తిరుమల తిరుపతి వైభవంపై 'ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి ష్రైన్ (టీటీడీ-2024)' పేరుతో పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. తెలంగాణ సాయుధ పోరాటంపై 'తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ - 1948' పేరుతో ఆంగ్లంలో రాసిన మరో పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. డైవర్సిటీ ఇన్ ఇండియన్ లిటరేచర్ ఇన్ ఇంగ్లీష్ రీసెంట్ రిఫ్లెక్షన్స్ (2019), భక్తి మూమెంట్ అండ్ లిటరేచర్ (2016), పోస్ట్ కలోనియల్ ఇండియన్ ఇంగ్లీష్ ఫిక్షన్: డిసెంటరింగ్ ది నేషన్ (2016), మల్టీకల్చరలిజం ఇన్ ఇండియన్ ట్రెడిషన్ అండ్ లిటరేచర్ (2016) వంటి పలు పుస్తకాలు ఆచార్య సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆచార్య రాజగోపాలాచార్య 2021 నుంచి 2023 వరకు సప్తగిరి (ఇంగ్లీష్) సంపాదక మండలిలో సభ్యుడిగా కూడా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వరుడి మహిమలు, తిరుమల వైభవంపై ఇందులో అనేక వ్యాసాలు రాశారు.

సంకీర్తనా సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే..



భక్తిసాహిత్యంలో తనదైనశైలిలో సంకీర్తనలను రచించి విశిష్ట స్థానాన్ని పొందిన కంచెర్ల గోపన్న (1620-1688) భద్రాచల దేవాలయం నిర్మాణం చేసి శ్రీ రామదాసుగా ప్రసిద్ధి చెందాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆయన కీర్తనలు సంకీర్తనా గోష్ఠులలో, భజనలలో ముఖ్య భూమికను సంతరించుకున్నాయి. 'దాశరథీ కరుణాపయోనిధీ' అనే మకుటంతో ఆయన రచించిన దాశరథి శతకంలో కనీసం ఒక్క పద్యం రాని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. 'పలుకే బంగారమాయెనా కోదండపాణి..' వంటి కీర్తనలు ప్రజలలో బహుళ ప్రాచుర్యం పొందాయి. సంకీర్తనా సాహిత్య ఔన్నత్యాన్ని తెలుగు రాష్ట్రాల పరిధిదాటి ఇతర రాష్ట్రాల, దేశాల పాఠకులకు పరిచయం చేసే బృహత్తర ప్రయత్నంలో భాగంగా రామదాసు కీర్తనలను ఆంగ్లానువాదం చేశాను.

- ఆచార్య రాజగోపాలాచారి, హనుమకొండ

మేడారంలో కేశఖండనకు రుసుము పెంపు



తాడ్వాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానంలో భక్తుల కేశఖండనకు రుసుము పెంచినట్టు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ. 10 ఉండగా, ఇప్పుడు రుసుము రూ. 50గా నిర్ణయించినట్టు తెలిపారు. దీనిపై అభ్యంతరాలేమైనా ఉంటే 15 రోజుల్లోగా తమకు తెలపాలని పేర్కొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్
ప్రాంతీయ వాణిజ్య కార్యాలయం: వరంగల్

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఈ క్రింద చూపబడిన ఖాతాదారుల మా శాఖలలో తమ బంగారు ఆభరణముల హామీపై పొందిన అప్పులు తిరిగి చెల్లించమని అనేక డిమాండ్ నోటీసులు ఇచ్చినను అప్పులు చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **తేది: 30.07.2025 మం॥ 3 గం॥ల నుండి 4 గం॥ల** వరకు ఆయా శాఖలలో బహిరంగ వేలం వేయబడును.

శాఖ పేరు	ఖాతా నెంబరు	రుణగ్రహీత పేరు మరియు చిరునామా
భీమారం	73222203053	Miss. మనుపాటి సింధు, 1-45, రామారం, హసన్‌పర్తి
చెల్పూరు	73221555370	Mr. రఘుసాల ఏజేందర్, 1-104, మొరంచపల్లి, భూపాలపల్లి
చెల్పూరు	79086786246	Mrs. రెబ్బ రాధిక, 1-26 , చెల్పూరు
చెల్పూరు	79087334888	Mrs. సిరంగి ప్రవంతి, 6-200 , గొల్లపల్లి, ఘన్‌పూర్ ములుగు
దంతాలపల్లి	73222583044	Mr. బెజ్జెంకి లింగన్న, 1-88, బీరిశెట్టిగూడెం, నర్సింహులపేట్
దంతాలపల్లి	73222364124	Mr. పొన్నం సోమయ్య, C-25, దొనకొండ, వేములపల్లి
దంతాలపల్లి	73221439455	Mr. ఆలేటి ఉప, 4-64, దంతాలపల్లి
దంతాలపల్లి	73221847352	Mrs. దుండి సంధ్య, C-119, నిధాన్‌పురం ఆగపేట
దంతాలపల్లి	73221848094	Mrs. దుండి సంధ్య, C-119, నిధాన్‌పురం ఆగపేట
దంతాలపల్లి	73222137555	Mr. గుగులోతు శరత్ నాయక్, 1-127, ఆగపేట్
దంతాలపల్లి	73222310622	Mr. బానోత్ రవి, 5-7, బుద్ధ తాండ, పెద్దనాగారం
దంతాలపల్లి	73222438825	Mrs. దర్శనాల ధర్మమ్మ, 5-43, దంతాలపల్లి
దంతాలపల్లి	73222549626	Mr. చొప్పరి గణేష్, C-29, దొనకొండ
దంతాలపల్లి	73221775395	Mrs. పాలబిందాల పద్మ, C/6-79, పెద్దనాగారం
దంతాలపల్లి	73222012127	Mr. జాటోతు కిషన్, C-24, జయపురం, వరంగల్
దంతాలపల్లి	73222190778	Mr. ఎర్రి వీరేష్, 2-14, నర్సింహులపేట్
దంతాలపల్లి	73222583599	Mr. బెజ్జెంకి లింగన్న, 1-88, బీరిశెట్టిగూడెం
దంతాలపల్లి	73227998372	Mrs. గుజ్జ రేణు, (2-31) C-116, పెద్దనాగారం, నర్సింహులపేట్
దంతాలపల్లి	73226358809	Mrs. గుజ్జ రేణు, (2-31) C-116, పెద్దనాగారం, నర్సింహులపేట్
డి.పి.ఒ.హన్మకొండ	79087386247	Mr. ఇమ్మడి కుమారస్వామి, 1-134, గోపాలపురం,హన్మకొండ
హసన్‌పర్తి	73221922206	Mrs. పాపిశెట్టి తిరుపతమ్మ, 12-65, ఓల్డ్ మార్కెట్, హసన్‌పర్తి
హంటర్ రోడ్, న్యూ శాయంపేట్	79087524664	Mr. తోట రఘువీర్, 2-10-787, టీచర్స్ కాలనీఫేజ్ - 1, హన్మకొండ
హంటర్‌రోడ్, న్యూ శాయంపేట్	73222326382	Mrs. మంద సురేష్, ఇంటి నెం. 23-4-115, హన్మకొండ
హంటర్‌రోడ్, న్యూ శాయంపేట్	73221411178	Mr. రసమల్ల రాజు S/o. భిక్షపు, 23-1-12, న్యూ సాయంపేట్, హన్మకొండ
హంటర్ రోడ్ న్యూ శాయంపేట్	79087541352	Mr. గుండ సుదర్శన్, 16-8-123, అబ్బానికుంట, లక్ష్మీపూర్, వరంగల్
హంటర్ రోడ్, న్యూ శాయంపేట్	73221887656	Mr. వెల్పుల రాజ్ కుమార్, 23-3-92, తూర్పు వడ, న్యూ శాయంపేట్, హన్మకొండ
హంటర్ రోడ్, న్యూ శాయంపేట్	73221696923	Ms. మంద మౌనిక, ఇంటి నెం. 23-4-59 1, ఎస్.సి. కాలనీ, న్యూ శాయంపేట్, హన్మకొండ
హంటర్ రోడ్, న్యూ శాయంపేట్	73221697508	Ms. మంద మౌనిక, ఇంటి నెం. 23-4-59 1, ఎస్.సి. కాలనీ, న్యూ శాయంపేట్, హన్మకొండ
హంటర్ రోడ్, న్యూ శాయంపేట్	73221849916	Mr. రాచమల్ల రాజేశం, 6-29/2, టి.వి. టవర్ అశోక కాలనీ, గోపాల్‌పూర్, హన్మకొండ.
కాశీబుగ్గ	79087152071	Mr. కట్టిరసాల వేణుగోపాల్, 16-2-193/2, కరీమాబాద్, వరంగల్
కాశీబుగ్గ	79086329880	Mr. కట్టిరసాల వేణుగోపాల్, 16-2-193/2, కరీమాబాద్, వరంగల్
కాశీబుగ్గ	79084847419	Mr. కట్టిరసాల వేణుగోపాల్, 16-2-193/2, కరీమాబాద్, వరంగల్
కొత్తపల్లి గోరి	73221543079	Mrs. బొమ్మకంటి వసంత, ఇంటి నెం. 3-91, కొత్తపల్లి గోరి
కుమార్‌పల్లి	73221764848	Mr. సిద్ధోజు శ్రీనివాస్, ఇంటి నెం. 3-4-743 4 ఎ గణేష్ నగర్, న్యూ రాయపుర, హన్మకొండ
కుమార్‌పల్లి	73222331857	Mr. సిద్ధోజు శ్రీనివాస్, ఇంటి నెం. 3-4-743 4 ఎ గణేష్ నగర్, న్యూ రాయపుర, హన్మకొండ
మడికొండ, ఖాజీపేట్	73222098161	Mrs. అతిరాజుల శోభారాణి, ముప్పారం, ధర్మసాగర్
మహబూబాబాద్ II	73222564587	Mrs. గుగులోతు లక్ష్మి, బడి తాండ, కురవి
మహబూబాబాద్ II	73222202505	Mr. ధరావత్ హనుమ, 5-105, కుక్కగొట్టు తాండ, రెడ్యాల
మహబూబాబాద్ II	73222065088	Mr. బస్కా ఉపేందర్, 1-51 A సుంద్రాతిమడుగు
మహబూబాబాద్ II	73222205299	Mrs. బానోత్ విజయ, 4-11, వేమునూరు మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222288834	Mrs. మహ్మద్ షాహేద్, 1-6-159, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222587822	Mrs. బోడా దేవి, 1-69/1, కొత్త కాలనీ, మియాపూర్, హైదరాబాద్
మహబూబాబాద్ II	73222247977	Mr. ప్రభాకర్ శ్రీరంగం, 1-3-85 1- ఎదురుగా హోలీ ఏంజెల్స్ స్కూల్ వరంగల్
మహబూబాబాద్ II	73222253516	Mss. చెట్ల జయ శ్రీ, 1-7-30/18A/1, రాంచంద్రపురం మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222074637	Mr. పులిగిల్ల చిరంజీవి, 1-2-24, వరంగల్
మహబూబాబాద్ II	73221520629	Mrs. బచలకురి రవళిక, 1-7-21/10/17/40, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73221562376	Mrs. పన్నిల్ల పుల్లమ్మ, 4-84 7, జామండ్లపల్లి, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73221574201	Mr. భుక్య శంకర్, వీరరామతాండ, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73221855432	అంబాల గోవర్ధన్, H.No. 4-77/1, జామండ్లపల్లి, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222069650	Mr. పులిగిల్ల చిరంజీవి, 1-2-24, వరంగల్
మహబూబాబాద్ II	73222076996	Mrs. చెడిపాక పుష్ప, 1-2-94, హరిజనవాడ, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222168233	Mr. దాసరి మల్లయ్య, రెడ్యాల్, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222190268	Mr. భూక్య రమేష్, 1-6-250/10, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222206418	Mrs. నీలం వినోద, 1-6-165/68, గుమ్మడూరు
మహబూబాబాద్ II	73222257373	Mrs. శాంతి అజ్మీరా W/O సంక్, సీత తాండ, ఏదులపూసపల్లి
మహబూబాబాద్ II	73222273871	Mr. గుర్రాల పుష్పరాజు, 1-6-107/A, గుమ్మడూరు
మహబూబాబాద్ II	73222276191	Mr. పతి వెంకన్న, 3-180, గుంద్రాతిమడుగు, కురవి
మహబూబాబాద్ II	73222528935	Mr. గుగులోతు రాంచంద్, C-39, గుర్రపుతాండ, మరిపెడ
మహబూబాబాద్ II	73221784435	Mr. మేకల ప్రభాకర్, 1-6 , దుమీజ్ అపార్ట్‌మెంట్స్, ఆర్ కె నగర్, మల్కాజ్‌గిరి
మహబూబాబాద్ II	73222431002	Ms. గుగులోతు శాంతి, 1-43, మరిపెడ
మహబూబాబాద్ II	73221698353	Mrs. ప్రొద్దుటూరి రామ, H.No.1-1-11/A, నర్సంపేట రోడ్డు, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73221698932	Mrs. ప్రొద్దుటూరి రామ, H.No.1-1-11/A, నర్సంపేట రోడ్డు, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73221715278	Mr. తోనుపునూరి రమేష్, 5-3-26 /1. వెంకటేశ్వర బజార్, మహబూబాబాద్
మహబూబాబాద్ II	73222434127	Ms. గుగులోతు శాంతి, 1-43, మరిపెడ
మహబూబాబాద్ II	73232683922	Mr. నూకల్ సంపత్ కుమార్, 5-1-131, డోర్నకల్ డోర్నకల్, వరంగల్
మల్లంపల్లి	73222194069	Mrs. కొమ్ముల రాణి W/O నవీన్, H.No.4-35 2, భూపాల్ నగర్, వి. ములుగు
మల్లంపల్లి,	73222368378	Mr. తుమ్మలపల్లి చందర్ రావు, 1-22, పందికుంట, ములుగు
మండపల్లి,	73222576058	Mr. రాగం రాజు, H.No. 4-53 2, వి.చపలబండ, దుగ్గొండి
మరిపెడ	73221473270	Mr. రాంపెల్లి రవి, C-72, రామ్‌పురం, మరిపెడ
మరిపెడ	73221853795	Miss. నంద రవళి, 1-7-30, మహబూబాబాద్
మరిపెడ	73222464083	Mr. ఎం.డి హఫీజ్, మరిపెడ, C-130, రామ్‌పురం
మరిపెడ	73221708816	Mr. అల్లి రాజశేఖర్, ఇంటి నెం. 1-77, విస్సంపల్లి, మరిపెడ
మరిపెడ	73227165850	Mrs. ఖైరెడ్డి జ్యోతి రెడ్డి, B 701 సాయి ప్రసాద్ ఎన్‌క్లేవ్, సెక్టార్ 7 కామోతె రాయిగర్
మరిపెడ	73227167383	Mrs. ఖైరెడ్డి జ్యోతి రెడ్డి, B 701 సాయి ప్రసాద్ ఎన్‌క్లేవ్, సెక్టార్ 7 కామోతె, రాయిగర్
నన్మదూర్	73229031095	Mrs. ధరావత్ రాజమ్మ, 4-486, గుండ్యతాండ, నాన్సర్‌మదూర్
నెక్కొండ	79083785337	Mr. గుగులోత్ రవిందర్, C-3, ముడునర్సియ్యతాండ, నెక్కొండ
ఓరుగొండ	73221782198	Mr. గొల్లపల్లి రమేష్, పోస్ట్ కొత్తగట్టు సింగారం,వరంగల్,
రంగ సాయిపేట్	73221376786	Mrs. మాచర్ల రాణి, 19-10-250. పొంబునిపేట్, వరంగల్.
రంగ సాయిపేట్	79086708187	Mrs. కుసుమ భవాని, ఇంటి నెం. 18-4-157, కరీమాబాద్, వరంగల్
రంగ సాయిపేట్	73221481599	Mrs. పళ్లేపు స్వరూప, 19-10-523/116/58, ఖిలా వరంగల్, రంగసాయిపేట్
రంగ సాయిపేట్	79083658025	Mr. బొల్లం షాలిని, 19-11-175/A/1, టీచర్స్ కాలనీ, పొంబునిపేట్, వరంగల్
రంగ సాయిపేట్	79086619898	Mr. కుసుమ కేదరి, 19-5-255, అండర్ బ్రిడ్జ్ రోడ్, వరంగల్
వజీద్ నాగారం	73222480673	Mr. బోడబోయిన పద్మ ఇంటి నెం. C-16, కన్నెబోయినపల్లి, తాడ్వాయి
వజీద్ నాగారం	79086986085	Mr. బట్టి సురేష్ 1-32, పేరూరు
వజీద్ నాగారం	79087640083	Mrs. బండారి స్వప్న 8-28, ఘనపురం, వజీద్

షరతులు: 1) ఖాతాదారుల్లో ఎవరైనా బ్యాంకు వారి నోటీసులు ఏ కారణము చేతనైనా అందని యెడల నోటీసు తిరిగివచ్చిన యెడల వారికి కూడా ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 2) ఖాతాదారులు ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 3) తాకట్టుదారు ఇదే చివరి నోటీసుగా భావించి బకాయిలు చెల్లించగలరు, తదుపరి ఆక్షేపణలు అంగీకరించబడవు. 4) వేలం నందు పాల్గొనదలచినవారు PAN కాపీతో EMD క్రింద రూ. 10,000/-లు తేది: 30.07.2025 ఉ॥ 10 గం॥ల నుండి 11:30 ని॥లలోపు పైన తెలిపిన ఆయా శాఖలలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు. 5) హెచ్చు పాటదారులు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 6) ఎటువంటి కారణం లేకుండా వేలం రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకు వారికి అధికారము కలదు. 7) వివరములకు శాఖాధిపతిని బ్యాంకు పని వేళలలో సంప్రదించగలరు.

తేది: 22.07.2025 సం/- రీజనల్ మేనేజర్



మాట్లాడుతున్న సీఐ శివకుమార్

విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి సారించాలి

వరంగల్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ భవిష్యత్తు పై దృష్టిసారించాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంపై మంగళవారం కాకాజీకాలనీలోని ఎస్ఆర్ బాలికల కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల మీద విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మీ, బ్యూకోల్ట్స్ సిబ్బంది కుమార్, హరిప్రసాద్, సైబర్ వారియర్ కిరణ్ పాల్గొన్నారు.



ఆదర్శకాలనీలో సీసీ రోడ్డు, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్

అభివృద్ధి పనుల ప్రారంభం

మడికొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మడికొండలోని ఆదర్శ నగర్ కాలనీలో అభివృద్ధి పనులకు 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు, మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొల్లికొండ వినోద్‌కుమార్, పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, గడ్డం కిరణ్, కొలిపాక రాజయ్య, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 42 మందిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఎ. వేణుగోపాల్ ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 40మందికి రూ.40,100 జరిమానా విధినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 17 మందికి రూ.10,600 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించండి



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు. పాఠ్యప్రణాళిక, టీఎల్ఎం ద్వారా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, రమాదేవి, రవికుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హసన్‌పర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దారు చల్ల ప్రసాద్‌కు యూఎస్‌పీసీ ప్రతినిధులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో యూఎస్‌పీసీ ప్రతినిధులు టి.నరేష్, టి.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, శ్రావణ్, పురుషోత్తం తదితరులున్నారు.

డీటీసీ సురేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



డీటీసీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్టీవో వేణుగోపాల్

వరంగల్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ ఉమ్మడి వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా సురేష్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ ఆర్టీవో కార్యాలయం ఆవరణంలో ఉన్న డీటీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా హనుమకొండ ఇన్‌చార్జి ఆర్టీవో వేణుగోపాల్, సీనియర్ ఎంవీఐ రమేష్‌రాథోడ్, ఎంవీఐ కిషోర్‌బాబు, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 1996 ఎంవీఐ బ్యాచ్‌కు చెందిన సురేష్‌రెడ్డి ఉమ్మడి నల్గొండలోని పలు ప్రాంతాల్లో ఎంవీఐ, ఆర్టీవోగా విధులు నిర్వహించి పదోన్నతిపై వరంగల్ ఉమ్మడి వరంగల్ డీటీసీగా విధుల్లో చేరారు.

సీనియర్ న్యాయవాది రేణుకాదేవి మృతికి బార్ సంతాపం

వరంగల్ లీగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ సభ్యురాలు సీనియర్ న్యాయవాది లెక్కల రేణుకాదేవి మరణం పట్ల హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 20న అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా జడ్జి బీవీ నిర్మల గీతాంబ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు. అనంతరం ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు సమావేశం నిర్వహించి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాది మృతి తీరని లోటని, ఆమె మూడు పర్యాయాలు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తించి అందరి అభిమానాన్ని చూరగొన్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్స సుధీర్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, హనుమకొండ జిల్లా బార్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

కేఎంసీలో క్యాండిల్ మార్చ్ ర్యాలీ



క్యాండిల్ మార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్న కేఎంసీ విద్యార్థులు

వరంగల్ మెడికల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) 2015 బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని డాక్టర్ హేమలత మృతి పట్ల కేఎంసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అలుమినీ సభ్యులు మంగళవారం రాత్రి క్యాండిల్ మార్చ్ నిర్వహించి నివాళులర్పించారు. డాక్టర్ హేమలత అస్సాంలోని ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్, బర్పేటాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. ఈ నెల 21న ఆమె తన హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటనపై కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా దానికి ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా కాలనీల అభివృద్ధి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వడ్డెపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా నగరంలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పర్యటించి కాలనీలోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. తొలుత కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అశోక కాలనీలో నిర్మిస్తున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణాన్ని సందర్శించి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి విజయ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్‌యాదవ్, బంక చంద్రశేఖర్ యాదవ్, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సరోత్తంరెడ్డి, కోశాధికారి వింజమూరి సుధాకర్‌స్వామి,ఎం. తిరుపతి, ఎరబోయిన కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

కాజీపేట (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ పాలనలో కాజీపేట అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పాలనలో కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు చేపట్టామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

కాజీపేట 62వ డివిజన్ సోమిడి బొడ్రాయి వద్ద మంగళవారం కాజీపేట నుంచి సోమిడి వరకు సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే నాయిని, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు.

పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ కాజీపేటను ఓట్లకోసమే వాడుకుని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. కుడా సహకారంతో నగరం మరింత అభివృద్ధికి నోచుకుంటుందని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు మెరుగు రాజయ్య, నాయిని లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, నాయకులు సిరిల్ లారెన్స్, జయాకర్, దొంగల కుమార్, ఆంజనేయులు, పసునూరి మనోహర్, ఇమ్మడి రవీందర్, రంగు సుధీర్, రాంకీ గౌడ్, తాడూరి ప్రశాంత్, బైరబోయిన రమేశ్ తోపాటు స్థానిక నాయకులు ఎద్దఎత్తున పాల్గొన్నారు.



ఎ.వేదశ్రీని సన్మానిస్తున్న యాజమాన్యం

జేఈఈ మెయిన్స్ ర్యాంకర్‌కు సన్మానం

కరీమాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఏ.వేద శ్రీ ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో 7210 ర్యాంక్ సాధించింది. దీంతో ఐఐటీ రూర్కీలో బయోటెక్నాలజీలో సీటు లభించింది. ఈ సందర్భంగా వేద శ్రీని మంగళవారం న్యూ కౌటిల్యాస్ పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్ సన్మానించారు.

తమ పాఠశాలలో పదవతరగతి వరకు చదివిన వేదశ్రీ భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోడం సబిత, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యాన్ని వీడండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పన్ను వసూళ్ల పురోగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో అనుకున్న విధంగా పన్ను వసూళ్ల జరగడం లేదని అన్నారు. గతంలో పోల్చితే ఈ యేడు పన్ను వసూళ్లలో చాలా వెనకబడి ఉన్నామన్నారు. ఇంకా పీటీఐ వసూళ్ల తీరుపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్ కలెక్టర్లు కేవలం పన్నుల వసూళ్లకు మాత్రమే పని చేస్తున్నా ఇంకా ఎందుకు పన్నులు వసూళ్లు కావడం లేదని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డీసీలు ప్రసన్నరాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌వోలు షహజాది బేగం, యూనుపోద్దిన్‌తో పాటు ఆర్ఐలు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది గ్లౌజులు మాస్కులు వాడాలి

శానిటేషన్ విభాగంలో పనిచేసే సిబ్బంది తప్పకుండా గ్లౌజులు, మాస్కులు వాడాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం ఉర్సుగుట్ట సమీపంలోని 5ఎంఎల్‌డీ సామర్థ్యంతో నడుస్తున్న సీవెజ్ ప్లాంటుతో పాటు నగరంలోని పలు డివిజన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యదృష్ట్యా ప్రతీ ఇంటికి వెళ్లి సిబ్బంది పీడీఎఫ్ సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీరోజు ఎంతమంది పనిచేస్తున్నారని జవాన్‌లు నిత్యం పరిశీలించాలన్నారు. శానిటేషన్ సిబ్బంది ప్రతీ కాలనీలో క్షేత్రస్థాయిలో తిరుగుతూ అక్కడి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈ రాజ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్ పాల్గొన్నారు.



డాక్టర్ ప్రత్యూష చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రెంగ నాయకులు

టీఎన్‌జీవో అధ్యక్షుడు రాంకిషన్‌కు పరామర్శ

రాంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను కోల్పోయిన టీఎన్‌జీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ (ట్రెంగ) తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంకిషన్ కుమార్తె డాక్టర్ ప్రత్యూష చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి, నాయకులు భూక్య నర్సింహ, మామునూరి వంశీధర్, గొట్టిముక్కల సాంబరాజు, ఎర్ర మురళీ పాల్గొన్నారు.

దాశరథీ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య తదితరులు

కేయూ క్యాంపస్ జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి స్ఫూర్తిని యువత అందిపుచ్చుకోవాలని కేయూ తెలుగుశాఖాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య ఉద్బోధించారు. మంగళవారం కేయూ తెలుగు విభాగంలో దాశరథి జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడారు. పద్యం, సినిమా పాటలతో పాటు ఏదీ రాసిన దాశరథి ఆణిముత్యమేనని కొనియాడారు. తెలంగాణ సాహిత్యంలో దాశరథి ముద్ర కన్పిస్తోందన్నారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన ప్రజాకవి దాశరథి అని చెప్పారు. దాశరథి తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం గోప్పదన్నారు. కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ.. సమాజంలో దాశరథి సాహిత్యానికి గొప్ప పేరుందన్నారు. నేటి కాలానికి దాశరథి సాహిత్యం అవసరమన్నారు. ప్రశ్నించే సాహిత్యాన్ని అందరూ ఆదరిస్తారని చెప్పారు. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదురించిన ధీరుడు దాశరథి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ మంథని శంకర్, డాక్టర్ కర్రె సదాశివ్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి శత జయంతి

వడ్డెపల్లి: హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ తదితరులు దాశరథి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన శృతి, శ్రీవల్లీ, పావనీలకు బహుతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమా రత్నమాల, ప్రొఫెసర్లు బి.సునిత, రాజు, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

మెగా రక్తదాన శిబిరం

మడికొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లోని వీఎంఆర్ ప్రదీప్‌కుమార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు వేముగంటి ప్రదీప్‌కుమార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించి ఆయనకు ఘననివాళులు అర్పించారు. విద్యార్థులు, సిబ్బంది, నాయకత్వ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎల్లయ్య మాట్లాడుతూ.. రక్తదాన శిబిరం ద్వారా ప్రదీప్ కుమార్‌కు నివాళి అర్పించడమే కాకుండా ప్రాణాలు కాపాడడంలో సమాజం కట్టుబాటును చాటిందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్‌రెడ్డి, ఇనిస్టిట్యూట్ కార్యదర్శి జి. కరుణశ్రీ, కోశాధికారి డాక్టర్ సుశాంత్ వేముగంటి, హన్మంతరావు, వైద్యబృందం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కేయూకు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ రాక

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి జూలై 24న గురువారం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించనున్నారు. గతంలో ప్రకటించినట్లుగా ఈనెల 23కు బదులుగా 24కు షెడ్యూల్‌ను మార్చినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి కేయూ సెనెట్ హాల్‌లో సమావేశం జరుగుతోందని వెల్లడించారు. కేయూ డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాధిపతులు, పరీక్షల నియంత్రణాధికారి, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర స్టేక్ హోల్డర్లు కేటాయించిన సమయంలో చైర్మన్‌ను కలిసి మాట్లాడవచ్చునని వెల్లడించారు.

తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందామని బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. మంగళవారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టు, ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై విద్యార్థులపై కల్పించారు. కేసీఆర్ సారథ్యంలో నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా తెలంగాణ ఉద్యమం జరిగిందన్నారు. రాష్ట్రం సాకారమైన తరువాత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రాంతం పచ్చని మణిహారంగా తయారైందని, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి నది నుంచి 200 టీఎంసీలను అక్రమంగా తరలించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఇంత పెద్ద కుట్ర జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకరించడం సరికాదన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల మధ్య జరిగిన ఒప్పందాన్ని బయట పెట్టాలని, రైతులకు నష్టం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్స్ అరూరి రంజిత్, గంద్రకోట రాకేశ్‌యాదవ్, గొల్లపల్లి వీరస్వామి, రాసురి రాజేష్, మహి తదితరులు పాల్గొన్నారు.

నాలాలపై నిర్లక్ష్యమేల?!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టకుండా సమీప ప్రాంతాల్లో తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. భద్రకాళి, బొందివాగు, నయీంనగర్, దర్గా కాజీపేట, శాకరాసికుంట, చిన్నవడ్డెపల్లి చెరువు, శివనగర్, 12 మోరీలు, అండర్ బ్రిడ్జి ప్రధాన మురుగు కాల్వల్లో అడుగంటే వరకు పూడికతీత పనులు చేపట్టాలి. అలాగే నందిహిల్స్, జూపార్క్, అమరావతినగర్ బ్రిడ్జి, ప్రెసిడెన్సీ స్కూల్ ముందు వరకు కచ్చా నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. ఇంకా వడ్డెపల్లి, ప్రశాంత్‌నగర్, చైతన్యపురి, దర్గా, రైల్వేగేటు, కాకతీయ కాలనీ, రాజాజీనగర్, కాజీపేట, వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 350 చోట్ల కచ్చా నాలాలు, బాక్స్ డ్రెయిజేజీలు, అంతర్గత నాలాల పనులు చేయాలి. పెద్ద నాలాల్లో తప్ప కచ్చ, బాక్స్ అంతర్గత నాలాల్లో జేసీబీతో పూడిక తీసినట్లు ఎక్కడా కనిపించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మేయర్, కమిషనర్ పూడికతీత పనులపై దృష్టి సారించి పనులు నాణ్యంగా చేసేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

(5వ పేజీ తరువాయి)

భూ భారతి దరఖాస్తులు 57 వేల 850 స్వీకరించామని, వాటిలో 25వేలు సాదాబైనామా, 16 వేలు అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. ఇంకా 11 వేల 981 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. వాటిలో మిస్సింగ్ సర్వే నెంబర్లు, సాక్షేషన్స్, పెండింగ్ మ్యుటేషన్స్ ఉన్నాయని, వాటిని విచారించి ఆగస్టు 15వ తేదీ వరకు పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

ఆంధ్రజ్యోతి
బుధవారం
23 జులై 2025

నవ్య
కుటుంబ కదంబం





ఎప్పటికప్పుడు సరికొత్త చీరలు పుట్టుకొస్తూనే ఉంటాయి. మహిళల మనసులను దోచుకుంటూనే ఉంటాయి. అలాంటివే 'కాంత' చీరలు. దారపు కుట్టుతో కనికట్టు చేస్తున్న ఈ చీరల మీద ఓ లుక్కేద్దాం!

కనికట్టు చేసే కాంత

కాంత అనే బెంగాలీ పదానికి... 'పాత వస్త్రం' అని అర్థం. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లోని మహిళలు కొన్ని వందల ఏళ్లుగా వాడేసిన పాత చీరలతో కాంత క్విల్ట్‌లు, పరుపు, దిండ్ల కవర్లు, అలంకరణ వస్త్రాలు తయారుచేస్తున్నారు. ఈ ఎంబ్రాయిడరీల్లో సరళమైన పూల మోటిఫ్స్ మొదలు అతి పెద్ద సన్నివేశాల వరకూ ఉంటాయి. అయితే వెనకున్న వస్త్రపు రంగుతో సరిపోలేలా, క్విల్టింగ్ తరహా కుట్టు వేయడం ఈ కాంత పనితనం ప్రత్యేకత. ఇదే పనితనంతో తయారవుతున్న కాంత చీరలు ప్రస్తుతం ట్రెండ్‌గా మారాయి. వాటినెలా సింగారించాలో తెలుసుకుందాం!

- కాటన్, సిల్క్, మస్లిన్ వస్త్రాల కాంత చీరలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సిల్క్, మస్లిన్ కాంత చీరలు వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. కాటన్ కాంత చీరలు డైలీవేర్‌గా బాగుంటాయి.
- ఈ చీరలు ఒకింత చికన్‌కారీ పనితనాన్ని తలపించేలా ఉంటాయి. కానీ కాంతలో జానపద కథలు, రోజువారీ జీవనవిధానాలు ఎంబ్రాయిడరీ రూపంలో ఆకట్టుకుంటూ ఉంటే, చికన్‌కారీలో కేవలం పువ్వులు, లతలే మనకు కనిపిస్తాయి. కాబట్టి రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకుంటే కాంత చీరలే ఎంచుకోవాలి.
- టెర్రకోట ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు కాంత చీరలకు ఎంతో బాగా సూటవుతాయి.

సంప్రదాయ వంటలతో ఆరోగ్యం

ఆహారంలోనే ఆరోగ్యం దాగి ఉంటుంది. కానీ ఎలాంటి ఆహారం తినాలో, ఎలా వండుకుని తినాలో, ఏ పాత్రల్లో వండుకుని తినాలో ఎంతమందికి తెలుసు? కాలక్రమేణా సంప్రదాయ వంటలు కనుమరుగైపోతున్న క్రమంలో, స్వాదిష్టం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా, తెలుగు వంటకాల పట్ల ఆరోగ్యాన్నీ, అవగాహననూ పెంచే ప్రయత్నం చేస్తున్నారు శ్రీకాకుళానికి చెందిన సౌజన్య నర్సీపురం. ఆ స్వాదిష్టమైన వంటల ప్రయాణం ఆమె మాటల్లోనే...



చిన్నప్పటి నుంచి అమ్మ చేస్తే తిని పెట్టడమే తప్ప స్వయంగా వండింది లేదు. కానీ బిటెక్ పూర్తి చేసి, ఉద్యోగరీత్యా చెన్నైలో ఉండవలసివచ్చినప్పుడు, అమ్మ చేతి వంట విలువ తెలిసొచ్చింది. స్వయంగా వండుకోవాలనే ఆలోచనకు అది నాందిగా మారింది. ఆ క్రమంలో వంటకాల పట్ల ఆసక్తి కూడా పెరిగింది. స్వతహాగా పుస్తకాలు చదివే అలవాటు ఉండడంతో వంటల పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. అలా డాక్టర్ జి.వి. పూర్ణ చందు గారి పుస్తకాలు చదివి, వంటకాల పట్ల మరింత అవగాహన, ఆసక్తి పెంచుకున్నాను. రెండు వందల ఏళ్ల నాటి వంటకాలకూ నేటి వంటకాలకూ ఏమాత్రం పొంతన లేదనే విషయం ఆయన పుస్తకాలు చదివిన తర్వాత అర్థమైంది. మన వంటకాల్లో ఇంతటి మార్పు ఎందుకొచ్చింది? మనం మన సంప్రదాయ వంటకాలకు ఎందుకు దూరమవుతున్నాం?
ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సంప్రదాయ తెలుగు వంటకాలు మరుగున పడిపోయే ప్రమాదం ఉంది కదా?... ఇలా నాలో ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. అలా వంటకాల పట్ల నా పరిశోధన మొదలుపెట్టాను.

లోతైన అవగాహన ఏర్పరుచుకుని...

ఎన్నో పుస్తకాలు చదివాను. ఎంతోమందిని విచారించాను. పెద్దలను సంప్రతించాను. తెలియని వంటకాల గురించి వీలున్న ప్రతి మార్గంలో ఆరా తీయడం మొదలుపెట్టాను. కూరగాయల సంతకు వెళ్లినప్పుడు ఏదైనా కొత్త కూరగాయ కనిపిస్తే, దాన్నెలా వండాలో అమ్మేవాళ్లను అడిగేదాన్ని. వాళ్లు చెప్పిన ఆ కొత్త వంటకాన్ని గుర్తుపెట్టుకుని ఇంట్లో వండే ప్రయత్నం చేసేదాన్ని.
అయితే ఇలా వండే వంటకాల స్నిటినీ భద్రపరుచుకోవాలనే ఆలోచనతో 2020లో స్వాదిష్టం అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను మొదలుపెట్టాను. నిజానికి ఇది నా కోసం నేను సృష్టించుకున్న వేదిక. దీని ద్వారా ఎంతో మంది సంప్రదాయ వంటకాల పట్ల అవగాహనను పెంచుకోవడం నాకెంతో సంతృప్తిని కలిగిస్తోంది. వంట వండే విధానంతో పాటు, ఆ వంటకం వెనకున్న కథ, దాన్లోని పోషకాలు, పాత్రల గురించి వివరిస్తూ ఉండడంతో, క్రమేపీ అభిమానులు పెరిగారు. నాలా ఆలోచించే వాళ్లను కలిసిన ప్రతిసారీ ఈ రంగంలో నేను చేయవలసిన కృషి ఇంకా ఎంతో ఉందని అనిపిస్తూ ఉంటుంది. ఈ దిశగా నేనొక అడుగు ముందుకు వేశాననే చెప్పాలి. ఇటీవలే ఓనమాలు అనే ఇనీషియేటివ్‌లో భాగం పంచుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో మరుగున పడిన సంస్కృతులు, సంప్రదాయ వంటకాలను తిరిగి వాడుకలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్న సంస్థ అది.
ఈ సంస్థ తరఫున ఉత్తరాంధ్రలో నేనొక కుకింగ్ షోను ప్రదర్శించాను.

ప్రస్తుతం భోగాపురంలో ఉంటున్నాను. అమ్మ సూర్యకుమారి, గృహిణి. నాన్న వెంకట రమణ మూర్తి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేశారు. మా వారు లీలా వినయ్ ఇటీవలే విజయనగరంలో సహజ వ్యవసాయంలోకి అడుగు పెట్టారు. ప్రస్తుతానికి నాలుగు రకాల దేశీ బియ్యంతో పాటు స్థానిక కూరగాయలన్నీ పండిస్తున్నారు. మాకు గిర్, పుంగనూరు మొదలైన దేశీయ ఆవులు కూడా ఉన్నాయి.

పాత్రలు కూడా ప్రధానమే!

పోషక అవసరతల ఆధారంగానే వంటకాలు రూపొందుతూ ఉంటాయి. పాత్రల పట్ల అవగాహన లేక, తోచిన పాత్రల్లో వండేసుకుంటున్నాం. ఇనుప పాత్రలో వండుకుంటే రక్తహీనత తొలగిపోయే మాట వాస్తవమే! కానీ చింతపండు లాంటి పుల్లని పదార్థాలు ఇనుప పాత్రల్లో వండుకోవడం వల్ల అవసరానికి మించిన ఇనుము శరీరంలోకి చేరుకుంటుందని ఎంతమందికి తెలుసు? కాబట్టి ఏ పాత్రలో, ఏ పదార్థాలు వండుకోవాలో అందరూ తెలుసుకోవాలి. దద్దోజనం ఆరోగ్యకరమైన ఆహారమే, కానీ సైనసైటిస్ ఉన్నవారు ఈ ఆహారం తినకూడదు. ఇలాంటి విషయాల పట్ల మరింత అవగాహన పెరిగేలా, పురాతన గ్రంథాలు చదవడం కోసం సంస్కృతం కూడా నేర్చుకున్నాను. మన సంప్రదాయ వంటకాల గురించి ఎంత నేర్చుకున్నా నేర్చుకోవలసింది ఇంకా ఉంటూనే ఉంటుంది. తెలుగింటి వంటల పట్ల ఆసక్తినీ, మక్కువనూ పెంచుతూ అందర్నీ ఆరోగ్యం వైపు నడిపించాలన్నదే నా లక్ష్యం. త్వరలో సంప్రదాయ వంటకాలతో ఒక ఈటరీ మొదలుపెట్టి ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు జీవనవిధానానికి కూడా ప్రచారం కల్పించాలనే ఆలోచన ఉంది.



'ఉప్పిండి' అనే వంటకం నుంచే ఉప్మా అన్న పదం పుట్టింది. ఉప్మా వండడానికి పది నిమిషాలు పట్టొచ్చు. కానీ ఉప్పిండిని ఐదు నిమిషాల్లో వండుకోవచ్చు. పెసరపప్పు, బియ్యం నూక, పోపుతో చిటికెలో తయారైపోయే ఇలాంటి వంటకాలు ఆరోగ్యకరం, సులభతరం. అన్నం, పెసరపప్పుతో తయారు చేసే పులగం కూడా ఇలాంటిదే! వంట కోసం హైరానా పడిపోవలసిన అవసరం లేదు. అనవసరపు మసాలాలు, పొడులు జోడించి దాని నామరూపాలు మార్చేయవలసిన అవసరం అంతకన్నా లేదు. ఇలాంటి సులభతరమైన వంటకాలను ఎంచుకుంటే సమయం ఆదా అవుతుంది. ఆరోగ్యం కూడా నిక్షేపంగా ఉంటుంది.

• గోగుమళ్ల కవిత

వర్షాకాలంలో మొక్కలు పదిలంగా...

మనం ఇంటి చుట్టూ, బాల్కనీలో, మేడపైన రకరకాల మొక్కలు పెంచుకుంటూ ఉంటాం. పెద్ద పెద్ద చినుకులు పడినా, గాలి బలంగా వీచినా ఈ మొక్కలకు నష్టం కలుగవచ్చు. కాబట్టి వర్షాకాలంలో మొక్కల సంరక్షణకు సంబంధించి తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- నిరంతరం కురిసే వర్షాల వల్ల ఒక్కోసారి కాండం, ఆకులు, పువ్వులు కుళ్లిపోవడాన్ని చూస్తూ ఉంటాం. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేదంటే క్రిమికీటకాలు చేరి మొక్కను బలహీనపరుస్తాయి.
- గాలి బలంగా వీస్తే మొక్కలు, వాటి కొమ్మలు వంగిపోతుంటాయి. అలాకాకుండా మొక్కలకు సమీపంలో పొడవైన కర్ర లేదా చెక్కను ఆధారంగా నిలబెట్టాలి. సన్నని దారంతో దానికి మొక్కను జతచేయాలి.
- వర్షాకాలంలో తరచూ మొక్కలకు నీళ్లు పోయాల్సిన అవసరం ఉండదు. కుండీల్లో అయితే నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కుండీ అడుగున ఉండే రంధ్రం మూసుకుపోకుండా చూడాలి.
- ఇంటి చుట్టూ, మేడ మీద తోట పెంచుతున్నట్లయితే మొక్కల మొదళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలి. వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా ప్రవహించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షాలు కురవగానే మొక్కలకు చిగుర్లు వస్తుంటాయి. ఈ సమయంలో పండ్లు, కాయగూరల నుంచి వచ్చే వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు అందించాలి. వాడేసిన కాఫీ, టీ పొడులను ఒకసారి మంచినీళ్లతో కడిగి మట్టిలో కలపవచ్చు. ఇలా చేయడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది.
- ఆగకుండా కురిసే వర్షాల వల్ల మొక్కల మొదట్లో మట్టి పక్కకు జరుగుతుంది. దీంతో మొక్కల వేళ్లు బయటికి వచ్చేస్తుంటాయి. అలాంటప్పుడు వర్షం తగ్గగానే వేళ్లమీదికి మట్టిని జరపాలి. అలాగే తేలికపాటి ఎరువులను కూడా అందించాలి.
- ఆకుకూరలు, పూలమొక్కలు ఎక్కువగా వర్షానికి ప్రభావితమవుతాయి. ఇంటి చుట్టూ లేదా మిద్దె తోటలో ఈ మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే వాటిమీద వర్షం పడకుండా నెట్‌షీట్‌తో కూడిన రెయిన్ కవర్‌ను ఏర్పాటు చేయాలి. వర్షం తగ్గగానే రెయిన్ కవర్ తొలగిస్తే నెట్ షీట్ ద్వారా మొక్కలకు సూర్యరశ్మి అందుతుంది.



గాజుతో అందంగా...

ఇల్లు అందంగా కనిపించాలని గాజుతో తయారుచేసిన రకరకాల అలంకరణ వస్తువులు తెచ్చి పెట్టుకుంటూ ఉంటాం. అలాగే ఇంటిని అలంకరించడానికి సౌకర్యవంతంగా మార్చడానికి కూడా గాజును వినియోగించవచ్చంటున్నారు నిపుణులు.

- గాజుతో రూపొందించిన టీపాయ్, డైనింగ్ టేబుల్, ల్యాప్‌టాప్ టేబుల్ లాంటివి ఇంటికి అదనపు అందాన్నిస్తాయి. పారదర్శకంగా ఉండే గాజు కాకుండా రకరకాల రంగుల్లో లభ్యమయ్యే టఫెండ్ గ్లాస్‌తో తయారుచేసినవాటిని ఎంపిక చేసుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది. పూలు, రకరకాల బొమ్మలు ప్రింట్ చేసి ఉన్న గాజు మెటీరియల్స్ కూడా లభ్యమవుతున్నాయి. వీటిని తెచ్చి టేబుల్ లేదా టీపాయ్ ఉపరితలం మీద అమర్చుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- ఇంట్లో పెద్దగా ఉన్న హాల్‌ని అందంగా విభజించడం అనేది నేటి ఇంటీరియర్ ట్రెండ్. చెక్కతో తయారుచేసిన హాల్ డివైడర్స్‌ని మనం చూసే ఉంటాం. దీనికి బదులు గాజు పార్టిషన్స్‌ను ఎంపిక చేసుకుంటే ఇల్లు ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చుట్టూరా చెక్క ఫ్రేమ్ ఉన్నప్పటికీ మధ్యలో గాజు మెటీరియల్‌ను అమర్చుకుంటే ప్రత్యేకంగా ఉంటుంది. ప్రింటెడ్, స్టెయిన్డ్, ఫ్రోస్టెడ్ గాజు రకాలు ఈ తరహా పార్టిషన్స్‌కు బాగుంటాయి.
- వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో కొన్ని అరలకు గాజు తలుపులు బిగించుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాదు ఆ అరల్లో అలంకరణ వస్తువులు, బొమ్మలు, ఫొటోలు లాంటివి సర్దుకుంటే అవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. గదులు కూడా విశాలంగా మెరుస్తుంటాయి.
- కిటికీలకు ఫ్రోస్టెడ్ గాజు తలుపులు అమర్చుకోవచ్చు. వీటి మీద రకరకాల డిజైన్లు ప్రింట్ చేసి ఉంటాయి. వీటివల్ల ఇంట్లోని వస్తువులు బయటికి కనిపించవు. ఇల్లు కూడా అహ్లాదకరంగా ఉంటుంది.
- సాధారణంగా మనం ఫాల్స్ సీలింగ్ కోసం చెక్క, పీఓపీ, జిప్సం లాంటి మెటీరియల్స్ వాడుతూ ఉంటాం. వీటికి బదులు గాజు సీలింగ్‌ని వినియోగిస్తే ఇల్లు గ్రాండ్‌గా కనిపిస్తుంది. పూర్తిగా కాకపోయినా ఒక లేయర్‌ను ఇలా ప్రింటెడ్ గాజుతో అమరిస్తే బాగుంటుంది. మధ్యమధ్యలో అందమైన లైటింగ్స్ పెట్టించుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది.



రాకెట్ పడితే పతకాల పంట!

దివ్యాంశి భౌమిక్... టేబుల్ టెన్నిస్ రాకెట్ పడితే ప్రత్యర్థి ఎవరైనా దూకుడుగా పోరాడడం ఆమె నైజం. ఇటీవల తాష్కెంట్‌లో జరిగిన 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్'లో సంచలన విజయాలు నమోదు చేసింది. అంతేకాదు... ముప్ఫై ఆరేళ్ళ తరువాత ఆ పోటీల్లో టైటిల్ నెగ్గిన భారతీయురాలిగా నిలిచింది. అండర్-15 వరల్డ్-3 ర్యాంక్‌లో ఉన్న ఈ అమ్మాయి ఒలింపిక్స్ స్వర్ణమే తన లక్ష్యం అంటోంది.



"ప్రతి మ్యాచ్ ఏదో ఒక కొత్త పాఠం నేర్పుతుంది. ఎప్పటికప్పుడు సాంకేతికంగా, మానసికంగా, శారీరకంగా మెరుగుపడుతూనే ఉండాలి. క్రీడలు మన వ్యక్తిత్వానికి సానపెడతాయి. అందుకే నాకు క్రీడలంటే ప్రాణం" అంటోంది దివ్యాంశి భౌమిక్. ఈనెల మొదటివారంలో... ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో ముగిసిన 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్‌లో ఆమె స్వర్ణాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. సుబ్రమణియన్ భువనేశ్వరి (1986లో) తరువాత... 36 ఏళ్ళకు ఈ టైటిల్‌ను మన దేశానికి తీసుకువచ్చిన దివ్యాంశి... భారత మహిళా టేబుల్ టెన్నిస్ ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటోంది.

అప్పుడు సీరియస్‌గా తీసుకోలేదు...

దివ్యాంశి కుటుంబం కోల్‌కతా నుంచి వచ్చి ముంబైలో స్థిరపడింది. ఆమె తండ్రి రాహుల్ ఒక బహుళ జాతి కంపెనీలో ఉన్నతాధికారిగా ఉన్నారు. "మా స్కూల్‌లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను తప్పనిసరిగా అభ్యసించాలి. నేను టేబుల్ టెన్నిస్ ఎంచుకున్నాను. కానీ అప్పుడు దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు" అని చెబుతోంది దివ్యాంశి. అయితే కొవిడ్ లాక్‌డౌన్‌తో ఇంటిల్లిపాదికీ తీరిక దొరికింది. అక్క హితాంశితో, ఒకప్పుడు క్రీడాకారుడైన తండ్రితో ఇంట్లోనే వీలైనంతసేపు టేబుల్ టెన్నిస్ ను దివ్యాంశి ప్రాక్టీస్ చేసింది. "అప్పుడే నాకు ఆ ఆట మీద ఇష్టం ఏర్పడింది. వరుసగా గెలవడంతో ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది అని ఆమె అంటోంది. ఆమె నైపుణ్యాన్ని గుర్తించిన తండ్రి స్థానికంగా శిక్షణ ఇప్పించారు. కొన్నాళ్ళకు తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న దివ్యాంశి... సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఇంకా ప్రోత్సహిస్తే మరింత రాణించగలదని ఆమె తండ్రి భావించారు. అప్పటి నుంచి అదే ఆమె లోకమైపోయింది. 2022కల్లా రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకుంది. క్రమంగా జాతీయ స్థాయికి ఎదిగింది. దాదాపుమ ప్రతి పోటీలోనూ పతకం సాధిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఏడు పతకాలు, పదకొండు డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టైటిల్స్, 2023లో 'వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్- డబుల్స్'లో స్వర్ణం... ఆమె ఖాతాలో ఉన్నాయి.

మా స్కూల్‌లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను తప్పనిసరిగా అభ్యసించాలి. నేను టేబుల్ టెన్నిస్ ఎంచుకున్నాను. కానీ అప్పుడు దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు కొవిడ్ లాక్‌డౌన్‌లో అక్క హితాంశితో, ఒకప్పుడు క్రీడాకారుడైన తండ్రితో ఇంట్లోనే టేబుల్ టెన్నిస్ ఆడేదాన్ని.అప్పుడే నాకు ఆ ఆట మీద ఇష్టం ఏర్పడింది



చాలా శ్రమ పడాల్సి వస్తోంది...

తాజాగా 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్'లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను దివ్యాంశి సాధించింది. చైనీయుల ఆధిపత్యం ఉన్న ఈ టోర్నీలో... ముగ్గురు చైనా అమ్మాయిలపై నెగ్గి... స్వర్ణాన్ని అందుకోవడంలో ఈ గెలుపు మరింత ప్రత్యేకంగా మారింది. ప్రస్తుతం బాలికల అండర్-15 వరల్డ్-3 ర్యాంక్‌లో దివ్యాంశి కొనసాగుతోంది. "దీనికోసం చాలా శ్రమ పడాల్సి వస్తోంది. ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాల్సి వస్తోంది. మా కోచింగ్ క్యాంప్‌లు బెంగళూరులో జరుగుతాయి. ముంబై నుంచి అక్కడికి తరచూ వెళ్ళాల్సి వస్తోంది. మరోవైపు పదో తరగతి పరీక్షలకి సన్నద్ధం కావాలి. శిక్షణ తరువాత చదువుకోవడం కష్టమే అయినా మరో మార్గం లేదు. మార్కుల కోసం నాన్న, అమ్మ ఒత్తిడి చెయ్యరు. కానీ చదువులో వెనుకపడడం నాకు ఇష్టం లేదు. నా కుటుంబం, కోచ్‌ల సహకారంతో చదువును, క్రీడల్ని బ్యాలెన్స్ చేసుకుంటున్నా" అంటోందామె. ఈ ఏడాది నవంబర్‌లో రొమేనియాలో జరిగే 'వరల్డ్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ కోసం సన్నద్ధం అవుతున్న దివ్యాంశి... 2028 ఒలింపిక్స్‌లో మన దేశానికి స్వర్ణాన్ని సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది.



హాస్టల్ గదిలో మొదలైన స్టార్టప్..
ఆర్మీకి డ్రోన్లు సరఫరా చేసేస్తోంది!

» హైదరాబాద్ బిట్స్ పిలానీ విద్యార్థుల ఘనత



హైదరాబాద్, జూలై 22: ఇద్దరు విద్యార్థులు స్థాపించిన రక్షణ-సాంకేతిక స్టార్టప్.. అతి కొద్దిరోజుల్లోనే భారత సైన్యానికి యుద్ధంలో వాడే డ్రోన్లు, కామికేజ్‌లు సరఫరా చేస్తోంది. హాస్టల్ గదిలో చిన్నపాటి అసెంబ్లింగ్ యూనిట్‌తో వారు మొదలుపెట్టిన స్టార్టప్.. కేవలం రెండు నెలలకే మన సైనిక దళాలకు స్వదేశీ డ్రోన్లను అందజేసే స్థాయికి ఎదిగింది. అదే అపోలియన్ డైనమిక్స్! హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీకి చెందిన జయంత్ ఖత్రి, సౌర్య చౌదరి కలిసి ఈ స్టార్టప్‌ను ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన జయంత్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి కాగా.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సౌర్య ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థి. అపోలియన్ డైనమిక్స్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లోనే స్థాపించినట్లు జయంత్ మంగళవారం పీటీఐ వార్తా సంస్థతో చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆధునిక యుద్ధతంత్రంలో డ్రోన్లదే కీలక పాత్ర అని భావించామని.. ఆ దిశగా ఆలోచించి, డ్రోన్ల తయారీపై దృష్టి పెట్టామని తెలిపారు. రోబోటిక్స్, మానవ రహిత వైమానిక వాహనాల (యూఏవీ)పై ఉన్న ఆసక్తితోనే ఈ స్టార్టప్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. తమ స్టార్టప్‌కు బిట్స్ పిలానీ అండగా నిలిచిందని.. కేంద్రం నుంచి రూ.8 లక్షలు అందేలా చూసిందని చెప్పారు. మే నెలాఖరులో చండీగఢ్‌లో జరిగిన కార్యక్రమంలో భారత ఆర్మీకి తమ డ్రోన్ల గురించి ప్రత్యక్షంగా ప్రదర్శన ఇచ్చామన్నారు. తాము రూపొందించిన డ్రోన్ల వేగం, విన్యాస సామర్థ్యం, మన్నిక, పనితీరు ఆర్మీ ఉన్నతాధికారులకు బాగా నచ్చడంతో పెద్ద సంఖ్యలో ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. అపోలియన్ డైనమిక్స్ కార్యకలాపాలు ప్రారంభించిన రెండు నెలల్లోనే సైన్యానికి చెందిన కీలక కేంద్రాలకు యూఏవీలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జమ్మూ, చండీమందిర్, పనాగఢ్, అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఆర్మీ కేంద్రాలకు స్వదేశీ డ్రోన్లను అందించినట్లు చెప్పారు. ఆర్మీ నుంచి వచ్చిన ఆర్డర్లన్నింటినీ డెలివరీ చేయడానికి కనీసం రెండు నెలల పాటు రేయింబవళ్లు కష్టపడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆర్మీ చేపట్టే మిషన్లకు అవసరమైనట్లుగా, వారికి కావాల్సిన రీతిలో డ్రోన్లను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. విదేశీ యూఏవీ సాంకేతికతపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలన్న వ్యూహాత్మక లక్ష్యంలో భాగంగా.. అపోలియన్ డైనమిక్స్ నుంచి దీర్ఘ-శ్రేణి నిఘా, వ్యూహాత్మక పేలోడ్ డెలివరీ, అత్యంత కచ్చితమైన కామికేజ్ కార్యకలాపాల కోసం బహుళార్థ యూఏవీల కోసం ఆర్మీ ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిపారు. కామికేజ్ రకం గంటకు 300 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించడంతో పాటు అత్యంత కచ్చితత్వంతో ఒక కేజీ వరకు పేలోడ్‌ను తీసుకెళ్తుందని వివరించారు. ఈ డ్రోన్లు అత్యధిక సామర్థ్యం కలిగి ఉంటాయని.. రాత్రి వేళల్లో నిఘా కోసం, వ్యూహాత్మక ఆపరేషన్లలోనూ వీటిని వినియోగిస్తారని జయంత్, సౌర్య చెప్పారు. బిట్స్ పిలానీలోని రిసెర్చ్, ఇన్నోవేషన్ విభాగం డీన్ సంకేత్ గోయెల్ తమకు అండగా నిలిచారన్నారు. తాము అందించే ప్రముఖ ఉత్పత్తుల్లో శిక్షణ యూఏవీ ఒకటని చెప్పారు. దృఢమైన డిజైన్, వాడుకలో సౌలభ్యం కారణంగా సైనిక కేంద్రాలు ఎక్కువగా ఈ డ్రోన్లను తీసుకుంటాయని తెలిపారు. తమ స్టార్టప్ డ్రోన్ల వాడకంపై సైనికులకు సమగ్ర శిక్షణను కూడా అందిస్తోందని, విమానయాన అనుభవం లేని వారు కూడా తక్కువ వ్యవధిలోనే నిపుణులైన డ్రోన్ ఆపరేటర్లుగా మారేలా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ప్రముఖ తయారీదారులుగా మారడమే లక్ష్యం..

ప్రస్తుతం తమ బృందంలో 10 మంది వరకు సభ్యులు ఉన్నట్లు జయంత్, సౌర్య తెలిపారు. ప్రస్తుతం తాము భవిష్యత్ తరానికి చెందిన వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీవోఎల్) ప్లాట్‌ఫాం, ఫిక్స్‌డ్-వింగ్ వ్యవస్థలపై పనిచేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో దేశంలోనే ప్రముఖ అధునాతన రక్షణ వ్యవస్థల తయారీదారుల్లో ఒకరిగా నిలవాలన్న స్పష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మి.. మరో మైలురాయి



(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ. 6700 కోట్లు ప్రయాణ ఖర్చులు ఆదా చేసుకోగా, ఒక్కో పేద కుటుంబం నెలకు రూ.4,000-5,000 ఆదా చేసుకోగలిగింది. దీంతో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సంక్షేమంతోపాటు మహిళల సాధికారతకు పెద్దపీట వేసినట్లయింది.

మహిళలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునేలా...

పుట్టింటికైనా.. ఇష్ట దైవాన్ని దర్శించుకోవడానికైనా.. రాష్ట్రంలో ఎక్కడికెళ్లడానికైనా మహిళలు భర్తను అడక్కుండానే స్వతంత్ర నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెంచుకుంటున్నారు. రైతు బజార్‌లో కూరగాయలమ్మే మహిళలు, ఆస్పత్రులకెళ్లే రోగులు, కాలేజీలు, ఆఫీసులకెళ్లే విద్యార్థినులు, ఉద్యోగినులకు ప్రయాణం తప్పనిసరి. వృద్ధ మహిళలు, సంపాదన లేని మహిళలకు, ప్రయాణ ఖర్చు భారంగా మారిన పేదలకు మహాలక్ష్మి పథకం ఊరటనిచ్చింది.

డిపోలు, బస్ స్టేషన్‌లలో సంబురాలు: మంత్రి పొన్నం

మహాలక్ష్మి పథకంలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినందున బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోలు, 341 బస్ స్టేషన్‌లలో సంబురాలు నిర్వహించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిపోలు, బస్ స్టేషన్‌లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సంబురాల్లో స్థానికులు, స్థానిక నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. డిపోలు, ముఖ్యమైన బస్ స్టేషన్లలో మహిళా ప్రయాణికులను శాలువా, బహుమతితో సత్కరిస్తామన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారతపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, రంగోలి, చిత్రలేఖనం నిర్వహించాలని అధికారుల్ని మంత్రి ఆదేశించారు. మహాలక్ష్మి పథకం విజయవంతానికి కృషి చేసిన ప్రతి డిపోలోని ఐదుగురు ఉత్తమ డ్రైవర్లు/ ఉత్తమ కండక్టర్లతోపాటు ట్రాఫిక్ గైడ్‌లు, భద్రతా సిబ్బందిని సత్కరించాలని అధికారుల్ని మంత్రి పొన్నం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 48 గంటల్లో సమర్థవంతంగా మహాలక్ష్మి పథకం అమలు చేసి, స్ఫూర్తి ప్రదర్శించిన సంస్థ ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిబద్ధత, అంకిత భావం, క్రమశిక్షణతో విధులు నిర్వరిస్తూ రోజూ సగటున 35 లక్షల మంది మహిళలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు సీఎం అభినందనలు

మహాలక్ష్మి పథకం లబ్ధిదారులైన ఆడబిడ్డలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. 18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. దిగ్విజయంగా ఈ పథకం అమలులో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

> **డిపోకెళ్లాల్సిన పనిలేదు... డబ్బూ ఆదా: మానస (విద్యార్థిని)**
>
> 'ఊరికి 10 కి.మీ దూరంలో మా స్కూల్ ఉంది. ఇంతకు ముందు బస్ పాస్ కోసం డిపోకెళ్లాల్సి వచ్చేది. మా నాన్న ఆటో డ్రైవర్, తల్లి గృహిణి. ఇప్పుడు పాస్ కోసం డిపోకెళ్లాల్సిన అవసరం లేదు. పైగా డబ్బు ఆదా అవుతోంది' అని రాజన్న సిరిసిల్ల జిల్లా మలక్‌పేట్ వాసి పదో తరగతి విద్యార్థిని మానస తెలిపారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో కలవరం!

మిథున్‌రెడ్డి అరెస్టుతో ఉలికిపాటు.. సాంకేతికాధారాలతో సిట్ వస్తుండటంతో ఎప్పుడైనా సంకెళ్లు పడొచ్చుననే భయం

- » మద్యం కేసు కావడంతో రాజకీయ భవిష్యత్తుపైనా బెంగ
- » నిరసనలకు సిద్ధమైన వైసీపీ అధిష్ఠానం
- » నేతల నిరాసక్తతతో ఆ వ్యూహం తుస్సు
- » ఎమ్మెల్యేల సామూహిక రాజీనామాలకు వైసీపీ అధినేత జగన్ యోచన
- » 11మందిలో సగం మంది నిరాకరణ



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

లిక్కర్ స్కామ్‌లో కీలక నేతలందరూ సాంకేతిక ఆధారాలతో సహా దొరికిపోయి .. వరుసగా అరెస్టులవుతుండటంతో తాడేపల్లి క్యాంపస్‌లో ఒక్కసారిగా కలవరం మొదలైంది. ఇంతకాలం స్కామ్ జరిగినట్లుగా ఆధారాలు లేనందున కేసు తుస్సుమంటుందని ఏపీ మాజీ సీఎం జగన్ భావిస్తూ వచ్చారు. కానీ, ఆయన అంచనాలన్నీ తల్లకిందులవుతూ, జగన్ సన్నిహితులందరూ అరెస్టవుతున్నారు. తాజాగా వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కూడా అరెస్టు కావడంతో జగన్‌కు కూడా అరెస్టు భయం మొదలైందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. గతంలో ఆర్థిక నేరారోపణలపై అరెస్టు అయిన అనుభవం జగన్‌కు ఉంది. అయితే, మద్యం కేసులో అరెస్టు అయితే, రాజకీయ జీవితం సమాధి అవుతుందన్న ఆందోళనకు జగన్ గురవుతున్నారని అంటున్నారు.

దడ పుట్టిస్తున్న సిట్ స్మార్ట్‌నెస్

రూ.3,500 కోట్ల లిక్కర్ కేసులో తొలి చార్జిషీట్‌ను ఇటీవల సిట్ దాఖలుచేసింది. ఈ చార్జిషీట్‌లో జగన్ పేరును తొలిసారి ప్రస్తావించారు. దీంతో ఏ క్షణానైనా ఆయనను అరెస్టు చేస్తారన్న అభిప్రాయానికి తాడేపల్లి ప్యాలెస్ వచ్చేసిందని సమాచారం. ఇంతకాలం.. ఎలాంటి ఆధారాలూ లేకుండా .. స్టేట్‌మెంట్ల ఆధారంగానే దర్యాప్తు కొనసాగుతూ వచ్చిందని వైసీపీ చీఫ్ భావిస్తూ వచ్చారు. కేవలం స్టేట్‌మెంట్ల ఆధారంతోనే అరెస్టులు చేస్తే .. కేసు నిలబడదంటూ పార్టీ ముఖ్యనేతల నుంచి కార్యకర్తలదాకా జగన్ భరోసా ఇస్తూ వచ్చారు. కానీ, పక్కా సాంకేతిక ఆధారాలతో రాజ్ కసిరెడ్డి నుంచి మిథున్‌రెడ్డి వరకు.. అందరినీ సిట్ అదుపులోకి తీసుకుని జైలుకు పంపించింది. దీంతో జగన్‌లో ధీమా పూర్తిగా సడలిపోయిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ స్థాపించిన నాటి నుంచి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం జగన్ వెంట నిలిచింది. అలాంటి కుటుంబం నుంచి మిథున్‌రెడ్డి అరెస్టు కావడంతో సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని జగన్ కీలకనేతలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే, జగన్ శిబిరం ఇచ్చిన ఆదేశాలను పార్టీనేతలు తేలిగ్గా తీసుకున్నారు. దీంతో.. మిథున్‌రెడ్డికి సంఘీభావంగా కొందరు నేతలు రాజమండ్రి జైలు వరకూ వెళ్లి వచ్చారు. పెద్దిరెడ్డి సొంత జిల్లా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ముఖ్యనేతలు పెద్దగా స్పందించలేదు. దీంతో రాజమండ్రిలో విల్లాను అద్దెకు తీసుకుని అక్కడే పెద్దిరెడ్డి మకాం వేశారు. కుమారుడి బాగోగులు స్వయంగా చూసుకుంటున్నారు. ఒకవేళ జగన్ అరెస్టు అయితే.. ఆయన పరిస్థితి కూడా ఇలాగే ఉండవచ్చునని, సొంత కుటుంబసభ్యులే మంచీచెడ్డా పట్టించుకోవాల్సి రావచ్చునని పార్టీ వర్గాలే అంటున్నాయి.

'వర్కవుట్ కాదు సర్'

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు కావడంతో ఒక దశలో జగన్ 'మూకుమ్మడి రాజీనామాలు' వ్యూహం గురించి ఆలోచించారు. తన ఆలోచనను కొందరు ముఖ్యనేతల వద్ద ఉంచారు. అయితే.. ఈ ప్రతిపాదనను జగన్ మినహా మిగిలిన పది మందిలో సగం మంది తిరస్కరించారని చెబుతున్నారు. పైగా ఈ వ్యూహం 'వర్కవుట్' కాదని కొందరు ముఖ్యనేతలు తేల్చి చెప్పారట! శాసనసభ్యులు మూకుమ్మడి రాజీనామాలు చేయాలన్న చర్చపార్టీలో జరగలేదని వైసీపీ రాజకీయ కమిటీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలూ రాజీనామా చేయడం వల్ల పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాన్ని సజ్జల వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో వైసీపీ చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటిగా విఫలమవుతున్నాయి. ఫీజు పోరు, రైతుపోరు, నిరుద్యోగ పోరు, ఆరోగ్యశ్రీ బిల్లుల సమస్య వంటి వాటిపై జగన్ పిలుపు ఇచ్చిన నిరసన కార్యక్రమాలన్నీ 'అట్టర్‌ఫ్లాప్' అయ్యాయి.

కాంగ్రెస్ పార్టీకి
గట్టి ఎదురు దెబ్బ!


- » 2018-19లో 199.15 కోట్ల విరాళాలపై పన్ను మినహాయింపు విషయంలో చుక్కెదురు
- » గడువు ముగిశాక రిటర్న్స్ దాఖలు చేశారు
- » తద్వారా ఐటీ చట్టాన్ని పార్టీ ఉల్లంఘించింది
- » ఆదాయపన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 22: పార్టీ విరాళాలకు సంబంధించి పన్ను మినహాయింపు విషయంలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను విరాళాల రూపంలో వచ్చిన రూ.199.15 కోట్ల ఆదాయంపై పన్ను మినహాయింపును ఇవ్వాలంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన అప్పీలును ఆదాయపన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఐటీఏటీ) తోసిపుచ్చింది. ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీ రిటర్న్స్‌ను 2018 డిసెంబరు 31లోపు దాఖలు చేయాల్సిందని, అయితే కాంగ్రెస్ పార్టీ గడువు ముగిసిన తర్వాత 2019 ఫిబ్రవరి 2న దాఖలు చేసిందని ఐటీఏటీ గుర్తుచేసింది. గడువు ముగిసిన తర్వాత రిటర్న్స్ దాఖలు చేయడం ద్వారా ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 13-ఏలో నిబంధనలను కాంగ్రెస్ పార్టీ ఉల్లంఘించిందని, తద్వారా పన్ను మినహాయింపు పొందే అవకాశం లేదని ఐటీఏటీ తేల్చిచెప్పింది. సెక్షన్ 13-ఏలోని 139 (4బీ) ప్రకారం రాజకీయ పార్టీలు విరాళాల రూపేణా వచ్చిన ఆదాయంపై పన్ను మినహాయింపు పొందాలంటే తప్పనిసరిగా గడువు తేదీ లోపల రిటర్న్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. అలాగే.. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 12-ఏ కింద స్వచ్ఛంద సంస్థలకు ఆలస్యంగా రిటర్న్స్ దాఖలుకు అవకాశం ఇస్తున్న విధంగానే పార్టీకీ ఇవ్వాలంటూ కాంగ్రెస్ చేసిన అప్పీలును ఐటీఏటీ తోసిపుచ్చింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో పార్టీ రూ.14.49 కోట్లను నగదు రూపంలో సేకరించిందని.. వీటిలో చాలామటుకు దాతకు రూ.2వేల చొప్పున పరిమితికి మించి స్వీకరించడం ద్వారా ఐటీ నిబంధనలను ఉల్లంఘించిందని ఐటీఏటీ పేర్కొంది.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వారి వల్లే ఇది సాధ్యమైంది





'హరిహర వీరమల్లు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా దర్శకుడు క్రిష్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఇప్పుడు వీరమల్లు ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. నిశ్శబ్దంగా కాదు, ఓ గొప్ప చరిత్రను మీకు పరిచయం చేయాలన్న ఆశయంతో. ఈ సినిమా ఇద్దరు లెజెండ్స్ వల్లే సాధ్యమైంది. వారు సినిమా విషయంలోనే కాదు నిజజీవితంలోనూ ఎందరికో స్ఫూర్తి. అందులో ఒకరు, పవన్‌కల్యాణ్. ఆయన ఓ అసాధారణమైన శక్తి. నిత్యం రగిలే అగ్నికణం. ఆయనలోని తపనని ఏ కెమెరా క్యాప్చర్ చేయలేదు. నిరంతరం స్ఫూర్తినిస్తుంటారు. ఈ చిత్రానికి వెన్నెముకలా నిలిచి ప్రాణం పోశారు. మరో వ్యక్తి ఏ.ఎమ్.రత్నం. ఎన్నో అద్భుతమైన భారతీయ చిత్రాల వెనకున్న శిల్పి ఆయన. ఈ సినిమా ఆయన దృఢ సంకల్పం వల్లే సాధ్యమైంది. ఈ చిత్రం నాకు చాలా ప్రత్యేకం. కేవలం దర్శకుడిగానే కాదు, మరిచిపోయిన చరిత్రను తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వ్యక్తిగా. సంవత్సరాలుగా వేచి చూసిన సమయం ఆసన్నమైంది. ఇది అందరికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. పవన్‌కల్యాణ్, ఏ.ఎమ్.రత్నంలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రానికి మొదట క్రిష్ దర్శకత్వం వహించారు. కొన్ని కారణాల వల్ల ఆయన వైదొలగడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు.

పాతికేళ్ల ప్రయాణానికి గుర్తుగా




భారతీయ సినీ రంగంలో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ ఇద్దరూ గొప్పస్టార్స్. వీరిద్దరినీ కలిపి ఒకే సినిమాలో నటింపచేసిన ఘనత యశ్‌రాజ్ సంస్థకే దక్కుతుంది. ఆ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న చిత్రం 'వార్ 2'. ఈ నెల 25న వార్ 2 ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు యశ్‌రాజ్ సంస్థ మంగళవారం తెలిపింది. '2025లో భారతీయ సినీ రంగానికి చెందిన ఇద్దరు గొప్ప స్టార్స్ తమ సినీ ప్రయాణంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదొక లైఫ్ టైమ్ మూమెంట్. ఈ అరుదైన క్షణాలను మరింత గొప్పగా సెలబ్రేట్ చేసుకోవడానికి ఈ నెల 25న 'వార్ 2' ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. ఇది ఇద్దరు గొప్ప స్టార్స్ మధ్య జరిగే అద్భుత పోరాటం' అని నిర్మాణసంస్థ పేర్కొంది. ఆగస్టు 14న ఈ చిత్రం విడుదలవుతోంది. కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

థాంక్యూ.. మనోజ్!



ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖ నిరోషా ముఖ్య పాత్రల్లో తోట శ్రీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'థాంక్యూ డియర్'. మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బేనర్‌పై బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలె ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వి.వి.వినాయక్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలోని 'చిక్కక చిక్కిన గుమ్మ' అంటూ సాగే తొలి గీతాన్ని హీరో మంచు మనోజ్ ఆవిష్కరించారు. ఈ పాటను చిత్ర నిర్మాత బాలాజీ రెడ్డి రాయగా, సుభాష్ ఆనంద్ సంగీత సారథ్యంలో శ్రీచరణ్ ఆలపించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు ధనుష్ రఘుముద్రి, నిర్మాత బాలాజీ రెడ్డి, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

160 భాషల్లో 'అవతార్-3'



ప్రపంచవ్యాప్తంగా 'అవతార్' ఫ్రాంచైజీకు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్'... ప్రపంచ సినీ చరిత్రలో సంచలనం సృష్టించింది. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకూ రెండు భాగాలు విడుదలై ఘన విజయం సాధించాయి. తాజాగా మూడో భాగం 'అవతార్ - ఫైర్ అండ్ యాష్' నుంచి వరంగ్ పాత్ర ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈనెల 25న ట్రైలర్‌ని రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2025 డిసెంబరు 19న ప్రపంచవ్యాప్తంగా 160 భాషల్లో 'అవతార్-3' విడుదల కానుంది. కాగా, 'అవతార్-4' 2029లో, 'అవతార్ -5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇదివరకే ప్రకటించింది.

తొలిసారిగా తెలుగులో



తమిళ డబ్బింగ్ చిత్రాలతో ఇన్నాళ్లుగా తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్నారు కమెడియన్ యోగిబాబు. ఇప్పుడు ఆయన తొలిసారి ఓ తెలుగు చిత్రంలో నటిస్తున్నారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న 'గుర్రం పాపిరెడ్డి' చిత్రంలో యోగిబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఉడ్రాజు అనే పాత్రలో వినోదం పంచనున్నారు. మంగళవారం యోగిబాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సద్ది, అమర్ బురా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

యాక్షన్ థ్రిల్లర్



మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోగా జోషీ దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్ ప్రారంభం కాబోతోంది. మంగళవారం జోషి పుట్టినరోజు సందర్భంగా ఉన్ని ముకుందన్ ఫిల్మ్స్, ఐన్‌స్టీన్ మీడియా సంస్థలు ఈ కొత్త ప్రాజెక్టుని అనౌన్స్ చేశాయి. జాతీయ అవార్డు గెలుచుకున్న 'మెప్పడియాన్' తర్వాత వంద కోట్ల గ్రాస్ కలెక్షన్లతో దూసుకెళ్లిన 'మార్కో' వంటి సినిమా నిర్మించిన 'యూఎంఎఫ్' సంస్థ ఇప్పుడు జోషి లాంటి మాస్టర్ డైరెక్టర్‌తో చేతులు కలిపింది. దీంతో నిర్మాణానికి ముందే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. హీరో ఉన్ని ముకుందన్ సరికొత్త లుక్‌లో, మాస్ యాక్షన్ అవతారంలో కనిపిస్తారని చిత్రబృందం పేర్కొంది.

గెలవాల్సిందే..

తీవ్ర ఒత్తిడిలో టీమిండియా
- వెంటాడుతున్న గాయాలు
- పేసర్ ఆకాశ్ అవుట్
- జోష్‌లో ఇంగ్లండ్

మ.3.30 గం. నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

మాంచెస్టర్: ఎనిమిది రోజుల సుదీర్ఘ విరామం తర్వాత భారత్-ఇంగ్లండ్ జట్లు మరోసారి ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడబోతున్నాయి. అయితే లార్డ్స్‌లో విజయం అంచుల వరకూ వచ్చి ఓడిన నిరాశతో పాటు తాజాగా ఆటగాళ్ల గాయాలు భారత జట్టును వేధిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో బుధవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టు బరిలోకి దిగనుంది. ఇక ఈ మ్యాచ్ ఆతిథ్య జట్టు కన్నా గిల్ సేనకే అత్యంత కీలకం. ఎందుకంటే ఇప్పటికే 1-2తో వెనుకబడిన టీమిండియాకు ఈ సిరీస్‌పై ఆశలు నిలవాలంటే మాంచెస్టర్‌లో ప్రత్యర్థిని మట్టికరిపించాల్సిందే. లేకుంటే చివరి టెస్టు నామమాత్రంగా మారుతుంది. మరోవైపు ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో భారత జట్టుకు ఒక్క విజయం కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇక్కడ 9 మ్యాచ్‌లు ఆడితే నాలుగింట్లో ఓడి, ఐదింటిని డ్రా చేసుకుంది. 2014లో ఆడిన చివరి మ్యాచ్‌లోనైతే ఇన్నింగ్స్ 54 రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. అంతేకాదు.. 1990లో సచిన్ శతకం తర్వాత మరే భారత బ్యాటర్ కూడా ఇక్కడ మూడంకెల స్కోరు సాధించలేకపోయాడు. కానీ రెండో టెస్టు జరిగిన ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ తొలిసారిగా అద్భుత విజయం సాధించింది. అదే స్ఫూర్తితో నాలుగో టెస్టును చిరస్మరణీయం చేసుకోవాలనుకుంటోంది. అటు సిరీస్‌లో పైచేయి సాధించిన ఇంగ్లండ్ రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉండడంతో పాటు ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఆడిన చివరి పది టెస్టుల్లో ఇంగ్లండ్ ఒక్కసారే ఓడడం గమనార్హం.


స్టోక్స్

జట్టు కూర్పే సమస్య..: టెస్టు బరిలోకి దిగడానికి ముందు తుది జట్టు కూర్పుపై టీమ్ మేనేజ్‌మెంట్ తర్జనభర్జన పడుతోంది. లార్డ్స్ టెస్టులో ఆడిన నితీశ్ కుమార్ గాయాల కారణంగా సిరీస్‌కు దూరం కాగా, పేసర్ ఆకాశ్ దీప్ ఈ టెస్టుకు దూరమయ్యాడు. పేసర్ అర్ష్‌దీప్‌ది కూడా అదే పరిస్థితి. దీంతో సిరీస్‌లో కచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లోనూ మార్పులు తప్పవు. అయితే స్టార్ పేసర్ బుమ్రా బరిలోకి దిగుతుండడం.. అలాగే రిషభ్ పంత్ కీపింగ్ కూడా చేస్తాడని కెప్టెన్ గిల్ చెప్పడం అతి పెద్ద రిలీఫ్‌గా భావించవచ్చు. ఇక ఆకాశ్ స్థానంలో ప్రసిద్ధ్ క్రిష్ణ, అన్షుల్ కాంబోజ్ మధ్య పోటీ ఉంది. ప్రసిద్ధ్‌కు ఇప్పటికే రెండుసార్లు అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదు కాబట్టి అన్షుల్ వైపే మొగ్గుచూపవచ్చు. ఇక నితీశ్ స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సాయి సుదర్శన్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. వరుసగా మూడు టెస్టుల్లో విఫలమైన కరుణ్ నాయర్‌పై వేటు తప్పదని అంతా భావించినా.. కెప్టెన్ గిల్ మాత్రం అతడికి మద్దతుగా నిలిచాడు. దీంతో కరుణ్‌కు మరో చాన్స్ దక్కినట్టే. ఒకవేళ పిచ్ సీమర్లకు ఎక్కువగా అనుకూలించినట్టయితే స్పిన్నర్ సుందర్‌ను తప్పించి శార్దూల్‌ను ఆడించాలనుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఆతిథ్య ఇంగ్లండ్: ఇంగ్లండ్ జట్టు మాత్రం నాలుగో టెస్టు కోసం ఇప్పటికే తమ ఆటగాళ్లను ప్రకటించింది. స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయంతో దూరం కాగా అతడి స్థానంలో లియామ్ డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత టెస్టుల్లో చోటు దక్కించుకున్నాడు. ఈ లెఫ్టామ్ స్పిన్నర్ బ్యాటింగ్‌లోనూ రాణించగలగడం జట్టుకు అదనపు బలం కానుంది. టాపార్డర్‌లో క్రాలే, డకెట్, పోప్‌తో పాటు మిడిలార్డర్‌లో రూట్, బ్రూక్, స్టోక్స్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. పేసర్ ఆర్చర్ లార్డ్స్ టెస్టులో భారత్‌ను ఇబ్బందిపెట్టాడు. 2-1తో ఆధిపత్యంలో ఉన్న ఇంగ్లండ్ ఎలాంటి అలక్ష్యానికి తావీయకుండా ఇక్కడే సిరీస్ పట్టేయాలనుకుంటోంది.



90 సెకన్లు ఆలస్యంగానా?

ఇంగ్లండ్ క్రీడా స్ఫూర్తిని ప్రశ్నించిన గిల్

లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిందని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆరోపించాడు. ఇంగ్లిష్ ఓపెనర్లు ఉద్దేశపూర్వకంగానే 90 సెకన్లు ఆలస్యంగా క్రీజులోకి వచ్చారని అన్నాడు. '10 కాదు.. 20 కాదు.. ఏకంగా 90 సెకన్లు ఆలస్యంగా వచ్చారు. మేం ఆ పరిస్థితుల్లో ఉండి ఉంటే.. అలాగే ఆలోచించే వాళ్లమేమో. కానీ, దేనికైనా ఓ పద్ధతి ఉంటుంద'ని గిల్ అన్నాడు.

చెత్త రికార్డుకు చేరువలో..

మాంచెస్టర్‌లో కచిత్వంగా గెలిచి తీరాల్సిన ఒత్తిడితో పాటు ఇక్కడ మరో 'రికార్డు' కూడా భారత జట్టును వణికిస్తోంది. స్థానిక ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్ ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా గెలువలేదు. నాలుగింట్లో ఓడి, ఐదింటిని డ్రా చేసుకుంది. 2014లో ఆడిన చివరి మ్యాచ్‌లోనైతే ఇన్నింగ్స్ 54 రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. ఒకవేళ ఈ టెస్టులోనూ ఓడితే భారత్ ఖాతాలో ఏ జట్టూ కోరుకోని రికార్డు చేరనుంది. టెస్టు చరిత్రలో ఒకే వేదికపై వరుసగా పది మ్యాచ్‌ల్లోనూ గెలుపు రుచి చూడని జట్టుగా నిలువనుంది. ప్రస్తుతం భారత్‌తో పాటు ఆస్ట్రేలియా (కరాచీ వేదికపై), శ్రీలంక (లార్డ్స్‌లో) కూడా వరుసగా తొమ్మిది టెస్టుల్లో గెలుపు లేకుండా సమంగా ఉన్నాయి.

తుది జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), పంత్, కరుణ్ నాయర్, జడేజా, సుందర్/శార్దూల్, బుమ్రా, ప్రసిద్ధ్/అన్షుల్, సిరాజ్.
ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), స్మిత్, వోక్స్, డాసన్, కార్స్, ఆర్చర్.

పిచ్, వాతావరణం

మాంచెస్టర్ పిచ్ సహజంగానే పేసర్లకు అనుకూలిస్తుంటుంది. చక్కటి బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బందిపెడుతుంటారు. వాతావరణ పరిస్థితిని బట్టి కూడా టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. అలాగే టెస్టు జరిగే ఐదు రోజులు చిరు జల్లులకు ఆస్కారం ఉంది. తొలి రెండు రోజులు మ్యాచ్‌కు అంతరాయం కలిగించవచ్చు.

తొలి గేమ్‌లో హంపి, దివ్యకు డ్రా

మహిళల చెస్ వరల్డ్‌కప్ సెమీస్

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్‌కప్ సెమీస్‌లో భారత జీఎం కోనేరు హంపి, ఐఎం దివ్య దేశ్‌ముఖ్ తమ తొలి గేమ్‌లను డ్రాగా ముగించారు. చైనా గ్రాండ్ మాస్టర్ లి టింగ్జీతో మంగళవారం జరిగిన సెమీస్ మొదటి క్లాసిక్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి సులువుగా గేమ్‌ను డ్రా చేసుకుంది. ఓపెనింగ్‌లోనే ప్రత్యర్థికి కోనేరు ఝలక్ ఇచ్చింది. దీంతో ఏం చేయాలో అర్థం కాని టింగ్జీ తన బలగాలను సరిగా నడిపించలేకపోయింది. మిడిల్ గేమ్‌లో ఇద్దరూ క్వీన్‌లను కోల్పోయినా.. హంపి ఎక్కడా ఒత్తిడికి గురికాలేదు. మరో సెమీస్‌లో చైనా జీఎం టాన్ జోంగ్‌యితో దివ్య పాయింట్ పంచుకొంది. బుధవారం కీలక రెండో క్లాసిక్ గేమ్ జరగనుంది.

● **దక్షిణాఫ్రికాపై కివీస్ గెలుపు**

హరారే: టిమ్ సీఫెర్ట్ (66 నాటౌట్) అర్ధ శతకంతో చెలరేగడంతో.. టీ20 ముక్కోణపు సిరీస్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత సౌతాఫ్రికా 134/8 స్కోరు చేసింది. హెండ్రిక్స్ (41) టాప్ స్కోరర్. ఛేదనలో కివీస్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 135 పరుగులు చేసి నెగ్గింది.

ప్రీక్వార్టర్స్‌లో ప్రణయ్



చాంగ్జౌ: చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ అదరగొట్టాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తను ఏకంగా ఐదు మ్యాచ్ పాయింట్లను కాచుకుని కోకి వటనబే (జపాన్)పై 8-21, 21-16, 23-21 తేడాతో గెలిచాడు. తొలి గేమ్‌లో ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన ప్రణయ్.. రెండో గేమ్‌లో మాత్రం జోరు చూపి నిలిచాడు. ఇక నిర్ణాయక గేమ్‌లో 2-11తో వెనుకబడినా పుంజుకుని వరుసగా ఐదు పాయింట్లు సాధించాడు. అలాగే 15-20తో ఓటమి ఖాయమనిపించినా.. ప్రత్యర్థి ఐదు మ్యాచ్ పాయింట్లను వమ్ము చేసి 21-20తో లీడ్‌లోకి వచ్చి పట్టు కోల్పోలేదు. మరోవైపు లక్ష్యసేన్ 21-14, 22-24, 11-21 తేడాతో లి షి ఫెంగ్ (చైనా) చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సూర్య-ప్రముతేష్, రోహన్ కపూర్-రుత్విక జోడీలకు ఓటమి ఎదురైంది.

హర్మన్ శతకం

● **భారత్ 318/5**



చెస్టర్‌లీ స్ట్రీట్: హర్మన్‌ప్రీత్ కౌర్ (84 బంతుల్లో 14 ఫోర్లతో 102) సెంచరీతోపాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో భారత మహిళల జట్టు భారీ స్కోరు చేసింది. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో వన్డేలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎం చుకొన్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 318 పరుగుల భారీ స్కోరు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ (50), స్మృతీ మంధాన (45), హర్లీన్ డియోల్ (45) చక్కని సహకారం అందించారు. ఎకెల్ స్టోన్, లారెన్ ఫైలర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ కడపటి వార్తలందే సమయానికి 35 ఓవర్లలో 195/4 స్కోరు చేసింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (98) త్రుటిలో సెంచరీ చేజార్చుకొంది. ఓపెనర్లు అమీ జోన్స్ (4), బ్యూమాంట్ (2)ను క్రాంతి పెవిలియన్ చేర్చగా.. అర్ధ శతకం సాధించిన ఎమ్మా ల్యాంబ్ (68)ను శ్రీచరణి బౌల్డ్ చేసింది.

విహాన్ సెంచరీ

చెమ్స్‌ఫోర్డ్: ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో విహాన్ మల్హోత్రా (120) శతకంతో రాణించాడు. దీంతో భారత్ అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 279 పరుగులు చేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (80) అర్ధసెంచరీ సాధించాడు. ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి 93/0 స్కోరుతో ఉంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులు సాధించింది.

పాక్‌కు బంగ్లా మరో షాక్

ఢాకా: పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో బంగ్లాదేశ్ 8 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 20 ఓవర్లలో 133 పరుగులు చేసింది. జకెర్ అలీ (55), మెహదీ హసన్ (33) రాణించారు. సల్మాన్, దనియాల్, అబ్బాస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ 19.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. షోరిఫుల్‌కు మూడు.. తన్‌జీమ్, మెహదీలకు రెండేసి వికెట్లు దక్కాయి.

జాతీయ క్రీడా బిల్లు పరిధిలోకి బీసీసీఐ

బిన్నీకి లక్కీ చాన్స్?

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇంతకాలం స్వతంత్రంగా వ్యవహరిస్తూ వస్తోంది. ప్రభుత్వం నుంచి బీసీసీఐ ఎటువంటి నిధులూ తీసుకోదు.. క్రీడా శాఖ కూడా బోర్డు కార్యకలాపాల్లో ఎక్కడా జోక్యం చేసుకొన్న సందర్భాలు లేవు. అయితే, బుధవారం కొత్త జాతీయ కీడా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పాస్ అయితే బీసీసీఐకి కూడా కొత్త క్రీడా చట్టం వర్తిస్తుందని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నిధులపై బీసీసీఐ ఆధారపడకపోయినా.. జాతీయ క్రీడా బోర్డు నుంచి తప్పనిసరిగా గుర్తింపు పొందాల్సి ఉంటుందని తెలిపాయి. అయితే, మిగతా జాతీయ క్రీడా సంఘాల తరహాలోనే బీసీసీఐ స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. కానీ, ఏదైనా వివాదాలు తలెత్తితే మాత్రం ప్రతిపాదిత జాతీయ క్రీడా ట్రిబ్యునల్ పరిధిలోనే వాటిని పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుత బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీకి నూతన స్పోర్ట్స్ బిల్లు వరంగా మారే అవకాశం ఉంది. బోర్డు రాజ్యాంగం ప్రకారం 70 ఏళ్లకు మించిన వారు ఏ పదవిలోనూ కొనసాగకూడదు. అయితే, గత శనివారంతో బిన్నీకి 70 నిండాయి. కానీ, బిల్లు ముసాయిదాలో ఈ వయో నిబంధనను 70 నుంచి 75 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదన ఉంది.

మళ్లీ చాంపియన్స్ లీగ్ టీ20?

న్యూఢిల్లీ: పదేళ్ల క్రితం రద్దు చేసిన చాంపియన్స్ లీగ్ టీ20 టోర్నీకి మళ్లీ జీవంపోసే అవకాశాలున్నాయి. సింగపూర్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ టోర్నీపై కీలక నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. అంతా సవ్యంగా సాగితే వచ్చే ఏడాది లీగ్‌ను నిర్వహించే అవకాశం ఉంది. ఫ్రాంచైజీ జట్ల మధ్య జరిగే చాంపియన్స్ లీగ్‌ను 2015లో నిలిపేశారు. అయితే, ఈ పదేళ్లలో ఫ్రాంచైజీ క్రికెట్ ఎంతో వృద్ధి చెందింది.

'చెన్నై గ్రాండ్‌మాస్టర్స్' బరిలో అర్జున్

చెన్నై: వచ్చే నెల ఆరునుంచి జరిగే చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్, జీఎంలు విదిత్ గుజరాతి, అనిష్ గిరి హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. దేశంలో జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మక క్లాసికల్ చెస్ టోర్నీ అయిన చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో మొత్తం 20 మంది ప్లేయర్లు మాస్టర్స్, చాలెంజర్స్ కేటగిరీల్లో తలపడనున్నారు. మాస్టర్స్ విభాగం ప్రైజ్ మనీ రూ.1 కోటి కాగా, చాలెంజర్స్ కేటగిరీ ప్రైజ్ మనీ రూ.25 లక్షలు. చాలెంజర్స్ విభాగంలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక, ఆర్.వైశాలి పాల్గొననున్నారు.

బిజినెస్

అత్యంత ఆకర్షణీయ బ్రాండ్లలో టాటా, గూగుల్, ఇన్ఫోసిస్

రాండ్‌స్టడ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగులకు అత్యంత ఆకర్షణీయ కార్పొరేట్ బ్రాండ్ల జాబితాలో టాటా గ్రూప్, గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయని 'రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్ఈబీఆర్) 2025' నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉద్యోగులు వృత్తి-వ్యక్తిగత జీవిత సంతులనం, ఈక్విటీ, ఆకర్షణీయ వేతనం సహా అదనపు ప్రయోజనాలు వంటి ఎంప్లాయీ వాల్యూ ప్రపొజిషన్స్ (ఈవీపీ)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఆర్థిక సమృద్ధి, వృత్తిలో పురోగతి అవకాశాలు, పేరు ప్రతిష్ఠల విషయంలో టాటా గ్రూప్‌నకు అధిక స్కోర్ లభించిందని, తద్వారా లిస్ట్‌లో టాప్‌లో నిలిచిందని రాండ్‌స్టడ్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే గూగుల్ ఇండియా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకుని రెండో స్థానానికి చేరుకోగా.. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మూడో స్థానంలో ఉంది.

ఈ జాబితాలో సామ్‌సంగ్ ఇండియా, జేపీ మోర్గాన్ చేజ్ 4, 5 స్థానాలను దక్కించుకోగా.. ఐబీఎం, విప్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, డెల్, ఎస్‌బీఐ వరుసగా 6 నుంచి 10 స్థానాల్లో నిలిచాయంది. ఈ జాబితాలోని ఏకైక బహుళజాతి ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బీఐ అని రిపోర్టు వెల్లడించింది. భారత్‌లో 3,500 మందితో సహా 34 మార్కెట్లలో 1.70 లక్షల మంది నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రాండ్‌స్టడ్ ఈ నివేదికను రూపొందించింది. నివేదికలోని మరిన్ని విషయాలు..

- నేటి తరం ఉద్యోగులు యజమాని నుంచి వేతనానికి మించి చాలా ఆశిస్తున్నారు. వృత్తితో పాటు వ్యక్తిగత జీవిత వృద్ధికి మద్దతిచ్చే సమగ్ర, భవిష్యత్ దృష్టితో కూడిన కంపెనీల్లో పనిచేయాలనుకుంటున్నారు.
- సర్వేలో పాల్గొన్న వారిని ఆదర్శవంతమైన యాజమాన్యాలపై అభిప్రాయాన్ని కోరినపుడు, భారత కంపెనీల్లో వృత్తి-వ్యక్తిగత జీవిత సమతుల్యం, ఆకర్షణీయ వేతనం.. ప్రయోజనాల వంటి అంశాలు ఇంకా పరిష్కరించాల్సిన అంతరాలుగా కన్పించాయి.
- ఈ ఏడాది నివేదిక స్పష్టమైన మార్పును ప్రతిబింబిస్తోంది. నేటితరం ఉద్యోగులు సంప్రదాయ ఉద్యోగాలతో సంతృప్తి చెందడం లేదు. ఈక్విటీ, ఉద్దేశం, అర్థవంతమైన వృద్ధితో పాటు వృత్తి-వ్యక్తిగత జీవిత ఐక్యతను వారు కోరుకుంటున్నారని రాండ్‌స్టడ్ ఇండియా ఎండీ, సీఈఓ విశ్వనాథ్ పీఎస్ అన్నారు.

ఉద్యోగం మారుతాం..

కొత్త కొలువులోకి మారాలన్న అభిప్రాయం నిలకడగా పెరుగుతూ వస్తోందని, ముఖ్యంగా యువ నిపుణుల్లో ఇది ఎక్కువగా కన్పిస్తోందని ఈ ఏడాది సర్వేలో వెల్లడైనట్లు రాండ్‌స్టడ్ వెల్లడించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో 47 శాతం మంది భారత ఉద్యోగులు కొత్త ఉద్యోగంలోకి మారాలని ఆలోచించారని.. జెన్ జెడ్ (51 శాతం), మిలీనియల్స్ (50 శాతం)లో ఇది ఎక్కువగా ఉందని తెలిపింది. ఇది యాజమాన్యాలకు మేలుకొలుపు అని విశ్వనాథ్ అన్నారు. కేవలం ప్రోత్సాహకాలతో సరిపెట్టకుండా సంస్థలో విశ్వసనీయత, పారదర్శకత, ఉమ్మడి ప్రయోజనాలతో కూడిన సంస్కృతిని పెంచాలన్నారు. నైపుణ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారుతున్న తరుణంలో ప్రతిభావంతుల కోసం కంపెనీల మధ్య పోటీ మరింత పెరగనుందన్నారు.

టాప్-10 బ్రాండ్లు

ర్యాంక్	కంపెనీ
1	టాటా గ్రూప్
2	గూగుల్ ఇండియా
3	ఇన్ఫోసిస్
4	సామ్‌సంగ్ ఇండియా
5	జేపీ మోర్గాన్
6	ఐబీఎం
7	విప్రో
8	రిలయన్స్ ఇండస్ట్రీస్
9	డెల్ టెక్నాలజీస్
10	ఎస్‌బీఐ

వేగంగా పెరుగుతున్న ఏఐ వినియోగం

ఉద్యోగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వినియోగం శరవేగంగా పెరుగుతున్నదని నివేదిక తెలిపింది. భారత ఉద్యోగుల్లో 61 శాతం మంది ఏఐని తరుచుగా ఉపయోగిస్తున్నారు. అందులో మిలీనియల్సే అధికమని, గత ఏడాదితో పోలిస్తే ఏఐ వినియోగం 13 శాతం పెరిగిందని రిపోర్టు పేర్కొంది. తమ పనిపై ఏఐ గణనీయ ప్రభావం చూపిస్తోందని 38 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడినట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో కాస్ట్‌కో జీసీసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ కంపెనీ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయబోతోంది. అమెరికా కేంద్రంగా పనిచేసే ప్రముఖ రిటైల్ కంపెనీ 'కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్' ఈ జీసీసీని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఈ కేంద్రంలో తొలి దశలో వెయ్యి మంది వరకు పని చేసే అవకాశం ఉంది. ఈ జీసీసీ ద్వారా 'కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్' తన టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను నిర్వహించనుంది. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డోనాల్డ్, హెనెకిన్, వాన్‌గార్డ్ గ్రూప్ వంటి అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ జీసీసీలు ఏర్పాటు చేశాయి.

జీసీసీల కోసం 'ఎనేబ్లర్' సొల్యూషన్

కోవాసంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కోవాసంట్ టెక్నాలజీస్.. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) కోసం ఎనేబ్లర్ పేరుతో ప్రత్యేక టెక్నాలజీని విడుదల చేసింది. ఈ ఏఐ ఆధారిత టెక్నాలజీ సొల్యూషన్ జీసీసీల వ్యూహాత్మక విలువ లోటును పూడ్చడంలో ఎంతో సహాయకారిగా ఉంటుందని కంపెనీ తెలిపింది. 'నేటి జీసీసీలు ఆఫ్‌షోర్ సపోర్ట్ సిస్టమ్స్ స్థాయి నుంచి నవకల్పనలు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రాలుగా ఎదిగాయి. దీంతో జీసీసీల ప్రాథమిక నిర్వచనం కూడా మారిపోయింది. మా ఎనేబ్లర్ ఈ సవాళ్లను అధిగమించడంలో జీసీసీలకు సహాయపడుతుంది' అని ఎనేబ్లర్ సీఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు.

మార్చి నాటికి దాచేపల్లి ప్లాంట్ విస్తరణ పూర్తి

రూ.140 కోట్లతో సౌర విద్యుదుత్పత్తి కేంద్రం
సాగర్ సిమెంట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాగర్ సిమెంట్స్ కార్యకలాపాల విస్తరణ తుది దశకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కంపెనీ నిర్వహణలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 60 లక్షల టన్నులకు విస్తరిస్తున్నట్లు సాగర్ సిమెంట్స్ జెఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న ఆంధ్రా సిమెంట్స్‌ను సాగర్ సిమెంట్స్ 2023 ఫిబ్రవరిలో రూ.922 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు రూ.468 కోట్లతో ప్రస్తుత 30 లక్షల టన్నుల నుంచి 60 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. 'దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ పనులు అనుకున్న ప్రకారం జరుగుతున్నాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఈ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల టన్నులకు చేరుతుంది' అని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దాచేపల్లి ప్లాంట్ విస్తరణతో పాటు తన అనుబంధ సంస్థ సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ వార్షిక సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యాన్నీ ప్రస్తుత 15 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. వీటికి తోడు ఇంధనఖర్చులు తగ్గించుకునేందుకు రూ.140 కోట్ల అంచనాతో 6 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సౌర విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ బోర్డు ఆమోదం తెలిపినట్టు శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు.

మార్కెట్లో ఆద్యంతం ఊగిసలాటలే..

సెన్సెక్స్ 13 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 338 పాయింట్లు ఎగబాకినప్పటికీ, క్రమంగా లాభాలను చేజార్చుకున్న సూచీ చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్లు కోల్పోయి 25,060.90 వద్ద స్థిరపడింది. ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఇందుకు కారణమైంది. క్విక్ కామర్స్ సంస్థ ఎటర్నల్, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ నష్టాలను పరిమితం చేశాయి. ఆగస్టు 1 నుంచి ట్రంప్ అదనపు సుంకాలు అమలులోకి రానున్న నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరకపోవడం, ఎఫ్‌ఐఐలు లాభాలు స్వీకరిస్తుండటం మన మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. టాటా మోటార్స్ షేరు అత్యధికంగా 2.04 శాతం క్షీణించింది. ఎటర్నల్ షేరు మాత్రం 10.56 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

స్పామ్ కాల్స్ నుంచి రక్షణకు సరికొత్త విధానం: ట్రాయ్

న్యూఢిల్లీ: వాణిజ్యపరమైన సందేశాల విషయంలో వినియోగదారునికి పూర్తి అదుపు ఇస్తూ ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టనున్నట్టు టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ ప్రకటించింది. ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగంగా స్పామ్ కాల్స్‌ను నియంత్రించేందుకు ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో వినియోగదారులు అందిస్తున్న అనుమతి స్థానంలో డిజిటల్ అనుమతిని ప్రవేశపెడతారు. ట్రాయ్, ఆర్‌బీఐ ప్రతినిధులతో పాటు టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, ప్రధాన బ్యాంకుల ప్రతినిధులు ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉంటారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, నిర్వహణాపరమైన, చైతన్యకల్పన అంశాలను నాలుగు ప్రత్యేక కార్యాచరణ బృందాలు పర్యవేక్షిస్తాయి. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన రెగ్యులేటర్ల జాయింట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించారు. ఇందులో భాగంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాల లావాదేవీలు, సేవల కోసం ప్రత్యేకంగా 1600 నంబర్ సిరీస్‌ను కేటాయించనున్నారు. వివిధ రంగాల రెగ్యులేటర్లు ట్రాయ్‌కి అందించే సమాచారం ఆధారంగా దశల వారీగా ఈ నంబర్‌కు మారేందుకు అనుమతించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	505
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	114
వరంగల్	112	గుంటూరు	119
కరీంనగర్	112	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	109
కర్నూలు	112	నెల్లూరు	114
విశాఖపట్నం	97	అనంతపురం	114
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,290 ▲	92,850 ▲	1,28,000 ▲
విజయవాడ	1,02,600 ▲	96,500 ▲	1,18,000 ▲
విశాఖపట్నం	1,03,000 ▲	92,850 ▲	1,28,000 ▲
రాజమండ్రి	1,01,290 ▲	92,850 ▲	1,16,100 ▲
ప్రొద్దుటూరు	99,200 ▲	91,260 ▲	1,11,650 ▲
ముంబై	99,508 ▲	91,149 ▲	1,14,493 ▲

తొలిసారిగా లాభాల్లోకి పేటీఎం

న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తొలిసారిగా లాభాల్లోకి అడుగు పెట్టింది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.122.50 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. వ్యయాలను గణనీయంగా నియంత్రించడంతో పాటు పేమెంట్ ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడినట్టు కంపెనీ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.840 కోట్ల నికర నష్టం ప్రకటించింది. స్థూల లాభం సైతం రూ.72 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కంపెనీ మార్కెటింగ్, ప్రచార వ్యయాలను సగానికి సగం తగ్గించుకుంది. జూన్ త్రైమాసికంలో పేమెంట్ ప్రాసెసింగ్ మార్జిన్లు పెరిగిన కారణంగా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,917.50 కోట్లకు పెరిగింది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లాభంలో 41% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.89 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.63 కోట్లు)తో పోల్చితే లాభం 41 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 25 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.721 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో నిర్వహణాపరమైన సామర్థ్యాలను పెంచుకోవటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్ 2027-28 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అలాగే రూ.700 కోట్ల పెట్టుబడితో మధ్యప్రదేశ్‌లో నెలకొల్పుతున్న ప్లాంట్ 2027 మార్చి నాటికల్లా ప్రారంభం కానుందని పేర్కొంది.

మంత్రుల ఫోన్లూ ట్యాపింగ్

» అంతా సీఎం రేవంత్ కనుసన్నల్లోనే: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కీలక నేతలతోపాటు రాష్ట్ర మంత్రుల ఫోన్లనూ సీఎం రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంత్రుల ఫోన్ ట్యాపింగ్ విషయమై సౌత్‌ఫస్ట్ పత్రిక నిజాలు బయట పెట్టిందని ఆయన చెప్పారు. సీఎం తానే తప్పు చేస్తూ బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ చేశారని బుకాయిస్తున్నారని వ్యాఖ్యానించారు. సీఎం కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయకుంటే ఇద్దరు మంత్రులు సరదాగా ఫోన్‌లో మాట్లాడుకున్న విషయం ఆయనకెలా తెలిసిందని ప్రశ్నించారు. సీఎం తన వద్దకు ఒక మంత్రిని పిలిపించుకుని ఆయన సంభాషణపై క్లాస్ తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీ అండతో పోలీసులతో కాకుండా ప్రైవేటు ఏజెన్సీలతో పెగాసస్ సాఫ్ట్‌వేర్ వాడుతూ ముఖ్యుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా రాష్ట్రంలోని బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేస్తోందని, ఇందులో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా కూడా భాగస్వాములేనని అనుమానం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్న ప్రవీణ్ కుమార్.. ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారో హైకోర్టుకు సీఎం రేవంత్ సీల్డ్ కవర్‌లో జాబితా సమర్పించాలని చెప్పారు. హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, న్యాయమూర్తి, ప్రతిపక్ష నేతతో ఓ కమిటీని వేయాలన్నారు.

రేవంత్.. హోంగార్డులకు జీతాలివ్వు:హరీశ్

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): "పథకాల్లో కోతలు.. మాటల్లో గొప్పలు.. ఢిల్లీకి వెళ్లి జోకుడు కాదు.. నెలాఖరు వస్తోంది.. హోంగార్డులకు జీతాలివ్వు" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 22వ తారీఖు వచ్చినా ఇప్పటి వరకు జీతాలు రాక భద్రాది కొత్తగూడెం, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జగిత్యాల, వరంగల్, రామగుండం, వికారాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్న జీతాలపై జీవిస్తున్న హోంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిగా ఉన్న హోంశాఖలోనే ఇలాంటి దుర్భర పరిస్థితులు ఉంటే ఎలా..? అని ప్రశ్నించారు. వెంటనే హోంగార్డులకు వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్, డిక్లరేషన్ అంతా బోగస్:కేటీఆర్

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు, బీసీ డిక్లరేషన్ అంతా బోగస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మంగళవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో పార్టీ బీసీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ తెచ్చే చట్టం ఆమోదం పొందదని తెలిసినా, ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీలను మోసం చేయాలన్న దురాలోచనతో ఇప్పుడు కోర్టులు, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులు, బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను పంపిణీ చేసిందని.. రేవంత్ సర్కారు దురుద్దేశంతోనే వాటిని నిలిపివేసిందని కేటీఆర్ మండిపడ్డారు. గురువారం తన జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురికి ఆయన కేసీఆర్ కిట్లను అందజేశారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: వెస్లీ

రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మంగళవారం డిమాండ్ చేశారు. గీత కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం హామీలు ఇస్తుందే తప్ప నిధులు విడుదల చేయడం లేదని ఆయన విమర్శించారు. విధి నిర్వహణలో చాలా మంది గీత కార్మికులు ప్రమాదాల బారిన పడ్డారని తెలిపారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.12.96 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తక్షణమే సీఎం స్పందించి గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులు విడుదల చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలి

» ఆగస్టు మొదటి వారంలోపు పింఛన్ ఇవ్వాలి: మందకృష్ణ

పంజాగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. చేయూత పింఛన్ దారులకు ఇచ్చే పింఛన్ వెంటనే పెంచి ఇవ్వాలి. లేదంటే సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి. ఏపీలోనూ సీఎం చంద్రబాబు తీవ్ర వైకల్యం గల దివ్యాంగులకు నెలకు రూ.15 వేలు ఇవ్వాలి" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆగస్టు మొదటి వారంలోపు దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 13న ఎల్బీ స్టేడియంలో వేలాది మంది దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులతో కలిసి గర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు.



నేను చెబితేనే ఫైళ్లు పంపాలి!

» ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఓ కలెక్టర్ హుకుం

» స్థలాలకు ఎన్‌వోసీ జారీ చేసే ఫైళ్లే ఎక్కువ

» ముందుగా కలెక్టర్‌తో మాట్లాడుకోవాలని.. యజమానులకు చెబుతున్న తహసీల్దార్లు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఏదైనా పనికి సంబంధించిన ఫైలుకు.. తొలుత తహసీల్దార్, ఆపై ఆర్డీవో స్థాయిలో ఆమోదం తెలిపితే ఆ తరువాత జిల్లా కలెక్టర్ స్థాయిలో దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. కానీ, రాష్ట్ర పాలనకు గుండెకాయ లాంటి ప్రాంతంలో పని చేస్తున్న ఓ జిల్లా కలెక్టర్ మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. తహసీల్దార్లు, ఆర్డీవోల నుంచి వచ్చే ఫైళ్లను పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సింది పోయి.. తాను చెబితేనే ఫైళ్లను తన వద్దకు పంపించాలని హుకుం జారీ చేస్తున్నారు. అలా కాకుండా వారే ఫైళ్లను పంపిస్తే మాత్రం చర్యలు తీసుకుంటానని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకుండా రొటీన్‌గా ఫైలు పంపితే.. ఆ కలెక్టర్ వద్ద ఉండే సీసీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తీవ్రంగా బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. కలెక్టర్ కంటే కూడా సీసీయే ఎక్కువగా బెదిరింపులకు పాల్పడుతున్నారని కిందిస్థాయి అధికారులు ఆరోపిస్తున్నారు. గతంలో పలుచోట్ల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఈ కలెక్టర్.. మరోసారి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. ఈ కలెక్టర్ పరిధిలో ఆదాయ మార్గాలకు అవకాశం ఉన్న ఫైళ్లు, స్థలాలకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) జారీ చేసేవే ఎక్కువ ఉంటాయి. అవి కూడా 200 నుంచి 500 గజాల లోపు ఉన్న స్థలాలకు సంబంధించిన ఫైళ్లే ఎక్కువగా వస్తుంటాయి. ఇలాంటి వాటిపై నేరుగా ఫైళ్లు పంపితే కలెక్టర్ ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని క్షేత్ర స్థాయి అధికారులు వాపోతున్నారు. ఏదైనా సమాచారం ఉంటే తొలుత తన దృష్టికి తేవాలని, ఆ ఫైల్ పెట్టాలా, వద్దా అనే విషయంపై తాను స్పష్టత ఇస్తానని, దానినే అందరూ అనుసరించాలని కలెక్టర్ చెబుతున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో అనుమతుల కోసం తహసీల్దార్లను కలుస్తున్న స్థల యజమానులకు.. 'ముందుగా కలెక్టర్‌తో మాట్లాడుకొని అక్కడి నుంచి మాకు చెప్పిస్తేనే ఫైలు పంపిస్తాం' అని సంబంధిత అధికారులు చెబుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండా అత్యంత కీలకమైన ఆ జిల్లాలో పౌరసరఫరాల వ్యవహారాలు రెవెన్యూ పరిధిలో లేవు. ఈ సబ్జెక్టును చీఫ్ రేషనింగ్ అధికారి పర్యవేక్షిస్తుంటారు. అయితే ఆ అధికారాలనూ మనమే ఎందుకు తీసుకోకూడదంటూ ఆర్డీవోలపై కలెక్టర్ ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ఇందిర 'ఆంధ్రజ్యోతి' ద్వారా పలు సందర్భాల్లో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ కూడా ప్రారంభించామని మంత్రి వెల్లడించడంతో సభలో హర్షాతిరేకాలు మిన్నంటాయి. విగ్రహ ఏర్పాటు కార్యాచరణలో భాగంగా హెచ్‌ఎండీఏకు లేఖ కూడా రాసినట్లు జూపల్లి వెల్లడించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్ర భారతిలో దాశరథి శత జయంతి ఉత్సవ సభ జరిగింది. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి, పొన్నం పాల్గొని తొలుత దాశరథి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయనకు శాలువా, జ్ఞాపికతో సన్మానించి, రూ.1,0116 నగదును అందజేశారు. అనంతరం జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణలోని పన్నెండు వేల పైచిలుకు గ్రామ పంచాయతీల్లో దాశరథి సాహిత్యాన్ని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. దాశరథి పేరు శాశ్వతంగా నిలిచేలా ఇంకా పలు కార్యక్రమాలు చేపట్టేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయంలో మేధావులు, కవులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా ఏడాదికి తనకు వచ్చే రూ.5 కోట్ల నిధుల్లో రూ.2 కోట్లను గ్రంథాలయాలు, క్రీడాభివృద్ధికి ఖర్చు పెడుతున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... పార్లమెంట్ వేదికగా తెలంగాణ సాధన కోసం పోరాడుతున్న రోజుల్లో దాశరథి కవిత్వం తనకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్ సాహిత్య కృషిని పొన్నం ప్రశంసించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దాశరథి అవార్డు ఎంపిక కమిటీ సభ్యులు కవి యాకూబ్, ప్రజా కవి జయరాజ్, లోక కవి అందెశ్రీ, దాశరథి కుమార్తె ఇందిర, కుమారుడు లక్ష్మణ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ దాశరథి పురస్కారం అందుకోవడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఈ అవార్డు కవిగా తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన దాశరథి సాహిత్య పరిమళాలు వ్యాస సంకలనాన్ని, అలాగే బుధవారం నుంచి 29వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న దాశరథి సాహిత్య సప్తాహం ఆహ్వాన పత్రికను వక్తలు ఆవిష్కరించారు.



బీజేపీది బీసీ వ్యతిరేక నైజం

ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వ్యాఖ్యలపై పొన్నం, కాంగ్రెస్ నేతల ధ్వజం

» బీసీలకు రిజర్వేషన్ల పెంపు తమిళనాడులో సాధ్యమైనప్పుడు ఇక్కడెందుకు కాదు: పొన్నం

హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదనే బీజేపీ వ్యాఖ్యలతో ఆ పార్టీ బీసీ వ్యతిరేక నైజం బయటపడిందని పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శించారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే రిజర్వేషన్లు ఎందుకు అమలు కావో చూస్తామని సవాల్ విసురుతున్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. గతంలో తమిళనాడులో రిజర్వేషన్ల పెంపుదల సాధ్యమైనపుడు తెలంగాణలో ఎందుకు కాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సర్వే అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లు అసెంబ్లీ, గవర్నర్ ఆమోదం పొంది.. ఢిల్లీలో ఉందని, దానిపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, బరాబర్ అధికారికంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. బీసీ వర్గాలు, కుల సంఘాలు బీజేపీ నిజస్వరూపాన్ని గమనించాలని పొన్నం కోరారు.

సొంత పార్టీని ఒప్పించలేకే..: ఆది

మైనారిటీ రిజర్వేషన్లను అడ్డంపెట్టి బీసీలకు అన్యాయం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కేంద్రాన్ని ఒప్పించాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ ఎంపీలపై ఉందన్నారు. రామచందర్‌రావు సొంత పార్టీని ఒప్పించడం చేతకాక కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని ప్రశ్నించే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. బీజేపీ దొంగ నాటకాన్ని బీసీలు గమనించాలని, ఆ పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్‌తో పాటు ఆ పార్టీ బీసీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

రామచందర్‌రావు బీసీ వ్యతిరేకి: ఐలయ్య





బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు రాష్ట్రంలో మొసలికన్నీరు కారుస్తూ ఢిల్లీ వెళ్లి బీసీ వ్యతిరేక నైజాన్ని బయటపెట్టుకున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. రాష్ట్రం నుంచి బీజేపీ తరపున 8 మంది ఎంపీలు గెలిచి రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోయారని, బీసీ బిల్లును కేంద్రానికి పంపితే పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ఎంపీలు చేతకాని దద్దమ్మలుగా మారిపోయారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంతో ఆర్డినెన్స్‌ను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నాయన్నారు.

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర: చనగాని

దేశంలో రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని, ఇందులో భాగంగానే కేంద్రం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వదని రామచందర్‌రావుతో చెప్పించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. గత మూడు నెలలుగా కేంద్ర క్యాబినెట్‌లో 7 బిల్లులకు ఆమోదం తెలిపారని, తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లు ఎందుకు చర్చకు రాలేదని ప్రశ్నించారు. రామచందర్‌రావు ఓబీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీ వైఖరి ఏమిటో 48 గంటల్లో తేల్చాలి: జాజుల

కవాడిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బీసీలపై విషం కక్కారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బీసీ సంఘాల నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో ఈ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు కూడా మద్దతు ఇచ్చారని, ఇప్పుడు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వ్యతిరేకించడం దేనికి సంకేతమని జాజుల ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రి, అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ 48 గంటల్లో తన వైఖరిని స్పష్టం చేయకపోతే ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. బీసీ సంఘాల ఐక్య వేదిక చైర్మన్ కుందారం గణేషాచారి, బీసీ సంఘం నాయకులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి: శంకర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన హామీని అమలు చేయలేక బీజేపీపై నిందలు వేస్తోందన్నారు.

నీటిపారుదల శాఖలో 33 ఏళ్ల తర్వాత శాశ్వత పదోన్నతులు

ఐదుగురికి ఈఎన్‌సీలుగా, 14 మందికి సీఈలుగా, 127 మందికి డీఈఈలుగా ప్రమోషన్

ఫలించిన మంత్రి ఉత్తమ్ చొరవ.. త్వరలో ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో శాశ్వత ప్రాతిపదికన అధికారులకు ప్రమోషన్లు ఇవ్వడానికి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) ఆమోదం తెలిపింది. 33 ఏళ్ల అనంతరం శాశ్వత పదోన్నతుల ప్రక్రియను చేపట్టడం విశేషం. మంగళవారం సచివాలయంలో రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) ఇన్‌ఛార్జ్ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా నేతృత్వంలో డీపీసీ సమావేశమయింది. చీఫ్ ఇంజనీర్(సీఈ) నుంచి ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్‌చీఫ్)లుగా 5 మందికి, సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ)లుగా 14 మందికి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ)లుగా 127 మందికి పదోన్నతులు కల్పించడానికి ఈ కమిటీ ఆమోదం తెలిపింది. త్వరలోనే పదోన్నతులు కల్పించి, పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉద్యోగ విరమణ చేసినవారి పదవీకాలం పొడిగింపు కారణంగా తరువాత స్థానాల్లో ఉన్నవారికి ఇంతవరకు పదోన్నతులు రాలేదు. సర్వీసు వివాదాల కారణంగా చాలా మందికి తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు అందాయి. తాజాగా సర్వీసు వివాదాలు సమసిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అభియోగాలు ఎదుర్కొంటున్న వారికి విజిలెన్స్ కమిషన్ సిఫారసులతో షోకాజు నోటీసులు జారీ చేయడంతో పదోన్నతులకు లైన్ క్లియర్ అయింది. ఇవికాకుండా మరో వారం రోజుల్లోపు 45దాకా ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టులను, 70 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రమోషన్ల ప్రక్రియ సాధ్యమయిందని ఉద్యోగవర్గాలు భావిస్తున్నాయి. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని ఆయన ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు. సర్వీసు వివాదంపై న్యాయస్థానంలో నడుస్తున్న కేసు విషయంపై అడ్వకేట్ జనరల్(ఏజీ)తో చర్చించారు. కోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో పదోన్నతులకు మార్గం సుగమమయింది.

నేడు విద్యాసంస్థల బంద్

విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం విద్యా సంస్థల బంద్ పాటించాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ తదితర సంఘాల బాధ్యులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్, ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని.. గురుకులాల సమయాన్ని శాస్త్రీయంగా మార్చాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విద్యా శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. కాగా ఈ బంద్ పిలుపు నేపథ్యంలో బుధవారం తరగతులు ఉండవని.. పిల్లలను పంపించవద్దని పేర్కొంటూ ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు మంగళవారం సాయంత్రమే తల్లిదండ్రులకు సందేశాలు పంపాయి. ఈఅంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం, కొన్ని స్కూళ్లకు సంబంధించి సందేశాలేవీ రాకపోవడంతో బుధవారం పిల్లలను బడికి, కాలేజీకి పంపాలా? వద్దా అని తల్లిదండ్రులు తర్జనభర్జనలో పడ్డారు.

రాష్ట్ర సర్కారు వైఫల్యాలను ఎండగట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ఎండగట్టాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చిన రాంచందర్‌రావు మంగళవారం జేపీ నడ్డాను పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. ఆయన వెంట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, కేంద్ర పథకాల అమలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని, పార్టీ నేతలకు, కార్యకర్తలకు పార్టీ జాతీయ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని జేపీ నడ్డా.. రాంచందర్‌రావుకు భరోసానిచ్చారు. కాగా, ఈ భేటీలో రాజాసింగ్ రాజీనామా అంశం, ఈటల రాజేందర్, బండి సంజయ్ పరస్పర విమర్శల అంశాలు చర్చకు వచ్చినట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జేపీ నడ్డాతో భేటీ అనంతరం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, బండి సంజయ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్‌లతోనూ రాంచందర్‌రావు విడివిడిగా భేటీ అయ్యారు. అమిత్ షాతో రాంచందర్‌రావు భేటీ ఖరారైనా ఇతరత్రా కారణాల వల్ల భేటీ కాలేకపోయారు.

ఊబకాయాన్ని పసిగట్టే జన్యు పరీక్ష

» పెద్దయ్యాక స్థూలకాయం బారిన పడే ప్రమాదం ఉన్నదీ లేనిదీ చిన్నప్పుడే చెప్పే పాలీజెనిక్ రిస్క్ స్కోర్

» జీవనశైలి మార్పులతో ఆ ముప్పును తప్పించుకునే వీలు

» మన భారతీయుల జన్యువులపై సీసీఎంబీ పరిశోధనలు

హైదరాబాద్ సిటీ, జూలై 22: పెద్దయ్యాక ఊబకాయం వచ్చే ముప్పు ఉన్నదీ లేనిదీ గుర్తించే 'పాలీజెనిక్ రిస్క్ స్కోర్ (పీఆర్ఎస్)' అనే జన్యుపరీక్షను అభివృద్ధి చేసే క్రతువులో.. మన హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) పరిశోధకులు పాలుపంచుకున్నారు. జన్యుపరంగా ఒక వ్యక్తి ఊబకాయం బారిన పడే ప్రమాదం ఉంటే.. చిన్నవయసులోనే ఆ ముప్పును ఈ పరీక్ష ద్వారా గుర్తించి, వారు ఆ సమస్య నుంచి తప్పించుకునే విధంగా జీవనశైలి మార్పులతో కూడిన వ్యూహాలు రూపొందించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. అంతర్జాతీయ ఒబేసిటీ ఫెడరేషన్ అంచనాల ప్రకారం 2035 నాటికి ప్రపంచంలో సగానికి పైగా వ్యక్తులు అధిక బరువు సమస్యతో బాధపడనున్నారు. వారిని ఊబకాయం బారిన పడకుండా అడ్డుకోగలిగితే? అనే ఆలోచనతో.. అంతర్జాతీయంగా 500కు పైగా సంస్థలకు చెందిన 600 మందికి పైగా పరిశోధకులు.. జెయింట్ కన్సార్షియం, కన్స్యూమర్ డీఎన్ఏ టెస్టింగ్ సంస్థ 23 అండ్ మీ సహా పలు సంస్థల నుంచి 50 లక్షల మందికిపైగా జన్యు పరమైన వివరాలను సేకరించి తమ పరిశోధనలను కొనసాగించారు. ఈ క్రమంలోనే మన సీసీఎంబీ పరిశోధకులు భారతీయుల జన్యు సమాచారంపై పరిశోధనలు చేశారు. ఆ సమాచారం మొత్తాన్నీ క్రోడీకరించి పీఆర్ఎస్ టెస్టును అభివృద్ధి చేశారు. గతంలో ఉన్న పరీక్షలన్నిటికంటే ఇది ప్రభావవంతమైన పరీక్ష అని యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగన్‌లో ఎన్ఎన్ఎఫ్ సెంటర్ ఫర్ బేసిక్ మెటబాలిక్ రిసెర్చ్‌కు (సీబీఎంఆర్) చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్మిత్ తెలిపారు.

యూరోపియన్లతో పోలిస్తే మనం భిన్నం...

యూరోపియన్ దేశాలతో పోలిస్తే.. భారతీయులకు సంబంధించి నాన్ కమ్యూనికబల్ (మధుమేహం, అధికరక్తపోటు వంటి అసాంక్రమిక) వ్యాధులపరంగా జన్యు నిర్మాణం వైవిధ్యంగా ఉంటుందని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ గిరిరాజ్ రతన్ చందక్ తెలిపారు. మనదేశంతో పాటు దక్షిణాసియా దేశాలలో ఊబకాయం అతి పెద్ద సమస్యగా పరిణమిస్తోందని ఆయన చెప్పారు. యూరోపియన్ దేశాలకు చెందినవారితోతో పోలిస్తే మన దేశంలో ఊబకాయం వైవిధ్యంగా ఉంటుందని.. భారతీయులలో అది ఎక్కువగా పొట్ట కేంద్రంగా ఉంటుందని వివరించారు. తమ అధ్యయనంలో భాగంగా భారతీయుల నమూనాల నుంచి సేకరించిన సమాచారం దక్షిణాసియా ప్రజలకు దగ్గరగా ఉన్నట్లు తెలిపారు.



పూర్తి నివారణ సాధ్యమేనా?

ఓ వ్యక్తి జన్యువుల ఆధారంగా ఊబకాయపు ప్రమాదాన్ని అంచనా వేసి.. పోషకాహారం తీసుకోవడం, కసరత్తులు చేయడం, తగినంత నిద్రపోవడం వంటి జీవనశైలి మార్పులను చేసుకోవడం ద్వారా ఆ ముప్పును అడ్డుకోవచ్చని సీసీఎంబీ పరిశోధకులు తెలిపారు. కానీ.. అలా తగ్గినవారు.. వ్యాయామాలు మానేసి, ఇష్టం వచ్చినట్టు తింటూ, కంటి నిండా నిద్ర పోకపోతే మళ్లీ వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు.

మిథున్‌రెడ్డికి ఇంటి నుంచి భోజనం

» ప్రత్యేక సెల్, సహాయకుడు, టేబుల్, పెన్ను, పేపర్లు, పత్రికలు, టీవీ, కూలర్, కమ్మోడ్, మందులు ఏర్పాటు చేయాలి

» తీర్పును వెలువరించిన ఏసీబీ కోర్టు

విజయవాడ/రాజమహేంద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి ఇంటి నుంచి అల్పాహారం, భోజనాన్ని తీసుకెళ్లడానికి విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ములాఖత్‌ల సమయంలో న్యాయవాదులు, కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు ప్రత్యేక గదిని కేటాయించాలన్న అభ్యర్థనను కొట్టేసింది. మిథున్‌రెడ్డి జైల్లో తనకు కల్పించాల్సిన సదుపాయాలపై పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంచం, కుర్చీ, టేబుల్, టీవీ, సహాయకుడు (అటెండర్), ప్యూరిఫైడ్ మంచినీళ్ల సీసాలు, ముక్కులో వేసుకునే చుక్కల మందు, యోగా మ్యాట్, మల్టీవిటమిన్ మందులు, చేపనూనె మందులు, ప్రొటీన్ పౌడర్, దిండు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. రెండు పూటలా ఇంటి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం అనుమతించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కేంద్ర కారాగారం నుంచి డీఎస్పీ వెంకటేశ్వరరావు కోర్టుకు హాజరై వాదనలను వినిపించారు. జైలు మాన్యువల్ ప్రకారమే తాము మిథున్‌రెడ్డికి సదుపాయాలు కల్పించామన్నారు. మిథున్‌రెడ్డి తరఫున న్యాయవాదులు, జైలు అధికారి వాదనలు విన్న అనంతరం మంగళవారం రాత్రి న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును వెలువరించారు. మిథున్‌రెడ్డికి ప్రత్యేక సెల్, టేబుల్, కుర్చీ, టేబుల్ మ్యాట్, పెన్, పేపర్లు, పత్రికలు, సహాయకుడిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటి నుంచి ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం తీసుకెళ్లడానికి అనుమతి ఇచ్చారు. ఈ మూడింటినీ ఒకేసారి తీసుకెళ్లాలని, తీసుకెళ్లిన వ్యక్తి జైలు అధికారులకు పూచీకత్తు రాసి ఇవ్వాలని స్పష్టం చేశారు. సెల్‌లో టీవీ లేకపోతే పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు దానిని ఏర్పాటు చేయాలని, మందులు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెస్ట్రన్ కమోడ్‌ను ఏర్పాటు చేయాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చారు.



నోవా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధుల బృందం మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. తెలంగాణ, ఏపీ, త్రిపుర రాష్ట్రాల్లో ఆదివాసీ ప్రాంతాలకు ఆరోగ్యసేవలు, విద్యా అవకాశాలను విస్తరించేందుకు నోవా సంస్థ తీసుకుంటున్న చర్యల గురించి గవర్నర్‌కు వివరాలు అందజేశారు. ప్రతినిధుల బృందంలో నోవా కృష్ణారావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ ఎం. విజయ నిర్మల, సుమేధ్ యాగ్ని, అఖిల ఉన్నారు.

బెట్టింగ్ యాప్ కేసులో గడువు కోరిన రాణా

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో ఈడీ నోటీసులు అందుకున్న సినీ నటుడు దగ్గుబాటి రాణా, తనకు మరింత గడువు కావాలని ఈడీ అధికారులను కోరారు. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లో ఉన్నందున మరో తేదీని కేటాయిస్తే విచారణకు హాజరవుతానని రాణా లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. వాస్తవానికి రాణా ఈనెల 23న ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ కేసులో ఇప్పటికే సినీ నటుడు ప్రకాష్ రాజ్ ఈనెల 30న, హీరో విజయ్ దేవరకొండ వచ్చేనెల 6న, మంచు లక్ష్మి వచ్చేనెల 13న విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు సంబంధించి ఈడీ ఇప్పటికే 29మందిపై కేసు నమోదు చేసింది.

రియో కార్నివాల్ తరహాలో రాష్ట్రంలోనూ అంతర్జాతీయ వేడుక

- ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందించండి
- అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశం

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రియో కార్నివాల్ తరహాలో.. తెలంగాణలో అంతర్జాతీయ కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంగళవారం సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి తదితర అధికారులతో సమావేశమై రాష్ట్రంలో పర్యాటక ప్రగతి కార్యాచరణపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- రెవెన్యూ దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వద్దు: పొంగులేటి

హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం విషయంలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేసేందుకు ప్రభుత్వం వెనకాడదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో కొంత మంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి రెవెన్యూ మంత్రి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వే నంబరు మిస్సింగ్, అసైన్డ్ భూముల వివాదాలు, వారసత్వ హక్కులకు సంబంధించిన దరఖాస్తులు 6 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు. ఆగస్టు 15లోపు వీటన్నిన్ని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లపై దృష్టి పెట్టండి..: పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సమస్యలు తలెత్తకుండా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఇసుక.. లబ్ధిదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్ల మీదనే ఉందన్నారు. ఇంటి నిర్మాణం కోసం మట్టిని తరలించే లబ్ధిదారుల మీద పోలీసులు కేసులు పెట్టడం సరికాదన్నారు. జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలు ఉంటే ఇళ్లు కేటాయించాలని చెప్పారు.

సేఫ్ స్టే' ప్రాజెక్టును అన్ని కమిషనరేట్లలో అమలు చేయాలి: డీజీపీ

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు సంబంధించి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమలు చేస్తున్న సేఫ్ స్టే ప్రాజెక్టును.. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో కూడా ప్రారంభించాలని పోలీసు ఉన్నతాధికారులను డీజీపీ జితేందర్ ఆదేశించారు. నగరంలో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై ఆయా కమిషనరేట్ల ఉన్నతాధికారులతో డీజీపీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ పోలీసులు చేపట్టిన సేఫ్ స్టే ప్రాజెక్టులో భాగంగా.. వసతి గృహాల్లో ఉంటున్న మహిళల భద్రతకు భరోసా కల్పించారని, ఇదే విధానాన్ని ఇతర కమిషనరేట్లలో తక్షణమే అమలు చేయాలన్నారు. భరోసా కేంద్రాలు, కుటుంబ సలహా కేంద్రాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ టీమ్స్ కార్యక్రమాలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారు సిన్హా, డీఐజీ రెమా రాజేశ్వరి, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, సైబరాబాద్ కమిషనర్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సంచాలకులు నవీన్ నికోలస్

టెట్‌లో 34 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జూన్-2025 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. పాఠశాల విద్య సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సంచాలకులు నవీన్ నికోలస్ ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18-30 తేదీల మధ్య మొత్తం 16 సెషన్లలో ఈ పరీక్ష జరిగింది. పేపర్ 1, 2 కలిపి మొత్తం 90,205 మంది హాజరవ్వగా 30,649 (33.98%) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-1లో మొత్తం 47,224 మంది హాజరవగా 29,043 (61.50%) అర్హత సాధించారు. వీరిలో 511 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. అలాగే పేపర్-2 గణితశాస్త్రం, సైన్స్ రాసిన 48,998 మందిలో 17,574 (35.87%) ఉత్తీర్ణత సాధించగా వారిలో 988 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. సాంఘికశాస్త్రం పరీక్షకు మొత్తం 41,207 మంది హాజరవగా 13,075 (31.73%) మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 511 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. పేపర్-1 మొత్తం ఏడు భాషల్లో నిర్వహించగా అత్యధికంగా తెలుగు మాధ్యమంలో 58,977 మంది, ఉర్దూలో 3,348 మంది, హిందీలో 743 మంది, మరాఠీలో 103 మంది, కన్నడలో 79 మంది, బెంగాలీలో ఆరుగురు, తమిళ మాధ్యమంలో ఐదుగురు పరీక్ష రాశారు.

గతేడాదికంటే 18% ఎక్కువ యూరియా

- అక్రమ మళ్లింపుపై దృష్టి పెట్టాలి
- రాష్ట్ర సహకారశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

హైదరాబాద్, జులై 22 (ఆంధ్రజ్యోతి): గతేడాదితో పోలిస్తే ఈ వానాకాలం సీజన్‌లో 18 శాతం ఎక్కువ యూరియాను సరఫరా చేసినట్లు రాష్ట్ర సహకారశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపితో కలిసి మంగళవారం వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని యూనిట్లు యూరియాను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మళ్లించే అవకాశం ఉందని, అలాంటి యూనిట్లను తనిఖీ చేయాలని క్షేత్రస్థాయి అధికారులను సురేంద్రమోహన్ ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ లేదా మళ్లింపులకు సంబంధించి ఏ సమాచారం ఉన్నా రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ (8977741771)కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా చూడాలని, ఇందుకోసం వ్యవసాయ, సహకార శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఉదయం 8 గంటలకే తెరిచి ఉంచాలన్నారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియా పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా చూసేందుకు, వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ బుధవారం ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిపారు.

హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో భారత్ ర్యాంక్ మెరుగు

న్యూఢిల్లీ, జూలై 22: హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో భారత్ తన ర్యాంకును మెరుగుపరుచుకుంది. మంగళవారం విడుదలైన హెన్లీ పాస్‌పోర్ట్ సూచికలో భారతదేశ పాస్‌పోర్టు ఎనిమిది స్థానాలను మెరుగుపరుచుకొని 77వ స్థానంలో నిలిచింది. గతేడాది 85వ స్థానంలో ఉంది. హెన్లీ పాస్‌పోర్ట్ సూచిక ప్రపంచ దేశాల పాస్‌పోర్టుల బలాలను ర్యాంకింగ్ రూపంలో ప్రకటిస్తుంది. ఈ సూచికలో ఒక దేశ పౌరులు వీసా లేకుండా ఎన్ని దేశాలకు ప్రయాణించగలరో నిర్ధారిస్తారు. భారతదేశ పాస్‌పోర్టుతో పౌరులు 59 దేశాలకు వీసా లేకుండా లేదా వీసా ఆన్ అరైవల్ ద్వారా వెళ్లిరావచ్చు. మరోవైపు సింగపూర్ పాస్‌పోర్టు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా నిలిచింది. సింగపూర్ పాస్‌పోర్ట్ దారులు వీసా లేకుండా 193 దేశాలు ప్రయాణించవచ్చు.

'ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు'పై భేటీ

రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గం.. నిర్మాణానికి సర్వే చేయాలన్న కేంద్రం

- రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారుల కీలక సమావేశం
- రెండు, మూడు రోజుల్లో ప్రాథమిక సర్వే
- ఆగస్టు మొదటి వారానికల్లా సమగ్ర సర్వే
- ఆ తర్వాత ముఖ్యమంత్రికి నివేదిక
- ఆర్‌ఆర్‌ఆర్ కోసం 100 మీటర్ల సేకరించే భూమికి అదనంగా 20-25 మీటర్ల సేకరణ!

'ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు' అని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గం నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఇదే విషయాన్ని రైల్వే అధికారులకు తెలిపింది. ఈ విషయాన్ని 'ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారమే వెల్లడించిన సంగతి తెలిసిందే. కేంద్రం నిర్ణయం గురించి రైల్వే అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేశారు. సచివాలయంలో వెంటనే ఈ అంశంపై రైల్వే శాఖ ముఖ్య అధికారులు, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో పాటు రెండు శాఖలకు సంబంధించిన కన్సల్టెన్సీల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా 3-4 కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని ప్రతిపాదించిన రైలు మార్గాన్ని.. రోడ్డు పక్కనే నిర్మించాలంటూ కేంద్రం నిర్ణయించడంపై చర్చ జరిపారు. ప్రస్తుతం రింగు రైలు మార్గానికి ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్) పూర్తయింది. ఈ క్రమంలో ఆర్‌ఆర్‌ఆర్‌కు పక్కనే రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలు, ప్రతికూల పరిస్థితులపై లోతుగా చర్చించారు. ఇప్పటికే రింగు రోడ్డు ఉత్తరభాగం కోసం భూ సేకరణ దాదాపు చివరిదశకు చేరుకుంది. దాంతో రైలు మార్గం నిర్మాణానికి ఎంత భూమి అవసరమవుతుంది? ఇంకా అదనంగా ఎంత సేకరించాలి? అనేదానిపై చర్చించారు. రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి వంకలు, మలుపులు, ఎత్తు, పల్లాలు తదితర అంశాలపై కూడా చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు మార్గం నిర్మించేందుకు అవసరమైన సర్వేను చేపట్టాలని నిర్ణయించారు. రెండు, మూడు రోజుల్లోనే ప్రాథమిక సర్వేను పూర్తిచేయాలని, ఆ వివరాలతో సమగ్ర సర్వేను ఆగస్టు మొదటి వారంలోపు పూర్తిచేయాలని నిర్ణయించుకున్నారు. మొదటి ప్రాథమిక సర్వే వివరాలు వచ్చాక ఒక సమావేశం, సమగ్ర సర్వే వివరాలు వచ్చిన తర్వాత రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారుల స్థాయిలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎంకు సమగ్ర నివేదికను సమర్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ఫ్యూచర్‌సిటీ-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పక్కనే హైస్పీడ్ రైలు మార్గం నిర్మించే అంశంపైనా అధికారులు చర్చించినట్లు తెలిసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు మార్గాన్ని నిర్మించాలనే ప్రతిపాదనపై ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఈ ప్రతిపాదనకు కేంద్రమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనంలో తెలిపింది.

మరో 20-25 మీటర్ల మేర భూమి సేకరణ..

రీజినల్ రింగు రోడ్డుకు పక్కనే రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలంటే అదనంగా మరికొంత భూమి అవసరమవుతోందని ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతానికి ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం కోసం (ప్రస్తుతం 6 లేన్లు, భవిష్యత్‌లో 8 లేన్లు) ఉత్తరభాగంలో 100 మీటర్ల వెడల్పుతో భూ సేకరణ చేపట్టారు. దాదాపు ఇది పూర్తికావొచ్చింది. తాజాగా రోడ్డుతో పాటే రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనతో మరికొంత భూమి కావాలి. ఇందుకోసం అదనంగా మరో 20-25 మీటర్ల వెడల్పున భూమిని సేకరించాలని మంగళవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. రైలు మార్గం ఏర్పాటుకు సుమారు 40-45 మీటర్ల వెడల్పుతో భూమి కావాలని రైల్వే అధికారులు అంటున్నారు. దాంతో అదనంగా 20-25 మీటర్లు సేకరించి, ఇంకా కావాల్సి ఉంటే భవిష్యత్‌లో రోడ్డు అభివృద్ధికి ఇబ్బంది లేకుండా ఉండేలా భూమిలో కొంత భాగాన్ని వినియోగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ అంశాన్ని తేల్చేందుకే ప్రాథమిక సర్వేను చేపట్టనున్నారు. అలాగే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో రైలు మార్గం నిర్మాణానికి ఉన్న అవకాశాలపై తొలుత సర్వే చేయనున్నారు. తర్వాత దక్షిణభాగం వైపు నిర్వహించనున్నారు. కాగా, రైలు మార్గం నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో ఉత్తరభాగంలోనే ఇబ్బందిగా ఉంటుందని.. దక్షిణభాగంలో రోడ్డు, రైలు మార్గాలకు కలిపే భూమిని సేకరించే అవకాశం ఉందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. మరోవైపు ప్రస్తుతం ప్రతిపాదించిన రీజినల్ రింగు రైలు.. ఆర్‌ఆర్‌ఆర్‌కు 3-4 కి.మీ దూరంలోనే ఉందని చెబుతున్నప్పటికీ ఎఫ్‌ఎల్‌ఎస్ వివరాల ప్రకారం ఒక్కోచోట 11-14 కిలోమీటర్ల మేర దూరం ఉండడం గమనార్హం. అలా కాకుండా ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే రైలు మార్గంతోపాటు అవసరమైన చోట స్టేషన్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా కూడళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

'ఇంటిగ్రేటెడ్ మల్టీమోడల్'లో భాగంగానే..

రోడ్డు, రైలు మార్గాలు పక్కపక్కనే ఉంటే.. ప్రజల ప్రయాణాలకు సౌకర్యంగా ఉండడంతో పాటు రవాణా ఆధారిత వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అదే విధంగా ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన నూతన విధానం 'ఇంటిగ్రేటెడ్ మల్టీమోడల్'లో రోడ్డు, రైలు మార్గాలను నిర్మించాలని.. ప్రస్తుతం ఎక్కడైనా రోడ్డు, రైలు మార్గాల మధ్య దూరం ఉంటే వాటి అనుసంధానతను పెంచాలని నిర్ణయించింది. అందులో భాగంగానే రీజినల్ రింగు రైలును ఆర్‌ఆర్‌ఆర్ పక్కనే నిర్మించాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ విధానం మెట్రో రైలు, బస్సులతో పాటు స్థానిక ప్రయాణాలకు అత్యంత అనువుగా ఉంటుందని, ట్రాఫిక్‌ను తగ్గించేందుకూ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పక్కపక్కనే రోడ్డు, రైలు మార్గాల నిర్మాణాలు జరిగితే దేశంలో ఇదే మొదటిది అవుతుందని కూడా అధికార వర్గాలు అంటున్నాయి.

పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు!

- తొలి దశలో జీహెచ్‌ఎంసీలో అమలు
- పేదలు నివసిస్తున్న చోటే జీ+3 పద్ధతిలో నిర్మాణం
- 4 జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్ష
- అవసరమైన స్థలాలను గుర్తించాలని ఆదేశం



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో మొదటి దశ కింద ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ కొలిక్కి రావడంతో తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన కార్యాచరణపై మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించామన్నారు. పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసిస్తున్న చోటే జీ+3 విధానంలో ఇళ్లను నిర్మించి ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేటు వ్యక్తులకు చెంది.. పేదల ఆధీనంలో ఉన్న స్థలాలు, కబ్జాకు గురైన ప్రాంతాలను కూడా గుర్తించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రతి జిల్లా కలెక్టర్ ఒక ప్రత్యేక అధికారిని నియమించుకోవాలని సూచించారు. పట్టణాల్లోని అసెంబ్లీ స్థానాల పరిధిలో ఉన్న జనాభాను దృష్టిలో ఉంచుకుని అదనంగా ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 166 మురికివాడల్లో సుమారు 42,432 మంది నివసిస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాలో 106, సంగారెడ్డిలో 5, మేడ్చల్ మల్కాజిగిరిలో 12, రంగారెడ్డిలో 26 మురికివాడల్లో సర్వే నిర్వహించి.. పేదలు 25,501 కచ్చా ఇళ్లలో ఉంటున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్ని మురికివాడల్లో ఎంత భూమి అందుబాటులో ఉంది? జీ+3 విధానంలో ఎన్ని ఇళ్లను నిర్మించవచ్చు? అనే అంశాలపై ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. అలాగే ఈ 4 జిల్లాల్లో పరిధిలో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి హైదరాబాద్ పరిధిలో ఉంటున్నవారెవరూ వెళ్లడం లేదని, ఫలితంగా 30 వేల ఇళ్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇల్లు దక్కినా, అక్కడికి వెళ్లని వారికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తిచేయాలని, అన్ని మౌలిక వసతులూ కల్పించి, మిగిలిపోయిన ఇళ్ల కేటాయింపులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం హౌసింగ్ కాలనీల తనిఖీ కోసం రూపొందించిన యాప్‌ను మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- సాయంత్రం సోనియాగాంధీతో భేటీ
- సుదీర్ఘకాలం తరువాత కలుస్తున్న సీఎం
- గతేడాది మార్చి తరువాత మళ్లీ ఇప్పుడే కీలక అంశాలపై చర్చించే అవకాశం
- రేపు ఇండి కూటమి ఎంపీలతో.. ఏఐసీసీ కార్యాలయంలో సమావేశం
- బీసీల 42 శాతం రిజర్వేషన్లపై.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, జులై 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంపై పార్టీ అధిష్ఠానంతో చర్చించనున్నారు. అలాగే రిజర్వేషన్ల పెంపు, ఆవశ్యకతను తెలుపుతూ ఇండి కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పరిస్థితులు, సామాజిక వర్గాల వారీ వివరాలను ఎంపీలకు వివరించనున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించుకుని కేంద్రానికి పంపిన రెండు బీసీ బిల్లులను ఆమోదించేలా పార్లమెంటులో చర్చ పెట్టాలని ఎంపీలను కోరనున్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని కూడా కలిసి ఈ అంశంపై మాట్లాడనున్నట్టు సమాచారం. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రమే సోనియాగాంధీని కలవనున్నారు. సుదీర్ఘకాలం తరువాత ఆమెను సీఎం కలుస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. చివరిగా గత ఏడాది మార్చిలో సోనియాను కలిసిన రేవంత్‌రెడ్డి.. మళ్లీ ఇన్నాళ్ల తరువాత కలుస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక సోనియాతో రేవంత్ భేటీ అవుతుండడం మూడోసారి మాత్రమే కావడం గమనార్హం. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై ఆమెతో చర్చించనున్నట్టు సమాచారం.

ఈ నెల 30న 'ప్రగతి' సమావేశం

- పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై చర్చ!

ఈ నెల 30న జరగనున్న ప్రగతి సమావేశంలో ప్రధాని మోదీ పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై ప్రభావిత రాష్ట్రాలతో చర్చించే అవకాశాలున్నాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్రాలకు కేంద్రం నుంచి సమాచారం అందింది. వాస్తవానికి ఇప్పటికే రెండు దఫాలుగా ప్రగతి సమావేశం అజెండా నుంచి పోలవరం బ్యాక్ వాటర్ ముంపు అంశం మాయమయింది. ప్రధానమంత్రి స్వయంగా ప్రగతి సమావేశంలో పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై చర్చిస్తారని రెండు దఫాలుగా సమాచారం ఇచ్చినా, అజెండా నుంచే ఈ అంశం పూర్తిగా మాయమైంది. ఈ నెల 30వ తేదీన జరిగే సమావేశంలోనైనా ఈ అంశం చర్చకు వస్తుందా..? లేక మాయమవుతుందా..? అనే దానిపై డైలమా నెలకొంది.

బీసీల 42 శాతం రిజర్వేషన్ల కోసం..

సీఎం నేతృత్వంలో ఢిల్లీకి బృందం

పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేలా అన్ని పార్టీల మద్దతు కూడగడతాం

- ప్రధానిని, రాహుల్, ఖర్గేనూ కలుస్తాం
- రిజర్వేషన్ల అంశం కేంద్రం, రాష్ట్రం మధ్య సమస్య
- రాంచందర్‌రావు అర్థం చేసుకోలేదు
- బీసీలు, దళితులంటే ఆయనకు చిన్నచూపు: భట్టి



హైదరాబాద్, జులై 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్ల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ఇతర నేతలతో కూడిన రాష్ట్ర బృందం ఢిల్లీకి వెళ్లనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున.. బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడానికి అన్ని పార్టీల మద్దతు కోరేందుకు ఈ బృందం వెళుతోందన్నారు. తమ పార్టీకి చెందిన 100 మంది ఎంపీలు కూడా తమతో కలిసి వస్తారని పేర్కొన్నారు. రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను కలిసివచ్చే పార్టీల అధ్యక్షులకు వివరించి, ఆ పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల మద్దతు కూడగడతామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, తమ పార్టీ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ, రాజ్యసభాపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేలను కూడా కలుస్తామన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తాయన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. ఈ రిజర్వేషన్లపై ఎలాంటి న్యాయపరమైన సమస్యలు వచ్చినా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. శాసనసభలో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందడానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సహకరించారని, పార్లమెంటులోనూ ఆమోదం పొందడానికి ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు కలిసివస్తారని ఆశిస్తున్నామని అన్నారు. అసెంబ్లీలో సహకరించిన పార్టీలు.. పార్లమెంటులో అందుకు భిన్నంగా వ్యవహరిస్తాయని తాము అనుకోవడం లేదని చెప్పారు.

ప్రధాని సైతం నిర్ణయం మార్చుకునేలా చేశాం..

కులగణన వద్దన్న ప్రధాని నరేంద్ర మోదీ సైతం జనగణనలో కులగణన చేర్చి చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం చేసిందని భట్టివిక్రమార్క అన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఈ పద్ధతిలో కులగణన జరగలేదని, తెలంగాణ చేపట్టిన కులగణన దేశానికి దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. కులగణనకు సంబంధించి కేంద్రం ఏ సమాచారం అడిగినా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కులగణన విషయంలో అన్నిరకాల పరిణామాలనూ ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకెళుతోందని చెప్పారు. ఇక మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బంది రావొద్దన్న ఉద్దేశంతో ఆర్డినెన్స్ తెస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆర్‌టీఐ కమిషనర్లలో ఒక్క బీసీ లేరన్న విమర్శలపై స్పందిస్తూ.. ఇతర కార్పొరేషన్ల పోస్టుల్లో సామాజిక న్యాయం ఉంటుందని చెప్పారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించినవారు అన్నింటినీ గాలికి వదిలేశారని, తమకు నిబద్ధత ఉన్నందున ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు దళితులు, బీసీలంటే చిన్నచూపు అని భట్టివిక్రమార్క ఆరోపించారు. ఈ వర్గాల కోసం ఏ రాష్ట్రం ప్రయత్నించినా అడ్డుగా మాట్లాడటం ఆయనకు అలవాటన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో రోహిత్ వేముల మృతి సంఘటనలో ఆయన పాత్ర ఏమిటో అందరికీ తెలుసునన్నారు. రిజర్వేషన్ల బిల్లును తాము తెచ్చినందున.. తామే పరిష్కరించుకోవాలని రాంచందర్‌రావు అంటున్నారని.. కానీ ఇది కేంద్రం, రాష్ట్రం మధ్య నెలకొన్న సమస్య అని తెలిపారు. బీజేపీకి సంబంధించింది కాదన్నారు. ఈ విషయాన్ని రాంచందర్‌రావు సరిగా అర్థం చేసుకోనట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. రాంచందర్‌రావు పంపించిన లీగల్ నోటీసు గురించి ప్రస్తావించగా.. తాను గతంలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. లీగల్ నోటీసు అందిన తర్వాత పార్టీపరంగా, వ్యక్తిగతంగా సమాధానం చెబుతామని ఆయన తెలిపారు.

నిజామాబాద్‌లో పామాయిల్ పరిశ్రమ!

- బోధన్ ప్రాంతంలో ఏర్పాటుకు సీఎం సుముఖత
- చెరుకు పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన సర్కారు.. రాష్ట్రంలో మరో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఆరు ప్రాంతాల్లో ఈ పరిశ్రమల నిర్మాణాలు పురోగతిలో ఉండగా.. కొత్త ఫ్యాక్టరీని నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు! చెరుకు సాగుకు చిరునామాగా ఉండే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు పొరుగున ఉన్న మెదక్ జిల్లా రైతులను ఆయిల్ పామ్ సాగువైపు మళ్లించడమే లక్ష్యంగా.. ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సర్కారు ప్రణాళికలు రచించింది. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్ మండలాల మధ్య ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. దీన్ని తొలుత నిర్మల్ జిల్లాలో ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు రాగా, అక్కడ ఉద్యానశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. కానీ అక్కడ ఫ్యాక్టరీ మనుగడ సాధించటం కష్టమని తేలడంతో వెనక్కితగ్గారు. బోధన్ నియోజకవర్గంలో ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా సుముఖత వ్యక్తం చేశారని.. నెలాఖరులో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించ బోయే బహిరంగసభలో ఆయన దీనిపై ఒక ప్రకటన చేయనున్నారని సమాచారం. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే 8 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగుచేస్తుండగా.. ఏడాదిలోగా ఆ విస్తీర్ణాన్ని 15 వేల ఎకరాలకు పెంచాలని రాష్ట్ర ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

31 జిల్లాల్లో..

రాష్ట్రంలో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహాయించి 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈమేరకు 14 కంపెనీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. ఆయా కంపెనీలకు ఏరియాలను కూడా పంచింది. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఆగస్టు 15 నాటికి ఈ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇటీవల ప్రకటించారు.

చెరుకు, వరికి ప్రత్యామ్నాయంగా..

రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా ఉంది. ఏడాదికి కోటి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగవుతోంది. వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో... 5 ఎకరాల ఆయిల్ పామ్ తోటకు నీరు అందివ్వొచ్చు. ఈక్రమంలోనే ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో ఒకప్పుడు చెరుకు సాగు ఎక్కువగా ఉండేది. ఒక్క బోధన్ చక్కెర కర్మాగారం పరిధిలోనే 13,500 ఎకరాల్లో చెరుకు సాగయ్యేది. ఇప్పుడది గణనీయంగా తగ్గి, రైతులంతా వరి వైపు మళ్లారు. వారిని ఇప్పుడు ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. చెరుకు కంటే తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో ఆయిల్ పామ్ సాగుచేయొచ్చని రైతులకు అవగాహన కల్పిస్తోంది.

ములుగు.. జలపాతాల సొబగు!

జిల్లాలో ఏకంగా 8 జలపాతాలు.. ప్రతి ఏటా వానాకాలంలో కనువిందు

- బొగత మినహా మిగతావాటికి వెళ్లాలంటే అటవీ అధికారుల అనుమతి ఉండాలి
- అన్ని జలపాతాలను పర్యాటకంగా తీర్చిదిద్దాలంటున్న ప్రకృతి ప్రేమికులు
- కేంద్రం దృష్టిలో కర్రెగుట్టలు.. పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళికలు
- అలా చేస్తే ఈ జలపాతాలకూ సందర్శకుల తాకిడి పెరిగే అవకాశాలు


బొగత

ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ప్రకృతి అందాలకు నెలవు. పర్యాటకులను కట్టిపడేసే సహజ సౌందర్యం ఇక్కడుంది. రామప్ప ఆలయంలో కాకతీయుల కాలం నాటి శిల్పాలు, అహ్లాదాన్ని పంచే లక్నవరం, రామప్ప సరస్సులు, మేడారం సమ్మక్క, సారలమ్మ, రామప్ప, మల్లూరు లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలు.. ఇలా విభిన్న రకమైన అంశాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. వీటితో పాటు వానాకాలంలో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసే జలపాతాలు ఈ జిల్లాలో చాలా ఉన్నాయి. ఈ జలపాతాల్లో పాలనురగల్లా జాలువారే నీటిధారలను చూసిన వారు మంత్రముగ్ధులవుతుంటారు. ములుగులో 8 జలపాతాలు ఉండగా పర్యాటకులు సందర్శించడానికి ప్రభుత్వం నుంచి కేవలం బొగతకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఇక మిగతా జలపాతాల పేర్లు.. బామణిసరి, మాసలొద్ది, దుస్సపాటిలొద్ది, గుండం, ఏనుగుసరి, మహితాపురం, ముత్యంధార. బావణిసరి, మాసలొద్ది, దుస్సపాటిలొద్ది, గుండం, ఏనుగుసరి, బొగత జలపాతాలు వాజేడు మండలంలో ఉంటే.. మమితాపురం, ముత్యంధార జలపాతాలు వెంకటాపురం మండలంలో ఉన్నాయి.


ముత్యంధార

బ్లూ వాటర్ ఫాల్

వాజేడు మండలంలోని మరో జలపాతం మాషేనులొద్ది. ఈ జలపాతాన్ని పర్యాటకులు బ్లూ వాటర్ ఫాల్‌గా పిలుస్తారు. ఈ జలపాతంలోని నీళ్లు నీలిరంగులో కనిపించి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. ఈ జలపాతాన్ని చూడాలనుకునేవారు దూలాపురం నుంచి మూడు కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అందులో ఒక కిలోమీటరు మేర ట్రెక్కింగ్ చేసుకుంటూ పోవాలి. అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. మరో జలపాతం ఏనుగుసరి(ఏనుగుసారు) జలపాతం. మురుమూరు నుంచి 5కిలోమీటర్లు కొండలు, గుట్టలు దాటుకుంటూ పోతే జలపాతం కనిపిస్తుంది. ఇక్కడికి వెళ్లాలనుకునేవారు అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. వాజేడు మండలంలోని మరో జలపాతం గుండం జలపాతం. ఇటీవలే ఈ జలపాతం వెలుగులోకి వచ్చినట్లు పలువురు చెబుతున్నారు. వాజేడు మండలంలోని కృష్ణాపురం నుంచి 7 కిలోమీటర్ల దూరంలోగల బామణిసరి జలపాతానికి వెళ్లాలన్నా అటవీ శాఖ అధికారుల అనుమతులు అవసరం.

700 అడుగుల ఎత్తు నుంచి

ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలంలో ముత్యంధార జలపాతం ఉంది. ఇక్కడ నీళ్లు 700 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడతాయి. ఇక్కడి ప్రకృతి సౌందర్యం పర్యాటకులను ఇట్టే కట్టిపడేస్తుంది. ముత్యంధార జలపాతం వెళ్లాలంటే అటవీశాఖ అధికారులు అనుమతి తప్పనిసరి. వెంకటాపురం మండలంలోని మరో అద్భుతమైన జలపాతం మహితాపురం. ఇక్కడ 120 అడుగుల ఎత్తునుంచి నీళ్లు కిందకు పడతాయి. అయితే ఈ 8 జలపాతాల్లో కేవలం బొగత సందర్శనకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. మిగిలిన ఏడు జలపాతాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసి, పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతాలుగా మార్చి ప్రభుత్వ అనుమతులిస్తే బాగుంటుందని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం వాజేడు, వెంకటాపురం మండలాల సరిహద్దుల్లో గల కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇటీవల ఈ మండలాల్లో పర్యటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతగా మార్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కర్రెగుట్టలు పర్యాటక ప్రాంతంగా మారితే వాటికి సమీపంలోని ఈ జలపాతాలకు పర్యాటకుల తాకిడి పెరుగుతుందని, ఫలితంగా ములుగు జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశముందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.


దుస్సపాటిలొద్ది

ట్రెక్కింగ్ చేయాల్సిందే..

దట్టమైన అడవులు, కొండల మధ్య నుంచి హోరెత్తుతూ వచ్చే నీటి హొయలు నేలకు జాలువారే జలపాతం బొగత. 30 అడుగుల ఎత్తైన కొండ నుంచి నీళ్లు కిందకు దూకే ఈ జలపాతం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. జూలై నుంచి నవంబరు వరకు ఈ జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. శని, ఆదివారాల్లో, పండగ సెలవుల్లో రోజుకు 5వేల నుంచి 10 వేల మంది పర్యాటకులు ఇక్కడికి వచ్చి పోతుంటారు. ఈ జలపాతం వరంగల్ నుంచి 130 కిలో మీటర్ల దూరంలో ఉంది. బొగత సమీపంలోనే దుస్సపాటిలొద్ది(కొంగల) జలపాతం ఉంది. 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు పడే ఈ జలపాతాన్ని గోదావరి గిరిజన ప్రాంతంలోని రహస్య రత్నంగా చెప్పవచ్చు. జూలై నెల నుంచి సెప్టెంబరు వరకు ఇక్కడికి పర్యాటకులు వచ్చి పోతుంటారు. జలపాతం చూడాలనుకునే వారు కొండలను ఎక్కాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రాంతంలో వన్యప్రాణులు ఉండే అవకాశం ఉన్నందున ఇక్కడికి వచ్చే వారు ఫారెస్టు అధికారుల అనుమతి తీసుకోవాలి.

ఇప్పటికిప్పుడే.. ఇక్కడికిక్కడే.. పెళ్లాడతావా.. చావమంటావా?

- బీటెక్ విద్యార్థికి ఓ విద్యార్థిని బెదిరింపులు
- భువనగిరి బస్టాండ్‌లో సుదీర్ఘ హైడ్రామా
- పోలీసుల కౌన్సెలింగ్‌తో సమసిన వివాదం

భువనగిరి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): "ఇప్పుడే వివాహం చేసుకుందాం.. లేదంటే బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకుంటా"నంటూ ఓ విద్యార్థిని బెదిరింపులు.. ఆమె ఎంతగా బలవంతపెట్టినా పెళ్లికి ససేమిరా అన్న విద్యార్థి! భువనగిరి బస్టాండ్‌లో మంగళవారం మధ్యాహ్నం మొదలైన ఈ హైడ్రామా.. రాత్రి దాకా కొనసాగి.. ఎట్టకేలకు పోలీసుల జోక్యంతో ముగిసింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఆ విద్యార్థిని.. రంగారెడ్డి జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి(సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలవాసి)తో ఆమెకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ హైదరాబాద్ పరిసరాల్లోని వేర్వేరు హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం భువనగిరి బస్టాండ్‌లో కలుసుకున్నారు. తిరిగి వెళ్లాల్సిన సమయంలో.. "నిన్ను వదిలి నేను వెళ్లను. ఇప్పుడే పెళ్లి చేసుకుందాం" అని విద్యార్థిని మొండికేసింది. దానికి ఆ విద్యార్థి.. "ఇప్పుడే వద్దు. జీవితంలో స్థిరపడ్డాకే చేసుకుందాం" అని వేడుకున్నాడు. ఇలా ఇద్దరి మధ్య వివాదం రాత్రి దాకా కొనసాగింది. అయినా సయోధ్య కుదరకపోగా ఆమె బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం మొదలుపెట్టింది. వీరిద్దరి కదలికలను ఉదయం నుంచి గమనిస్తున్న బస్టాండ్ పారిశుధ్య కార్మికులు, ఆర్టీసీ సిబ్బంది, బస్టాండ్ చెక్ పోస్ట్ కానిస్టేబుల్‌తో పాటు మరికొందరు వారిని మందలించి అక్కణ్నుంచి పంపే ప్రయత్నాలు చేశారు. వారి కుటుంబాలకు సమాచారం ఇచ్చేందుకు ఫోన్ నంబర్లు అడిగారు. కానీ ఇద్దరూ ఇవ్వలేదు. దీంతో వారు ఆ జంటను పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిర్వహించిన కౌన్సెలింగ్‌తో ఇద్దరూ ఇళ్లకు వెళ్లిపోయారు.

గిరిజన బడిలో కరెంట్ షాక్.. ముగ్గురికి గాయాలు

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యుదాఘాతం సంభవించి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. పత్తిపాకకు వెళ్లే దారిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహం భవనంపై స్టడీ అవర్‌లో పలువురు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎనిమిదో తరగతి చదువుతున్న సాయిచరణ్, జి.హేమంత్, టి.సిద్ధార్థ విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది గాయపడిన ముగ్గురు విద్యార్థులను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ రాంరెడ్డి తెలిపారు.

నేటి నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్- 2025 తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఈనెల 24న ధ్రువపత్రాల పరిశీలన, 25 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 28లోగా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

అన్యమత ఉద్యోగుల లెక్క తేలుస్తాం: టీటీడీ

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): 'టీటీడీలో అన్యమత ఉద్యోగుల విషయంలో కఠినంగా ఉన్నాం. గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీ వేశాం..లెక్కలు తీస్తున్నాం. టీటీడీ విజిలెన్స్ వద్ద అన్యమత ఉద్యోగుల వివరాలున్నాయి....విచారిస్తున్నారు. గతంలో అన్యమత ఉద్యోగులపై ఎలాంటి నిఘా లేదు. కొత్త బోర్డు ఏర్పాటైన తర్వాత గట్టిగా వ్యవహరిస్తున్నాం.' అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఆ వివరాలను చైర్మన్, ఈవో బోర్డు సభ్యులతో కలిసి మీడియాకు తెలిపారు. 'అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ అవకాశం ఇచ్చాం. ఇప్పటికే కొందరు ముందుకు వచ్చారు. గతంలో కొంతమందికి ఇంక్రిమెంట్లు కట్ చేశారు. అయినప్పటికీ కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూనే ఉన్నారు. విచారణలో తేలితే వారిని సస్పెండ్ చేస్తున్నాం' అని తెలిపారు.

వచ్చే ఏడాది మార్చిలో యాదాద్రి థర్మల్ ప్లాంట్ పూర్తి

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్లన్నీ 2026 మార్చిలో అందుబాటులోకి రానున్నాయని కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) ప్రకటించింది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి థర్మల్ కేంద్రాల నిర్మాణ పురోగతిపై రెండో త్రైమాసిక నివేదికను విడుదల చేసింది. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భాగంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చివరి యూనిట్-5.. 2026 మార్చిలో వాణిజ్య ఉత్పత్తి(సీవోడీ) ప్రారంభించనుందని పేర్కొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో 4000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒక్కోటి 800 మెగావాట్లు కలిగిన ఐదు యూనిట్లను తెలంగాణ జెన్‌కో నిర్మిస్తోంది. ఇప్పటికే రెండు యూనిట్లు(1-2) విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా.. మూడో యూనిట్ రానున్న డిసెంబరు కల్లా, నాలుగో యూనిట్ అక్టోబరు కల్లా, ఐదో యూనిట్ 2026 మార్చికల్లా పూర్తయితే.. ఒకేచోట 4 వేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ కలిగిన ప్రాంతంగా వీర్లపాలెం రికార్డులకు ఎక్కనుంది.

ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి కన్నుమూత

- కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల నివాళి


మధుసూదన్ రెడ్డి (ఫైల్)

బర్కత్‌పుర/హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి(90) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన మంగళవారం ఉదయం 11 గంటలకు నారాయణగూడలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య విమలారెడ్డి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మధుసూదన్‌రెడ్డి మరణ వార్త తెలియగానే విశ్రాంత న్యాయమూర్తులు, తెలంగాణ ఉద్యమకారులు, వివిధ పార్టీల నేతలు, ప్రొఫెసర్లు, వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు. మధుసూదన్‌రెడ్డి 1935లో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెంలో జన్మించారు. నగరానికి వచ్చి నారాయణగూడలో స్థిరపడ్డారు. ఆయన ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. మధుసూదన్‌రెడ్డి అంత్యక్రియలు బుధవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరుగుతాయి. మధుసూదన్‌రెడ్డి మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

ఇంధన స్విచ్‌ల్లో ఎలాంటి సమస్యలు లేవు

- బోయింగ్ విమానాల తనిఖీ పూర్తి: ఎయిరిండియా

న్యూఢిల్లీ, జూలై 22: బోయింగ్ 787, 737 విమానాల ఇంధన నియంత్రణ స్విచ్ (ఎఫ్‌సీఎస్) లాకింగ్ వ్యవస్థల్లో ఎటువంటి సమస్యలు లేవని ఎయిరిండియా తెలిపింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తమ వద్ద ఉన్న అన్ని బోయింగ్‌ల్లో ఈ నెల 12న చేపట్టిన తనిఖీలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసినట్లు పేర్కొంది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానంలోని రెండు ఇంధన స్విచ్‌లు 'రన్' నుంచి 'కటాఫ్' మోడ్‌కు మారడంతో ఇంధన సరఫరా నిలిచిపోయి, ప్రమాదానికి కారణమైనట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇటీవల విడుదల చేసిన ప్రాథమిక నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో బోయింగ్‌లతో పాటు దేశ వ్యాప్తంగా నడుస్తున్న అన్ని విమానాల ఇంధన స్విచ్ వ్యవస్థలను తనిఖీ చేయాలని, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని ఈ నెల ప్రారంభంలో విమానయాన సంస్థలను డీజీసీఏ ఆదేశించింది.

ఏపీ మద్యం కేసు.. శ్రవణ్‌రావుకు నోటీసులు!

- శ్రవణ్, ఆకర్ష్ ఫ్లాట్‌లోనే.. లిక్కర్ స్కామ్ నిందితులు
- ఆధారాలను సేకరించిన సిట్

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావుకు ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంలో నోటీసులు జారీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసుతో సంబంధం ఉందంటూ తెలంగాణ ప్రాంతానికి చెందిన వారికి నోటీసులు రావడం ఇదే తొలిసారి. దుబాయ్‌లో శ్రవణ్ రావు, ఆకర్ష్ భాగస్వామ్యంలో కొనుగోలు చేసిన ఖరీదైన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో.. మద్యం కుంభకోణం నిందితులు మకాం వేశారు. ఈ క్రమంలో సిట్ మంగళవారం ఆకర్ష్‌ను విజయవాడలో విచారించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు.. సుమారు 8 గంటల పాటు ఆకర్ష్‌ను పలు కోణాల్లో ప్రశ్నించింది. ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు 2 నెలలు ఆ ఫ్లాట్‌కు యజమానిగా శ్రవణ్‌రావు కోటాలో ఐదుగురు ఫ్లాట్‌లో ఉన్నారని ఆకర్ష్ చెప్పినట్లు తెలిసింది. ఆ సమయంలో ఫ్లాట్‌లో ఉన్న ఐదుగురిలో శ్రవణ్‌రావు ఒక్కరే తనకు తెలుసునని, మిగతా వారు ఎవరో తెలియదని చెప్పారు. ఆ ఐదుగురిలో ఉన్న చాణక్య బూనేటి ఏపీ మద్యం కుంభకోణంలో నిందితుడన్న విషయం తనకు తొలుత తెలియదన్నారు. మీడియాలో వచ్చిన కథనాలతోనే విషయం తెలిసిందన్నారు. చాణక్యతోపాటు మిగతా వారికి దుబాయ్‌లోని ఆ ఫ్లాట్‌లో యజమానిగా శ్రవణ్‌రావు కోటాలోనే వసతి కల్పించారన్న ఆధారాలు మీకు ఎక్కడి నుంచి వచ్చాయని ఆకర్ష్‌ను సిట్ ప్రశ్నించింది. దుబాయ్‌లో ఉన్న ఫ్లాట్‌లో తమ వాటాకు సంబంధించి ఆ దేశంలోనే ఉండే ఒక వ్యక్తికి తాము జీపీఏ ఇచ్చామని, ఆ వ్యక్తి అక్కడ ఆ ఫ్లాట్‌ను నిర్వహిస్తున్న డీలక్స్ హాలిడే హోమ్స్ నుంచి మొత్తం వివరాలు అడిగి తెలుసుకుని, తమకు ఇచ్చారని సిట్ అధికారులకు ఆకర్ష్ వివరించారు. దుబాయ్‌లో భాగస్వామ్యంతో ఫ్లాట్ కొనుగోలు చేసినప్పటి నుంచి శ్రవణ్‌రావు తమను ఇబ్బందులకు గురిచేశారని సిట్ అధికారుల ఎదుట ఏకరువు పెట్టినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సిట్ అధికారులు శ్రవణ్‌రావును ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు.

పోస్టాఫీసుల్లో యూపీఐ చెల్లింపులు

రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో యూపీఐతో చెల్లింపులు చేసే విధానం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ(ఏపీటీ) 2.0 సాంకేతికతను తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 32 ప్రధాన, 689 సబ్, 5006 బ్రాంచి పోస్టాఫీసుల్లో యూపీఐ చెల్లింపులు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. కాగా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు భారత తపాలా శాఖ దేశ వ్యాప్తంగా ఏపీటీ 2.0 పేరిట పోస్టాఫీసుల్లో నూతన అప్లికేషన్‌ను వినియోగంలోకి తీసుకువస్తోంది. ఇందులో భాగంగా పోస్టల్ శాఖ వినియోగిస్తున్న సాంకేతికత పరిజ్ఞానాన్ని కూడా ఏపీటీ2.0కు అప్‌గ్రేడ్ చేశారు. దీంతో యూపీఐ చెల్లింపులకు అవకాశం ఏర్పడింది. అలాగే,పార్శిళ్లకు సంబంధించిన అప్‌డేట్స్ ఇకపై వినియోగాదారుల మొబైల్‌కు వస్తాయి.

వచ్చే 3 రోజులు అతి భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్.. జారీ చేసిన వాతావరణ కేంద్రం

- ఉమ్మడి రంగారెడ్డిలో కుండపోత
- పిడుగుపాటుకు ఒకరి మృతి
- మళ్లీ తెరుచుకున్న శ్రీశైలం గేటు
- 90,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


శ్రీశైలం ప్రాజెక్టు ఒక గేటు నుంచి విడుదల అవుతున్న నీరు

ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గడచిన 24 గంటల్లో వికారాబాద్ జిల్లా తాండూరు, దౌల్తాబాద్, సంగారెడ్డి జిల్లా కంగ్టి, నల్గొండ జిల్లా ఆదిదేవుల పల్లిలో అత్యధికంగా 10 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. అలాగే, రాష్ట్రంలోని 585 మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు తెలిపింది.

పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. వికారాబాద్ జిల్లా తాండూరులో 11.18, దౌల్తాబాద్ మండలంలో 10.68, యాలాలలో 8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో భారీ వర్షానికి పలుచోట్ల వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. తాండూరులో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పరిగి పట్టణంలోనూ లోతట్టు ప్రాంత కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండల తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరి రికార్డులు తడిసిపోయాయి. మహబూబ్‌నగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటు నిర్మల్ జిల్లాలోనూ భారీ వర్షాలు పడ్డాయి. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తలోడికి చెందిన చాప్లే ఏమాజీ(55) మంగళవారం పిడుగుపాటుతో మృతి చెందగా, ఆయన కుమారుడు అజయ్‌కు గాయాలయ్యాయి.

90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్టు గేటు మళ్లీ తెరుచుకుంది. ప్రాజెక్టుకు 90,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో మంగళవారం ఒక గేటును ఎత్తి 27 వేలు, రెండు విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 67,185 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 883.70 అడుగులకు చేరుకుంది. జూరాలకు 1.02 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదవుతోంది. మొత్తం 8 గేట్ల ద్వారా 32,752, విద్యుదుత్పత్తి ద్వారా 36,278 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్‌ల నుంచి క్రమంగా వరద తగ్గుముఖం పట్టింది. అలాగే, నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 74,474 క్యూసెక్కులు నీరు చేరుతోంది. ఇక, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీలోకి 98,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు.

హెచ్‌సీఏ కేసులో ముగిసిన నిందితుల విచారణ

- మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచిన సీఐడీ
- హెచ్‌సీఏ ఎన్నికల్లో బ్యూరోక్రాట్ల ఓట్లపై సీఐడీ వివరణ

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ పత్రాలతో అధ్యక్షుడి ఎన్నిక తదితర అంశాలపై నమోదైన కేసులో.. నిందితుల కస్టడీ మంగళవారంతో ముగిసింది. ఆరు రోజుల పాటు నిందితులను సీఐడీ ప్రశ్నించిన విషయం తెలిసిందే..! మంగళవారం సాయంత్రం జగన్‌మోహన్‌రావుతో పాటు.. శ్రీనివాసరావు, సునీల్ కాంతే, రాజేందర్ యాదవ్, కవితకు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి, మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను మల్కాజిగిరి కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. కవితను చంచల్‌గూడ మహిళా జైలుకు, మిగతా నిందితులను చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. మరోవైపు.. జగన్‌మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అక్రమ మార్గంలో ఒకేఒక్క ఓటు తేడాతో ఎన్నిక అవ్వడానికి సాయపడ్డ వారి వివరాలను సీఐడీ గుర్తించినట్లు సమాచారం. అక్రమ మార్గాల్లో జగన్ గెలిచేలా తెరవెనక ఉండి కృషి చేసిన వారికి సీఐడీ త్వరలో నోటీసులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నిక విషయంలో ఇప్పటికే తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురవారెడ్డి పలుమార్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే..! అందుకు సంబంధించిన ఆధారాలను అందజేస్తూ.. సీఐడీతోపాటు, ఈడీకి ఫిర్యాదు చేశారు. కాగా.. హెచ్‌సీఏ ఎన్నికల్లో 23 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఓట్లు వేశారని, దర్యాప్తు అధికారులు వీరికి నోటీసులు జారీ చేయనున్నట్లు వచ్చిన వార్తలపై సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా వివరణ ఇచ్చారు. పలు క్లబ్‌లు, వాటికి అనుసంధానంగా ఉన్న సంస్థల నిబంధనలు తెలియకుండా బ్యూరోక్రాట్లు ఓట్లు వేశారని ఆరోపణ చేయడం అసమంజసమని పేర్కొన్నారు. ఏ బ్యూరోక్రాట్‌కు కూడా తన వ్యక్తిగత హోదాలో హెచ్‌సీఏ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదని స్పష్టం చేశారు. క్లబ్‌లతో వారికి ఉన్న అనుబంధం మేరకు ఓటు హక్కు వస్తుందని గుర్తుచేశారు. హెచ్‌సీఏ కేసు విచారణలో కొత్త అంశాలు వెలుగులోకి వస్తే.. తామే మీడియాకు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.